# బహుళ

## త్రైమాసిక అంతర్జాతీయ అంతర్జాల మహిళా పత్రిక


సంపుటి -1 సంచిక - 2

2022 ఫిబ్రవరి 01



# కొమురం సోం బాయి


# కొత్త పుస్తకాలు



దీపావళి (కథలు) అనువాదం జ్వలిత

Anvikshiki Publishers Pvt.Ltd.
Azra House, 59/C/D, MLA Colony,
Banjarahills, Hyderabad
Ph: 970 597 2222, 984 988 8773
www.amazon.in/anvikshikipublisher


వెల: 200/-




విమర్శనాలోకనం - డా. సిహెచ్. సుశీలమ్మ

Ch. Suseelamma, 214 Narayanadri,
SVRS. Brundavanam, Saroor Nagar,
Hyderabad - 500 035.
Phone: 9849117879

వెల: 150/-




అక్షింతలు (మినీ కవితలు) బైరి ఇందిర

Bhairy Indira, C/O. M. Sridhar,
Plot no: 107, Golden Nest Aparts,
Nizampet, Bandari Lay out,
Hyderabad - 500090.Mobile: 98491 73560
bhyriindira@gmail.com


వెల : 150/-



మరొక ప్రారంభం (కవిత్వం) బైరి ఇందిర

Bhairy Indira, C/O. M. Sridhar,
Plot no: 107, Golden Nest Aparts,
Nizampet, Bandari Lay out,
Hyderabad - 500090.Mobile: 98491 73560
bhyriindira@gmail.com

వెల: 120/-




వలపోత (కథలు) బైరి ఇందిర

Bhairy Indira, C/O. M. Sridhar,
Plot no: 107, Golden Nest Aparts,
Nizampet, Bandari Lay out,
Hyderabad - 500090.Mobile: 98491 73560
bhyriindira@gmail.com

Pages : 112
Price : 150/-

# ఫోబియాలవసరం లేదు...



ఏ విషయం గురించైనా అతిగా భయపడటాన్ని ఫోబియా అంటారు. ఫోబస్ అనే గ్రీకు పదం నుండి వచ్చినది ఇది. వ్యాధిగ్రస్తమైన భయం అనే అర్థంతో వాడతారు. ఫోబియా అనేది దీర్ఘకాలికంగా నిరంతరం కొనసాగే భయం. అకారణంగా తరచుగా కలిగే ఈ భయం మానసిక రుగ్మతలకు మానసిక క్షోభకు గురిచేస్తుంది. ఈ ఫోబియాలు ఉన్నప్పుడు రోగ నిర్ధారణ చేయడం కూడా కష్టమవుతుంది... అనేక సామాజిక అపోహలకు గురయ్యే ప్రతొక్కరికీ ఇది వర్తిస్తుంది.

క్రోమోఫోబియా లేదా క్రెమాటోఫోబియా అనేది రంగుల వలన కలిగే భయం. నిరంతరం, అహేతుకంగా కలిగే ఈ భయం ఆ రంగు పట్ల విరక్తిని కలిగిస్తుంది.

మనుషులకే కాదు జంతువులకు కూడా ఈ ఫోబియాలు ఉంటాయి. అయితే మనం ఇప్పుడు మనుషుల ఫోబియా గురించి మాట్లాడుకుంటున్నాము కనుక జంతువుల ఫోబియాలు జంతువుల వలె ప్రవర్తించే మనుషులను పక్కకు పెట్టేద్దాం...

నేను ఇక్కడ ఏ కులం మతం ప్రాంతం వర్గం జెండర్ గురించి ప్రస్తావించను... కానీ మనుషులకు సహజంగా కొన్ని ఫోబయాలు ఉంటాయి అని చెప్ప దలుచుకున్నాను.. ఉదాహరణకి ముఖ్యంగా బహుజనులు అనేవారు తమ భావ వ్యక్తీకరణకు ఎంతగా భయపడుతున్నారో రెండు మాటలు.

బహుజనులని అని చెప్పుకోవడానికి భయపడుతున్న కొన్ని సమూహాలు ఉంటే.. మరికొన్ని తాము బహుజన వాదాన్ని పాటించడంలేదని పరోక్షంగా చెప్పడం కోసం తమకు నష్టం కలిగించిన వారితో కూటమిగా ఏర్పడి స్వలాభాన్ని పొందుతున్నారు. మరికొందరు తమకు తాము బహుజన వాదులుగా చెబుతూనే బహుజనులను దూరం పెట్టి సొంత అస్తిత్వాన్ని చాటుతూ ఐడెంటిటీ కోసం ప్రయత్నిస్తున్నారు.

ఇక్కడ మనువాదం గురించి మనువాదుల గురించి చర్చలేదు.. వారు చాలా లౌక్యంగా తమ పనులను చాప కింద నీరులా చేస్తూనే ఉన్నారు. మళ్లీ రంగుల గురించి టాపిక్ కు వద్దాం.. ప్రస్తుతం మనుషుల్లో నల్ల రంగు అంటే అయిష్టత నల్లరంగు మనుషుల పట్ల హేయభావం కూడా వారికున్న ఫోబియా వల్ల కలిగినదే అంతే కాదు కొంత స్వార్థంతో స్థిరపడినది. ఆ స్వార్థంలో ఉన్న సౌఖ్యాన్ని ఫోబియాల పేరుతో అనుభవిస్తున్నారు.

ఉదాహరణకు నోమోఫోబియా గురించి చెప్పొచ్చు. నోమోఫోబియా అంటే 'నో మొబైల్ ఫోబియా' ఒకవేళ మొబైల్ లేకపోయినా.. ఉన్నది పోగొట్టుకున్నా.. అందులో చార్జింగ్ లేకపోయినా.. బ్యాటరీ లేకపోయినా.. మొబైల్ పని చేయకపోయినా కలిగే అసౌకర్యానికి భయపడడం. ఈ ఫోబియా ఆఫ్రికా ఆసియా దేశాలలో 2005లో మొదలైంది. ఈ నోమోఫోబియా వంటిదే క్రోమిటోఫోబియా. ఈ రెంటిని పోలినదే బహుజన వాద ఫోబియా..

బహుళ మొదటి సంచిక విడుదలైన తర్వాత కొందరు కొన్ని ప్రచారాలను ముందుకు తెచ్చారు. కొందరు స్వయంగా ఫోనులో ప్రశ్నించారు కూడా... 'బహుళ ఒక వర్గానికి చెందినదా..? ఒక కులానికి చెందినదా..? కేవలం బహుజన కులాలకు చెందిన పత్రిక మాత్రమేనా..? అని.

బహుశా క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే ముఖచిత్రాన్ని కలిగి ఉండడం వల్ల ఆ ప్రచారం జరిగి ఉండవచ్చు.. సరస్వతిదేవి బొమ్మ వెయ్యక పోవడం ఒక సమస్య.. సావిత్రిబాయి బొమ్మ వెయ్యడం మరొక సమస్య అయింది వారికి.

సావిత్రిబాయి గురించి తెలిసి లేకపోవడం ఆ ప్రశ్నలకు కారణం కావచ్చు.. తనను బాధించి వేధించి అక్షరాలకు దూరం చేసిన భావజాలాన్ని వ్యతిరేకిస్తూ... భర్త మరణించిన బ్రాహ్మణ మహిళల సహాయార్థం ప్రత్యేక ఆశ్రమాన్ని నిర్వహించి, కులంతో సంబంధం లేకుండా అందరి స్త్రీలకు విద్య అవసరమని జీవితకాలం పనిచేసిన సావిత్రిబాయి పూలే భావజాలాన్ని అర్థం చేసుకున్న ప్రతి ఒక్కరికి 'బహుళ' అంటే ఎటువంటి ఫోబియా అవసరం లేదని అర్థమవుతుంది... అంతే అదే బహుళ... అర్థమయింది కదా...

...జ్వలిత ప్రధాన సంపాదకురాలు


## సంపాదక వర్గం

**ప్రధాన సంపాదకురాలు**
జ్వలిత

**ప్రధాన సలహాదారులు**
డా. తిరునగరి దేవకీదేవి
అనిశెట్టి రజిత
డా. కొమర్రాజు రామలక్ష్మి

**సంపాదక వర్గం**
ఆచార్య సూర్య ధనుంజయ
జి. విజయలక్ష్మి
డా. షాజహానా
కొల్లాపురం విమల
డా. త్రివేణి
డా. నందిగామ నిర్మల
నస్రీన్ ఖాన్
నాంపల్లి సుజాత
నిరుపమ
లావణ్య
డా. మారోజు దేవేంద్ర
రమాదేవి బాలబోయిన

**సాంకేతిక వర్గం**
చందన్ కలిత
టి. నరేష్ చైతన్య
కె. ప్రకాష్

**కార్యనిర్వాహక వర్గం**
జయింతి వాసరచెట్ల
సరోజన బోయిని
యడవల్లి శైలజ
సిస్టర్ అనసూయ
పోతన జ్యోతి


**బహుళ బహుజనస్త్రీలసమస్యలన్నింటినీ చర్చించే అవకాశం కల్పిస్తుంది. పత్రికలో ప్రచురించే రచనలతో సంపాదక వర్గం ఏకీభవించినట్టు కాదు.**

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| | ముఖచిత్రం | కొమురం సోం బాయి | పెన్సిల్ ఆర్ట్ – జ్వలిత ....................1 |
| | కొత్తపుస్తకాలు | | ....................2 |
| 1. | కథ | బంధము ప్రతిబంధకము | డా. ప్రతిభాలక్ష్మి ....................5 |
| 2. | వ్యాసం | బలి పశుత్వానికి అంతం లేదా? | అనిశెట్టి రజిత ....................8 |
| 3. | కవిత | నిరీక్షించడమంటే | నాంపల్లి సుజాత....................9 |
| 4. | వ్యాసం | స్త్రీలకు వివాహ వయసు | డా. తిరునగరి దేవకీదేవి....................10 |
| 5. | అనువాద కథ | రసోత్కృష్టం | నిగమ ....................11 |
| 6. | కవిత | గళాధిపత్యం | నస్రీన్ ఖాన్ ....................15 |
| 7. | కథ | వెన్నెల గొడుగు | డా. తాళ్లపల్లి యకమ్మ ....................16 |
| 8. | వ్యాసం | విముక్త స్త్రీల ముక్త గీతాలు, బౌద్ధంలో స్త్రీలు | కొల్లాపురం విమల ....................21 |
| 9. | కవిత | రైతో రక్షతి రక్షితః | సౌజన్య వేముల....................26 |
| 10. | సమీక్ష | ఓల్గా పుస్తకం | డా॥కొండపల్లి నీహారిణి ....................27 |
| 11. | కథ | ధర్మీబాయి దొకాన్ | ఆచార్య సూర్య ధనుంజయ్....................30 |
| 12. | వ్యాసం | ప్రశ్నించే గొంతుకలపై కుట్ర | నస్రీన్ ఖాన్ ....................37 |
| 13 | సమీక్ష | ఆమె తెరవని పుస్తకం | డాక్టర్ పసుపులేటి నాగమల్లిక ....................40 |
| 14. | కవిత | వీడ్కోలు గజల్ | రమాదేవి బాలబోయిన ....................40 |
| 15 | కథ | కంచికెళ్ళని కథ | వేలూరి ప్రమీల శర్మ....................41 |
| 16. | వ్యాసం | కళ్ళకు ముప్పు | డా. ప్రతిభాలక్ష్మి ....................43 |
| 17. | కథ | తిత్రీ బాయి | శాంతి శ్రీ బెనర్జీ....................44 |
| 18. | వ్యాసం | మారాల్సిందే మహిళలే | సుజాత నాంపల్లి....................47 |
| 19. | కథ | బంధాలను మింగిన మనిషి | యడవల్లి శైలజ ప్రేమ్ ....................49 |
| 20. | వ్యాసం | ఒడి నిండా బాల్యం | మణినాథ్ కోపల్లె ....................52 |
| 21. | కథ | ఎఱ్ర రేగళ్లు | తంగెళ్ల శ్రీదేవిరెడ్డి....................55 |
| 22. | కథ | ఆగమైతడు | సిస్టర్ అనసూయ....................63 |
| 23. | కవిత | డెజావు | రోహిణి వంజారి....................65 |
| 23. | కళ | నేనూ.... నా ఆర్ట్ | సంధ్య తిరునగరి ....................66 |
| 24. | వ్యాసం | స్వేచ్ఛ | సరోజన బోయిని....................68 |
| 25. | పరిచయం | నా సుదీర్ఘ హత్య గురించి నేనే | జ్వలిత....................70 |
| 26. | | బాలబహుళ | ....................72 |

కథ

# బంధమా.. ప్రతి బంధకమా..!!

- డా. ప్రతిభాలక్ష్మి



"మానభంగాలు మాకు మామూలే.!!" అనిత అన్న ఆ మాటలకు నేను ఒక్క సారిగా అవాక్కయ్యాను. ఒక మహిళకు మానభంగం జరిగిన విషయం గురించి తన కుటుంబ సభ్యులతో మాట్లాడి, పంపించాక, అప్పటికే నా కోసం ఎదురు చూస్తున్న అనిత వైపు చూడగా, తను అన్న ఆ మాటకు ఆశ్చర్యపోయాను. అది ఏదో ఆవేదనతో అన్నదే కానీ, నిజంగా తన ఉద్దేశం అది కాదులే అని సరిపుచ్చుకోవాలి అనుకుంటున్న నాకు, "నిజమే మేడం.. మాకు మానభంగాలు మామూలే. కానీ ప్రతి సారీ చేసేది ఒకే వ్యక్తి.. అదీ మా భర్తే." అంది, పూర్తి స్పృహతోనే తాను ఆ మాట చెబుతుంది అని నిర్ధారిస్తూ.

వృత్తి పరంగా లాయర్ ని అయ్యి, మహిళల హక్కుల కోసం కృషి చేస్తున్న నాకు, అడుగు అడుగులో మహిళలు ఎదురుకొంటున్న అసమానతలు, అణిచివేతలు కనిపిస్తూనే ఉన్నాయి. ఆడపిల్లను భారంగా భావించి, సరైన బట్టలు, భోజనం, విద్య అందించడానికి కూడా వివక్ష చూపించే తల్లితండ్రుల చెర నుండి బయట పడిన వారు, తమ మీద ఆధారపడి బ్రతకటానికి, ఉద్యోగం ఆశించని ఒక బానిస వచ్చింది అనే ఆలోచనా దృక్పధంతో ఆహ్వానించే అత్తా మామల కట్టడిలోకి వెళ్లడం అనేది ఒక మైలు రాయి. తన జీవితం అంతా, భర్త బాగోగులు చూసుకోవడం కోసమే అని భావించి భర్తను భరిస్తూ, భారంగా బ్రతుకు బండి లాగడమే ఆడదాని జీవితం అనుకుంటారు.

అనిత, మా ఇంటి దగ్గర్లో ఉంటుంది. బాగా చదువుకొని ఒక మంచి ఉద్యోగంలో ఉంది. ఎప్పుడైనా కనిపిస్తే పలకరించడం తప్ప, నాకు తనతో పెద్దగా పరిచయం లేదు. రెండు గంటల క్రితం నాకు తన నుండి ఫోన్ వచ్చింది. తన భర్త నుండి తనకు విడాకులు కావాలని అంది. 'ముందు కలిసి మాట్లాడదాం రండి' అని నేను అనగా వచ్చింది.

"మానభంగాలు మాకు మామూలే." అని తాను అనడంతో, ఈ అరాచకాలు, ఆక్రన్దనలు, అన్ని వర్గాల మహిళల్లో సహజమేనా అనే భావన కలిగింది.

"అదేంటి మేడం.. అలా అంటున్నారు." అని ఆశ్చర్యంగా అడుగుతున్న నాకు, పెదవులపై ఒక చిరునవ్వు విసిరి,

"ఒక మహిళని ఎవరో మానభంగం చేశారు అని మీరు ఆవేదన చెందుతున్నారు కదా.. కానీ మన దేశంలోని సగం కుటుంబాలల్లో, ప్రతి రోజు జరిగేవి అవే. కాకపోతే, తాళి కట్టి అధికారం పొందడం వల్ల, వారిని శిక్షించడం సాధ్యం కాదు. అంతే." అంది

"అలా అంటారు ఏంటి మేడం. అది ఆడా మగా, ఇద్దరి అవసరం కదా. అది ఒకరి ఇష్టానికి విరుద్ధంగా ఎలా జరుగుతుంది!?" ఆశ్చర్యంగా అడిగాను నేను.

"జోక్ చేయకండి మేడం. ఆడ దాని అవసరం తీర్చే

అవసరం, ఆలోచన, అలవాటు, ఆఖరికి అవగాహన ఎందరు మగవాళ్లకు ఉంటుంది చెప్పండి. అందరూ పెళ్ళాం అంటే తన అవసరాలు తీర్చే వస్తువుగానే చూస్తారు. అధిక శాతం మహిళలు అసలు ఆనందం అంటే ఏంటో తెలియకుండానే జీవితం గడిపేస్తున్నారు కదా అండి" అంది. ఆవేశంతో ఉన్న తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం అవసరం అని నేను నిశ్శబ్దంగా ఉండిపోయా.

ఒక క్షణం నిశ్శబ్దం తరవాత, "సరే, మీ అనుభవంతో చెప్పండి. ఏ స్త్రీని కదిలించినా, కన్నీటి కథలే కదా మేడం. పోయిన వారం మా ఆఫీసులో ఆయమ్మగా పని చేస్తున్న ఒక మహిళను తన జీవితం గురించి అడగగా, 'ఆయన రోజంతా కట్టపడ్డాడని, రేతిరికి ఆ సారా దుకాణం దగ్గర వచ్చిన డబ్బంతా ఖర్చు చేసి వస్తాడమ్మ. ఇల్లు నడిచేది అంతా నా జీతంతోనే.' అంది.

'అదేంటి మరి.. నువ్వు కష్టపడుతున్నావ్ కదా.. అయినా అలాంటి వాడికి ఎందుకు తిండి పెట్టి పోషిస్తున్నావ్. నీ జీవితం నువ్వు బ్రతకొచ్చు కదా' అని నేను అడిగితే,

'తిండి పెట్టడం ఏం కట్టం కాదమ్మా. ఎట్టాగు నా కోసం చేసేదే, కాసిన్ని నూకలు ఎక్కువేస్తే సరి.. కానీ ఆ సారాయి కంపుతో, బలవంతంగా కాపురం చేయమంటాడు కదా.. అదే కట్టంగా వుంటదమ్మా.' అని ఆ ఆయమ్మ, మనసులోని బాధ కళ్ళల్లో చూపిస్తూ చెప్పిన మాట నన్ను ఎంతో బాధ పెట్టింది. అయినా, అది ప్రతి ఇంటి కథే అని సర్దిచెప్పాను. కానీ తప్పు చేశాను అని ఇప్పుడు అనిపిస్తుంది. బాధించే బంధాలను భరించే అవసరం లేదు అని చెప్పవలసి ఉండే.."

తనకు మాట్లాడడానికి మాటలు రావట్లేదు.

"కానీ ఈ రోజు.. ఈ రోజు నన్ను పెళ్లి చేసుకున్న వాడు చేసిన పనికి, ఇక జీవితంలో నేను మళ్ళీ తనకు భార్యగా ఉండను." అంది ఆవేశంగా.

"సరే.. మీకు కోరుకున్నట్టే చేద్దురు కానీ, అసలు ఏమి జరిగింది మేడం.?" అడిగాను, ఇక ఏదో ఒక పరిష్కారం చేయవలసిందే అనే నిర్ధారణతో.

"వివాహం ఒక అనుబంధం అనుకొని చేసుకున్నాను కానీ, అదే ఒక ప్రతి బంధకంగా అవుతుంది అని ఊహించలేదు. పెళ్లి జరిగిన ఈ పది సంవత్సరాలల్లో ఒక్క రోజు కూడా నా సంతోషం గురించి ఆలోచించకుండా, ప్రతి క్షణం, నేను అంటే నా కుటుంబం అనే భావనతో, పాటు పడుతున్నా. ఇంటి బాధ్యత, పిల్లల బాధ్యత చూసుకుంటూ, ఉద్యోగం చేసుకుంటూ, నా కోసం నాకు సమయం లేనంతగా నన్ను నేను ఆక్రమించుకొని బ్రతికేస్తున్నా. కరోనా వల్ల, ఈ మధ్య నా భర్తకు ఉద్యోగం పోయింది. అయినా నేను ఏమీ అనలేదు. మళ్ళీ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తారులే అని అనుకున్నాను. కానీ, రోజంతా ఖాళీ సమయం దొరకడంతో పూర్తిగా ధ్యాస నా మీదకు వచ్చింది. ఒక రకమైన ఆత్మ న్యూనతా భావంతో, అభద్రతా భావంతో నన్ను అను క్షణం హింస పెట్టడం మొదలు పెట్టాడు. శారీరికంగా పెట్టే హింస, ఒక రకమైన మానభంగం అయితే, మానసికంగా పెట్టేది మరొక రకం. మొదటి దానికి కొన్ని నిమిషాలు అర్ధ నగ్నంగా కళ్ళు, నోరు మూసుకొని భరిస్తే ఆ నరకం దాటొచ్చు, కానీ మానసికంగా, అనుమానాలతో అవమానాలతో, అందరిలో అపహేళన చేస్తూ ఇబ్బంది పెడుతుంటే, ప్రతి పురుషుడితో, రంకు అంటగట్టి, అనుచితంగా మాట్లాడుతుంటే, ఇంకా తట్టుకొని కలిసి బ్రతకడం నా వల్ల కాదు మేడం." అంది అంత సేపు ఆపే ప్రయత్నం చేసినా ఆగక, కట్టలు తెంచుకున్న కన్నీటిని వెక్కి వెక్కి వెళ్లగక్కుతూ.

కొన్ని క్షణాలు తనకు కోలుకోవడానికి సమయం ఇచ్చి, "మీ ఆవేదన అర్థం చేసుకోగలను, కానీ మళ్ళీ ఒక సారి ఆలోచించండి. మీ పిల్లల భవిష్యత్తు మీద ఏమి ప్రభావం ఉంటుందో." అన్నాను, మళ్ళీ ఒక సారి తనకు ఆలోచించే అవకాశం ఇవ్వడానికి.

వెంటనే అనిత ఆవేశంగా, "అందుకే విడాకులు అడుగుతున్నా మేడం. నా కొడుకు అలాంటి వాడి పర్యవేక్షణలో పెరిగితే, రేపటి రోజున, మరొక ఇంటి నుండి వచ్చిన ఇంకొక స్త్రీ జీవితం కూడా ఇలాగే దుర్భరంగా మారే అవకాశం ఉంది అనే, వాడిని నా భర్త నుండి కాపాడాలని అనుకుంటున్నా." అంది తన దృఢ నిశ్చయాన్ని తెలియ చేస్తూ.

ఆ పైన నాకు అనితకి నచ్చచెప్పదనికి అవకాశం, అవసరం రెండూ కనిపించలేదు. తనకు నచ్చినట్టు తాను బ్రతికే హక్కు తనకు కల్పించాలి అని అనుకుంటూ అడిగా. "సరే.. పరస్పర అంగీకారంతో అయితే సులువుగా అవుతుంది. దానికి అతను ఒప్పుకుంటాడా.?" అడిగాను అనుమానంగా

"ఒప్పుకోడు మేడం. తనకు నేను అన్నీ సమయానికి అందించే ఒక యంత్రాన్ని. నన్ను ఎందుకు వదులుకుంటాడు. కానీ తన బాధ్యతలు ఏంటో తనకు తెలియట్లేదు. రోజు రోజుకీ నన్ను ఒక మనిషిలాగా కూడా చూడట్లేదు. నా జీతమే కాదు, నా జీవితం మీద కూడా నాకు హక్కు లేదు. కొద్ది రోజుల క్రితం, నా స్నేహితురాలికి ఆరోగ్యం బాగా లేదు అంటే, తన దగ్గరికి వెళ్ళాలి అనుకున్నా. ఖర్చులకు డబ్బులు ఇవ్వమని అడిగితే, 'అవసరాలు తీర్చడానికే వెళ్తున్నావ్ గా, నీ అవసరాలు వాళ్ళు కూడా తీరుస్తారు లే, ఆమె అవసరాలు, ఆమె భర్త అవసరాలు, అన్నీ తీర్చుకొని, బాగా ఎంజాయ్ చేసి రా.' అంటూ అసహ్యంగా మాట్లాడాడు. అలాంటి వాడు ఎప్పటికీ నన్ను చూసుకుంటాడు అనే నమ్మకం నాకు లేదు. " అంది కోపంగా.

"ఇంతకీ ఇవాళ ఏమి జరిగింది.!?" అడిగాను ఒక ముగింపుకి వచ్చే ఉద్దేశంతో.

"ఇవాళ నాకు తల నొప్పిగా ఉంది అని మధ్యాహ్నం ఆఫీస్ నుండి ఇంటికి వచ్చి, టాబ్లెట్ వేసుకొని పడుకున్నా. వచ్చి నా మీద చెయ్యి వేసాడు. 'తల నొప్పిగా ఉంది' అన్నాను. 'ఆఫీసులో బాగా అలిసిపోయావా.. నా దగ్గర మాత్రం ఓపిక లేదా.. ఆఫీసరుని చూసాక నేను నచ్చనులే..' అంటూ ఇంకా ఇంకా అసహ్యంగా మాట్లాడాడు. కోపం ఆపుకోలేక నేను లేచి గట్టిగా అరిచాను, 'ఇప్పుడు తల నొప్పి తగ్గిందా' అంటూ గొడవ పెంచి, నన్ను బలవంత పెట్టబోయాడు. అడ్డుకునే ప్రయత్నం చేయడంతో, నన్ను గోడకు వేసి కొట్టాడు." మళ్ళీ ఒక సారి కట్టలు తెంచుకున్న దుఖ్ఖంతో ఏడుస్తుంది.

కాసేపటికి తనని తాను సముదాయించుకొని, "నన్ను కొట్టే అధికారం తనకు ఎవరు ఇచ్చారు మేడం. ఒక భార్యగా, నా బాధ్యత అనుకొని, తన అవసరాలు అన్నీ తీరుస్తూ, నా జీవితం అంతా ఒక్క తప్పు చేయకుండా, కనీసం సమాజంలో పరువుగా బ్రతకాలి అనుకొని, ఇంటి గుట్టు బయటకు రావొద్దు అని భరిస్తున్న నన్ను.. ఇలా బాధించడం న్యాయమా.? ఇక ఇలా బ్రతకడం నా వల్ల కాదు. బ్రతికినన్ని రోజులు నా పిల్లల్ని ప్రయోజకులుగా మలుచుకుంటూ, నాకు నచ్చినట్టు నేను బ్రతుకుతా. నన్ను ఈ నరకం నుండి కాపాడండి మేడం. ఇన్ని రకాల మాన భంగాలు ఇక నా వల్ల కాదు." అంది, చేతులు జోడిస్తూ.

వెంటనే తన చేతులు పట్టుకొని, "తప్పకుండా అనిత. తప్పకుండా మీ జీవితం మీ చేతిలో పెడుతా. అణిచివేతలను భరిస్తున్నా కొద్దీ, మగవాళ్లకు తమ తప్పులు తెలిసి రావు. విడాకులు మాత్రమే కాదు, చట్టప్రకారం శిక్ష కూడా వేయిద్దాం. ధైర్యంగా ఉండండి." అని మాట ఇచ్చా, అనిత ఒక్కతే కాక, ఇలాంటి మహిళలందరికీ, వారి శరీరాలపైనే కాక, వారి జీవితాల మీద కూడా వారికి పూర్తి అధికారం దక్కే రోజు రావాలని ఆశిస్తూ, ఒక లాయర్ గా నా వృత్తి ధర్మం నెరవేర్చడంతో పాటు, ఒక సాటి మనిషిగా నా బాధ్యత నిర్వహించాలి అని నిర్ణయించుకుంటూ.

వ్యాసం

# బలి పశుత్వానికి అంతం లేదా?



- అనిశెట్టి రజిత

అనాదిగా ఆడజాతిపై జరుగుతున్న అఘాయిత్యాలతో చరిత్ర నిండా రక్తపుటేరులు పారుతూనే ఉన్నాయి. బానిస సమాజం నుండే స్త్రీ బానిసకొక బానిస అన్న దృక్పథం పుట్టింది. యుగాలు గడిచాయి. ఏమీ మారలేదు. మరి ఇది ఏ సమాజం !

ప్రపంచం రోజు రోజుకూ ఎన్నో రంగాలలో పురోభివృద్ధి సాధిస్తున్నది. అనుదినం ఎన్నో కొత్త ఆవిష్కరణలు జరుగుతున్నాయి. కానీ ఎక్కడా శాంతి సామరస్యం అనేది లేకుండా పోయింది. మానవ అంశ నశిస్తూ మృగత్వానికి సమాజం రొచ్చుగుంటగా విస్తరిస్తున్నది. మనం పదే పదే ఉటంకించే ఘనత వహించిన ఈ సభ్యమానవ సమాజంలో మగ మనిషి క్రమంగా అంతరించి పోతూ మృగాడి అంశతో gaint production జరిగిపోతున్నది. ఆడపిల్ల జననమే నిరాకరణకు జన్మిస్తే నిరాదరణకు గురికాబడుతున్నది. నెలల పసికూన మొదలు ముదిమి వయసు వరకూ ఆడతనానికి భద్రతలేదు. అనుక్షణం ఆడవాళ్ళ ఆక్రందనలతో ప్రపంచమంతా విషాద అధ్యాయాల చరిత్రగా మారిపోతున్నది. నేను పుట్టదల్చుకోలేదు, పుడితే ఆయోనిజగానే పుట్టాలనుకుంటున్నాను. అని స్త్రీ ఆక్రోశించేలా చేస్తున్నారు. ప్రతిరోజూ అత్యాచారాలకు గురవుతూ ఆడతనం, ఆడజాతి అంతరించిపోతున్నది. స్త్రీని తల్లిన దైవంగా భావిస్తూ పూజిస్తారనబడే భారత దేశంతో ఈ దారుణ నేరాలేమిటి? అత్యున్నతమైన సంస్కృతి మనది అని చెప్పుకునే వ్యవస్థలోఈ క్రూర మారణకాండలు ఏమిటి? దేవుని ఉనికి అన్ని చోట్లా ప్రత్యక్షంగా ఉండేలేదు కనుక తనకు మారుగా అమ్మను, స్త్రీని సృష్టించాడంటారు. మరి ఆ ప్రతిరూపం పై ఈ క్రూర అత్యాచారాలు ఎందుకు ? పురుష అస్తిత్వానికి సమానార్థంగా పురుషదురహంకారం, మృగత్వం స్థిరపడి పోతున్నది.

ఈ సమాజంలో స్త్రీలూ స్త్రీత్వం బలిపశువులు అనే భావన స్థిరపడిపోతున్నది. ఎక్కడ మొదలయ్యింది. ఈ పతనం. ఎవరి ఘనకార్యం ఈ విలువల విధ్వంసం. మానవజన్మకు నిర్వచనం లేకుండా పోతున్నది. మానవత్వం మంటకలిసి బూడిదగా మిగిలింది.

స్త్రీపురుషుల మధ్య అణిచివేతల ఆత్యాచారాల సంబంధాలే కానీ స్నేహపూరిత అనుబంధాలు అనేవి పాశవికంగా కాలరాచబడుతున్నవి. స్త్రీలు లైంగిక భోగ్య వస్తువులుగానే తప్ప రక్తమాంసాలూ, హృదయ వికాసాలూ ఉన్న సాటి మనుషులూ, శ్రామిక చైతన్య మూర్తులూ, చరిత్ర నిర్మాతలూ, సహజంగా మానవ హక్కులున్న మానవ అస్తిత్వాలు అన్న భావనలు, విలువలు నీచాతి నీచంగా హత్య గావించబడుతున్నాయి.

ఇక ఎప్పటికప్పుడు రక్షణ యంత్రాంగాల రంగు మారుతుంది. పాలకుల ప్రతిజ్ఞల ప్రవచనాల రంగు వెలిసిపోతుంది. మహిళాలోకపు రక్త కన్నీటి ఘోషతో కుటుంబ – సమాజ – రాజ్య హింసల నెత్తుటి నదుల్లో పుణ్యస్నానాలు అలవాటుగా మారిపోయింది వ్యవస్థకు.

ఘోర నేరం జరిగిన ప్రతిసారీ దోషులను శిక్షించాలని పిడికెడు మంది హక్కుల కార్యకర్తలు అరిచి మొత్తుకుంటే దోషులను వొదిలిపెట్టేది లేదు, కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని ఏలినవారు ప్రకటిస్తుంటారు. ఇలాంటి దుశ్చర్యలు, దుర్ఘటనలం పునరావృతం కాకుండా ఉండాలని, చూస్తానునీ అంటారు. ఇదే చివరి అత్యాచారం, నేరం కావాలంటారు. కానీ ఏం జరుగుతున్నది ?

ప్రతి రోజూ ప్రతిక్షణం ఆడపిల్లలను వేధిస్తూ, వెంటాడుతూ, వంచిస్తూ, వేటాడుతూ మృగానందంలో క్రీడిస్తూ నేరాలతో జతకడుతూ ఈ పీడిత

సమాజం నిరాఘాటంగా... మన ప్రజాస్వామిక వ్యవస్థలో సగం మానవజాతి ప్రతినిధులు మానవజాతి మనుగడకే జన్మనిచ్చే మానవిజాతికి ఉన్న అర్థం, విలువ, స్థాయి, హోదా ఏమిటి? చరణేషు దాసులా? భోజ్యేషు రంభలా? ఇంకా ఈ పుచ్చు భావజాలం మురికి కంపులజ దొర్లుతూ పురుగుల్లా బతికేయడమేనా ఛీ థూ..

జీవించే హక్కు భద్రంగా, శాంతిగా, ఆత్మగౌరవంగా ఆత్మవిశ్వాసంతో జీవించే సమానత్వపు హక్కుకోసం ఇంకా ఎన్ని దశాబ్దాలు, శతాబ్దాలు స్త్రీలజకం బలిదానాలతో హాహాకారాలతో కునారిల్లి పోవలసి ఉందో? ఈ అత్యాచార భారతంలో ఉన్నతమైన సాంస్కృతిక విలువలు పరిఢవిల్లేందుడు మరెందరు స్త్రీలు దగా పడిన దళితులు బలిపశువులుగా బలి అవుతూ ఉండాల్సిందేనా?

దీన్నేనా మనం మానవ సమాజం అనీ, ఇక్కడ జరిగేవిధ్వంసాన్ని అభివృద్ధి అనీ, పురోగమనం అనీ, పురాగతులనీ రోజూ రంగ రంగుల డబ్బాలు కొట్టుకుంటూ గొప్పల బాకాలూదుతూ ఊదరగొడుతూ ఉత్సవాలు చేసుకుంటున్నది? ఎక్కడో మధ్యయుగాల మైలురాయి దగ్గరే రక్తపిపాసత్వంతో కూరణాయుధాలు సృష్టిస్తూ యుద్ధ నాదాలతో దాడులతో ఆగిపోయి దిగబడిపోయి లేమా! గర్వించడానికి ఏమున్నది దుఃఖించడానికి తప్ప శవాల మీద వేడుకలు. నిండు ప్రాణాలను బలిగొని మరణ మృదంగాల వింత వికృత సంస్కృతిక నాగరికత ముందడుకు ఇదేనా? ఎవరైనా జవాబూ వివరణా చెప్పగలరా? ఈ బలిపశుత్వానికి అంతం లేదా ? స్త్రీలు బలహీనులూ బలిపశువులా?

★★★★

**కవిత**

# నిరీక్షించడమంటే..!

- నాంపల్లి సుజాత



ఇప్పుడు
నిప్పులమీద నడవడమో
నిలువెల్లా
దహించుకు పోవడమో
దుర్వాసుడొచ్చి దూకుడుగా
ఆవహించడమో కాదు
అదో అప్రకటిత ఆనందమ్..!

వీసా దగ్గరో వైద్యుడి దగ్గరో
వాష్రూమ్ వరసో కిక్కిరిసిన బస్సో
కారణమేదైనా గానీ
కించిత్ మాటాడ కుండా
తలవంచేదే ఇప్పటి నిరీక్షణ..!

ఒంటికాలిమీదైనా
వెంట్రువాసి సందైనా
ఒరిగేందుకింత ఆసరా ఉంటే చాలు
తనువు మరచి
తక్షణ ముచ్చట మరచి,
'సెళ్ళు' మాయాజాలానికి
ఒల్లుమరచి సొళ్ళుగార్చుడే.!
శునక రాజు నోటికి బొమిక దొరికినట్లే.

యువతరమో
నవతరమో కాదు
కన్నన్నా తెరవని పసిమొగ్గ నుంచి
రేపో మాపో రాలే ఆకుల దాకా
చరవాణీ పాద దాసులే..!

నిన్నటిరోజు
పనిఒత్తిడిలో సెల్లు మరచి ఇళ్లు చేరిన
కాలుగాలిన పిల్లినై చిన్నబోయా.!
ఎట్టకేలకు తేరుకొని
ర్యాక్ లోని ఓ మహాకవిని అధ్యయనం చేసా
చాన్నాళ్లకు పాత కాలపు సంతృప్తి .!

జాతరలో తప్పిపోయిన
పిల్లవాడిని తిరిగి హత్తుకున్నట్టే
నా చేతుల్లోకి మాటల పిట్ట
మళ్లా చేరింది
నిజమే తప్పిపోయామ్
మనకు తెలియనంతలా తప్పిపోయాం
ప్రపంచీకరణ వలలో చిక్కి మత్తెక్కిపోయాం..!

వ్యాసం

# స్త్రీల వివాహ వయసు

- డా. తిరునగరి దేవకీ దేవి



చట్టాన్ని తెచ్చేటపుడు దాని పూర్వాపరాలను జరుగబోయే పరిణామాన్ని బాగా ఆలోచించాల్సిన అవసరం ఉంటుంది. కమిటీలను ఏర్పాటు చేసి అభిప్రాయసేకరణ చేయవలసి ఉంటుంది. కాని ఆ విధంగా ఏ ఆలోచనలు సరిగా చేయకుండానే ఈ మధ్య ఆడపిల్లల పెండ్లి వయసు కూడా 21 సంవత్సరాలనే చట్టాన్ని తెచ్చారు. ప్రస్తుతానికి సమాన హక్కులంటూ ఎంత గగ్గోలుపెడుతున్నా ఎన్ని చట్టాలు వచ్చినా ఎక్కడి గొంగడి అక్కడే ఉంది. బాల్యవివాహాల నిరోధక చట్టం ..వరకట్న నిషేదం..గృహహింస చట్టం..నిర్భయ చట్టం వంటి ఎన్ని చట్టాలు వచ్చినా బాల్య వివాహాలు ఆగలేదు. మొన్నటికి మొన్న 2020 లాక్డౌన్ కాలంలో లెక్కకు మిక్కిలి చిన్నపిల్లల పెళ్ళిళ్ళు అధిక సంఖ్యలో జరిగినై. అతెందుకు ఈ చట్టం వస్తుందన్న వార్త విన్నారో లేదో 21 ఏళ్ళ లోపు పిల్లలకు చాలామందికి పెళ్ళిళ్ళు జరిగిపోయాయి. శతకోటిదరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు కదా! ఆ విషయం కాసేపు పక్కన పెడుదాం. ఏ ఆర్థిక సామాజిక వర్గాన్ని చూసినా ఆడపిల్లలకు రక్షణ లేదు. కొన్ని ఇండ్లలో కనీసం స్వంత ఇంట్లో తండ్రులనుండి కూడా రక్షణ లేదు.మూడు సంవత్సరాల క్రితం వికారాబాద్ ప్రాంతంలో తండ్రి స్వంతబిడ్డను హైదరాబాదునుండి తీసుకొచ్చి సొంతూరికి పోతూ తొవ్వలో అత్యాచారం చేయడమే కాదు హత్యకూడా చేసిండు. కొన్ని రోజుల క్రితం ముగ్గురు బిడ్డలను కన్నతల్లి మొగడు అత్యాచారంతో సొంత బిడ్డలపై అత్యాచారం చేస్తూ భయాందోళలకు గురిచేయడం భరించలేక బర్తనే చంపి జైలుపాలైంది. కాని సమస్యకు పరిష్కారం కాలేదు సరికదా తండ్రిని చంపిన నేరానికి తల్లి జైలుపాలు కావడంతో అనాథలైన పిల్లలపై అత్యాచారాలు రోజు వారి కార్యక్రమాలైపోయినై . కొన్ని హోమ్స్ లలో సంస్థ విరాళాలకుగాను విద్యార్థులపై అనాచారానికి పాల్పడిన విషయం వార్తలలో కెక్కింది. విద్యాలయల్లోనూ కీచక పంతుళ్ళు అక్కడక్కడా దాపురిస్తూనే ఉన్నారు. వావి వరుసలతోనే కాదు వయసుతోనూ సంబంధమూ లేదు. సినిమాలు సీరియల్స్ సెల్ ఫోన్లో ఫోర్నోగ్రఫీలు యువతను రెచ్చగొడుతున్నై .ఈ మధ్య అత్యాచారాలలో బాల నేరస్థులు ఎక్కువ ఉంటున్నారు.వాళ్ళే ఎక్కువ క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. ఈ రోజుల్లో పదకొండు పన్నెండు సంవత్సరాలకే మెచూర్ అవుతున్నారు. సహజంగానే హార్మోనియల్ మార్పులతో సెక్స్ పట్ల ఆకర్షితులౌతున్నారు. ఇష్టంగానో అయిష్టంగానో గర్భం దాల్చే పరిస్థితులకు నెట్టివేయబడుతున్నారు.. స్కూళ్ళనుండే ఆడామగ పిల్లలు కలిసి పారిపోయేస్థితి ఎక్కువైంది. చదువుపట్ల శ్రద్ధ లేక తమ జీవితాలను వక్రమార్గం పట్టించే వర్గం ఒకటైతే శ్రద్ధ ఉన్నా వాళ్ళజీవితాలను అ(హ) త్యాచారాలతో దుర్భరం చేసే వర్గం ఇంకొకటి. 18 సంవత్సరాల వయస్సని చట్టం ఉన్నా బాల్య వివాహాలు కొనసాగుతునే ఉన్నై. వివాహ వయస్సును పెంచడం వల్ల డిగ్రీ పూర్తి చేయగలిగిన అవకాశం సరియైనదే. చదువు సవ్యంగా సాగాలనుకునేవారికి ఇరవై ఒకటే పరిమితం కాదు. జీవితంలో స్థిరపడాలనుకునేవారు ఇరవై ఐదు ...ముప్పై మధ్య కాలంలోనూ చేసుకుంటున్నారు. వాళ్ళకు పెళ్ళికి లక్ష్మణ రేఖలు లేవు.ఎటొచ్చి ఒక అవగాహన లేక తొందర పడి లైంగికత పట్ల ఆకర్షితులౌతున్నవారికే నష్టం. మనిషికి లైంగికేచ్ఛ అనేది సహజసిద్ధమైనది. ఆడా మగకి వివాహ విషయంలోనూ స్వేఛ్ఛ అవసరమే. కాని స్వేఛ్ఛ అంటే విశృంఖలత కాదు. ఈ మధ్య లివింగ్ రిలేషన్స్ అన్న మాట కూడా వినబడుతుంది. ఈ రకరకాల పరిస్థితులలో జీవితాలు పక్క దారులు పట్టకుండా ఉండాలంటే స్త్రీలే కాదు కుటుంబాలు ప్రశాంతంగా ఉండాలంటే 18 సంవత్సరాలు వయసు వివాహానికి అనువైనదే. అట్లా అని కచ్చితంగా పద్దెనిమిదేండ్లకే పెళ్ళి చేయాలని కాదు. పెళ్ళిచేసిన వాళ్ళు చేసుకున్నవాళ్ళు నేరస్థులు కాకుండా ఉండాలి. ఆ తర్వాత వాళ్ళ ఆశయాలు ఆలోచనలు అవకాశాలే పెళ్ళి కాలాన్ని నిర్ణయిస్తాయి.

అనువాద కథ

# రసోత్కృష్టం

## ఎల్లలెరుగని మాతృ హృదయం

- నిగమ



ఈ కథ కేరళ రాష్ట్రంలో పాఠశాల విద్యార్థులకు తొమ్మిదో తరగతి ఆంగ్ల పాఠ్యాంశంగా వుంది. రచయిత 16 వ సంవత్సరాల వయస్సపుడు మూడు నాలుగేళ్ళపాటు గ్రీక్ టర్కీ యుద్ధ వార్తల మధ్య భయం భయంగానే పెరిగారు. తర్వాత కాలంలో కూడా టర్కీ ప్రభుత్వం ఆర్మేనియన్ లపై మారణకాండ జరిపింది. ఆ ఊచకోత పదివేలకు పైగా మంది ఉరితీయబడ్డారు. అనేక స్త్రీలపై అత్యాచారాలు జరిగాయి. ఆ దారుణకాండ జరిగినకాలంలో ఆర్మేనియన్ ప్రజలు స్వస్థలాలు విడిచి చెట్టుకొకరు పుట్టకొకరు తరలిపోయి ఇతరప్రాంతాలలో కాందిశీకుల క్యాంప్ లలో తలదాచుకున్నారు. ఆ విషయాలను స్ఫురింపజేస్తూ యుద్ధ వాతావరణ నేపథ్యంలో జరిగిన కథగా ఈ కథను చిత్రించారు. కథ చదువుతున్న పాఠకుడికి ఇది వాస్తవ చిత్రీకరణేమో అని అనిపించకమానదు.

దేశాల మధ్య అంతర్యుద్ధాల మూలంగా ప్రజలు ఎన్నో ఇక్కట్ల పాలవుతారు. గూడు విడిచిన గువ్వలై ప్రాణాలు అరచేతపెట్టుకుని తమది కాని ప్రాంతానికి ఎక్కడికో పరుగులు తీస్తారు.లేదావిసిరివేయబడతారు.

తలదాచుకోవడానికి ఇంత నీడ కరువై ఆకలిదప్పులతో అలమటిస్తారు. అగమ్యగోచరమైన బతుకీతలో తుఫాను గాలికి అలల్లాడిపోతున్న నావలా కొట్టుమిట్టాడుతుంటారు.

ఆర్మేనియన్ క్యాంప్ లో తలదాచుకుంటున్న పద్నాలుగేళ్ళ బాలుడు "మికిలీ " తల్లి చనిపోతూ అతనికి అప్పజెప్పిన చిన్నారి తమ్ముడిని కాపాడుకోవడానికి ఎంత యాతన అనుభవించాడో! బక్కచిక్కి ఎముకులపోగులా మారి వికారంగా మారిన ఆ పసివాడికి ఇన్ని పాలు కుడిపేవాళ్ళు కరువై పైగా అసహ్యానికి గురై.. దూరంగా నెట్టబడుతున్నప్పుడు ఆపద్బాంధవుడులా ఎదురైన ఒక చైనా యువకుడు అతని భార్య మానవత్వ పరిమళాలను పూయించిన వైనమే ఈ కథ. మనుషుల్లో సహజంగా వుండే దయ కరుణ సానుభూతిని ప్రదర్శించి తోటి మనిషికి మనిషి పట్ల జీవితంపట్ల కాస్తంత నమ్మకాన్ని మిగిల్చిన అపురూపమైన కథ ఇది. కథను చదివి ఎవరికివారు అనుభూతిని పొంది తీరవలసిందే తప్ప భావాన్ని

చెప్పడానికి భాష కోసం తడుముకోవాల్సిన కథ.

మానవుడు ఎక్కడైనా మానవుడే! దేశాలు ప్రాంతాలు సంస్కృతి వేరు కావచ్చునేమో కానీ జీవితాలు స్పందనలూ భావనలూ భావోద్వేగాలు అందరిలోనూ ఒకటిగానే వుంటాయని ఆ మాతృమూర్తి నిరూపించింది. మనిషి అంతరంగం కరుణాసముద్రం. ఆ కరుణ అందరిలోనూ వుంటుందని చెప్పలేం. దయ గల హృదయమే దేవాలయం మందిరం మసీదు గురుద్వారా.. అన్నీనూ. ఈ కథ తోటి మానవుల పట్ల కాస్త దయను సానుభూతిని ప్రదర్శించి మనిషితనం చాటుకోమని ఉద్బోధిస్తుంది. ఎల్లలు లేని మాతృ హృదయానికి శిశువు రూపంతో కానీ జాతి మతాలతో కానీ పనిలేదని మాతృ హృదయం మాతృ హృదయమేనని చాటి చెబుతుంది. సాహిత్యం ఇరుకు మనసులను విశాలత్వం చేస్తుంది. సంకుచిత స్వభావం కలవారిని మార్చడానికి ఇతోధికంగా తోడ్పడుతుంది. మన చుట్టూ వున్న ప్రపంచాన్ని బాగా అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది. ముప్పేటలా కలగలిపిన భావాల వల్ల ఉక్కిరిబిక్కిరి అవుతున్న సగటు మనిషికి సరైన త్రోవ చూపించి మనీషిగా మిగల్చడానికి చేయూతనిచ్చి నడిపిస్తుంది. అందుకే మంచి మంచి కథలను మనం చదువుకోవాలి. ఆ కథలను ఇతరులతో పంచుకోవాలి. అందుకోసమే ఈ కథా పరిచయం.

–నిగమ

## మాతృత్వం
## (MATERNITY)

**- లిలిక నకోస్ (గ్రీక్ రచయిత)**

**తెలుగు అనువాదం: ఎమ్ వి. నారాయణాచార్య**

"మార్సెయిల్"' పట్టణపు శివార్లలో నెలరోజుల పైబడి "ఆర్మేనియన్"కాందిశీకులు విడిది చేసి ఉండడంతో అది ఒక చిన్నపాటి గ్రామసీమగా రూపుదిద్దుకుంది. ఎవరెక్కడ చోటు దొరికితే అక్కడ స్థిరపడిపోయారు. డబ్బున్న కాందిశీకులు గుడారాలు వేసుకున్నారు. మిగిలిన వారిలో కొందరు ఊడిపోతోన్న రేకుల షెడ్ల క్రింద కాలక్షేపం చేస్తున్నారు.

అయితే అధిక సంఖ్యాకులు మాత్రం ఉండడానికి దిక్కుతోచక గోనె బరకాలని వెదురు కర్రల మీది ఛాందినీలా నిలబెట్టి దానికింద కాలం వెళ్ళమారుస్తున్నారు. ఏదేనా ఒకటి రెండు రేకులు దొరికి గోడల్లా ఏర్పాటు చేసుకోగలిగిన వాళ్ళు మహా అదృష్టవంతులేనన్నమాట.

ఎంతదృష్టవంతులంటే స్వంతంగా పోష్ లోకాలిటీలో ఒక స్వంతభవనాన్ని నిర్మించుకున్నంతటి ఆదృష్టవంతుల కింద లెక్క. ఎవరికి ఏ పని దొరికితే ఆ పని చేసుకుంటూ వచ్చిందాంతో కలో గంజో తాగి కాలక్షేపం చేస్తున్నారు.పిల్లలు కూడా మరీ మలమల మాడిపోకుండా ఓ డొక్క ఎండినా ఏదో కొంత తినగలుగుతున్నారు.

అయితే అణగారిన వాళ్ళలో కూడా అతి దరిద్రులూ దౌర్భాగ్యులో వున్నట్లే ఈ కాందిశీకుల్లో కూడా ఉన్న ఓ నికృష్టజీవి "మికలీ". "మికలీ" పనైతే చేయలేడు కాని ఆతనికి కూడా అందరిలాగా ఆకలి వుంటుందిగా! వాళ్లూ వీళ్ళూ కనికరించి విసిరేసిన రొట్టె ముక్కలు తిని కడుపు నింపుకుని కాలక్షేపం చేసేవాడు, అయితే అతని శరీర తత్వాన్నిబిట్టి ఎంత ఎంగిలి రొట్టెముక్కలు తిన్నా శరీరం తెగబలిసిపోయింది. ఇంతకీ "మికలీ" కి పద్నాలుగు సంవత్సరాలు. ఆతను పని చెయ్యాలంటే వచ్చిపడ్డ మరో ముఖ్యమైన అవరోధం ఏమంటే వాళ్ళమ్మ కళ్ళు మూస్తూ, మూస్తూ వదిలిపెట్టి వెళ్లిన పసికందు భారం ఒకటి అతని మెడకు చుట్టుకుని ఉంది. అయితే ఈ పసికందుకు విపరీతమైన ఆకలి ఎడతెరిపి లేకుండా గాడిద ఓండ్ర పెట్టినట్టు ఏడుస్తూండడంవల్ల అతనిని ఆ చుట్టుపక్కల్నించి తరిమేశారు. నిద్రాభంగమైతే ఎంత సహృదయాలైతే మాత్రం భరించగలరా?

అసలు ఈ పసికందు హోరెత్తించే ఆకలి గోలకి మికలీ కి పేగులు తోడేసినట్టుండేది, ఆయితే అతని తల్లి అతని భుజస్కంధాలపై ఉంచిన బాధ్యత భారాన్ని వదలించుకోవడం ఆంత సులభంగాదు కదా! ఏడుపు విని వినీ అతని బుర్ర పూర్తిగా దిమ్మెక్కిపోయి పిచ్చెక్కినవాడిలా తిరగడం మొదలెట్టాడు. తానెక్కడెక్కడ తిరుగుతున్నా చెవులు హోరెత్తించే కర్ణకఠోరమైన ఈ పిల్లాడి ఏడుపు కూడా వుంటూండడంతో అందరూ మికలీని అసహ్యించుకోసాగారు. ఏడ్చి ఏడ్చి ఆ పసికందు ఎప్పుడో ఒకప్పుడు హరీమనాలని మనస్ఫూర్తిగా వాంఛించసాగారు.

ఆయితే అటువంటిదేమీ జరగకపోగా ఈ "న్యూసెన్స్" విపరీతం కాసాగింది. ఈ కొత్తగా పుట్టిన శిశువు కరువు కాటకాలకు, ఆకలికి వాడు విపరీతంగా ఏడ్చి ఏడ్చి బతకాలని నిశ్చయించుకున్నట్లు తోస్తోంది. కరువును మించినట్టుగా భూనభాలు అదిరిపోయేలా రోదిస్తున్నాడు. ఇవన్నీ వినలేని మాతృమూర్తులు చెవుల్లో దూది కుక్కుకుని

మరీ తిరుగుతున్నారు. మికలీకి ఇంచుమించు పిచ్చెక్కినంత పనిగావుంది. తాగినవాడి స్థితిలో తిరగసాగాడు. పాలు కొని పడదామంటే అతని దగ్గర చిల్లిగవ్వయినా లేదు.

ఏ మాతృమూర్తి అయినా దయదల్చి తన స్థన్యాన్ని అందిస్తుందేమోనంటే ఏ తల్లికీ ఆ వాత్సల్యమూ లేదు, ఉన్నా ఆ మాత్రం క్షీరసంపదా ఉన్నట్టు తోచదు.ఇది చాలదా మనిషిని పిచ్చెత్తించడానికి ?

ఇది పని కాదని మికలీ ఆవలి వైపున ఉన్న క్యాంపుకి వెళ్ళేడు అక్కడ అంటోలియన్ కాందిశీకులు ఉన్నారు. వాళ్ళూ ఆర్మేనియన్ కాందిశీకులాగే ఆసియా మైనర్‌లో తురుష్కుల మూకుమ్మడి హత్యాకాండకి ఝడిసి ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకుని పారిపోయి వచ్చినవాళ్లే.

వాకబు చేయగా చేయగా మికలీకి ఆ క్యాంప్‌లో దయామయులైన తల్లులున్నారని వారిలో దయ ఎంత నిండుగా వుందో స్తన్యం కూడా ఆంత ఉదారంగానూ వున్నదని, వారు అనాధలైన శిశువుల ఆకలిని తమ స్తన్యంతో తీరుస్తారని తెలిసింది– ఈ చిన్నారి పాపడిని కూడా ఆ తల్లులు అనుగహిస్తే తాత్కాలికంగానైనా ఈ ఆకలి రోదన శమించవచ్చని ఆశపడ్డాడు మికలీ. మనిషిని జీవింపజేసేది ఆశే కదా!

అయితే ఆ క్యాంపూ ఆర్మేనియన్ క్యాంపంత హృదయవిదారకంగానే వుంది.ముసలివాళ్ళు కటిక నేలమీద పరున్నారు. వాళ్ళ కాళ్ళకి ఏ ఆచ్ఛాదనా లేదు. చిన్నపిల్లలు మురికి నీటి చెలమల్లో ఆడుకుంటున్నారు. ఇతన్ని చూస్తూనే వృద్ధురాళ్ళు లేచి కూర్చుని సానుభూతిగా –

"ఏంకావాలి బాబూ? అని అడగసాగారు.తను వచ్చిన పనిని ముసలమ్మలకి చెపితే మాత్రం వాళ్ళేమైనా ఆర్చగలరా తీర్చగలరా? అందుకే తిన్నగా మేరీమాత గుర్తు జండా ఎగురుతున్న ఆ ఇంటి దగ్గరికి వెళ్ళేడు. ఆ టెంటు లోపలనుంచి చిన్నారి శిశువుల రోదనలు శ్రావ్యంగా వినిపిస్తున్నాయి. బహుశః ఈ టెంటులో దయార్ద్ర హృదయులైన మాతృమూర్తుల ఉండి వుండవచ్చు, అందుకే ధైర్యం చిక్కబుచ్చుకుని..

"పవిత్రమైన మేరీమాత స్వరూపాన్ని ధరించిన ఈ టెంట్‌లోని దయామూర్తులెవరో ఈ ఆకలితో అలమటిస్తోన్న ఈ దిక్కూమొక్కూ లేని మాతృహీనుడికి పాలను ఇచ్చి ఆకలి బాపండి తల్లీ! నేను ఆర్మేనియన్ కాందిశీకుల క్యాంప్ నుంచి వస్తున్నాను అని హృదయ విదారకంగా కేకవేసాడు మికలీ,

ఈ అభ్యర్ధనకు జవాబుగా ఒక అందమైన, నల్లటి పడతి వచ్చింది. అప్పటికే ఆమె చేతులలో అరమూతగా కన్నులు మూసుకుని పాలుగోలుతోన్న శిశువు వున్నది

మికలీ హృదయం ఆనందపరవశంలో నాట్యమే చేసింది. దాహార్తితో విలవిలలాడే ఎడారి పయాణీకుడికి ఒయాసిస్సు కనిపిస్తే కలిగేలాటి ఆనందం అది. ఈ ఆనందంతో అతని శరీరం గజగజావణికి పోసాగింది, చుట్టుపక్కల వారు కూడా కొందరు ఆతృతగా ముందుకి వచ్చి మికలీ భుజంమీద దుప్పటిలో చుట్టబెట్టుకువున్న ఆ ఏడ్చే శిశుశువును (మికలీ చిన్నారి తమ్ముడుని) బయటకి తీసి చూడబోయారు.

"ఏదీ ఈ ఆకలిగావున్న శిశువును చూపించు, ఇంతకీ ఇది అబ్బాయా? అమ్మాయా!'" దయ ఉట్టిపడే మధురస్వరంతో అడిగింది ఆ పడతి.

హృదయ విదారకంగా కేకలు వేయడం ఇప్పుడు వారి వంతు అయింది. ఆది శిశువా? శిశువు అనేకంటే నరరూపంలో వున్న ఒక దెయ్యపు పిల్ల అంటే సరిపోతుంది. ఎముకల పోగులాటి బక్క పల్చటి శరీరం మీద దెయ్యం తలకాయ లాంటి పెద్ద తల. ఇప్పటిదాకా చప్పరించడానికి ఏమీ దొరకక దాని బొటనవేలిని అది చప్పరించిందేమో ఆ వ్రేలు రుబ్బుడు పొత్రమంత సైజుకి ఉబ్బిపోయి వుంది. తన చిన్నారి తమ్ముడు ఇంత ఏహ్యంగా, జుగుప్సాకరంగా తయారయి వుంటాడని ఊహించని మికలీకే ఒక్కసారి షాక్ తిన్నట్టయింది.

"ఓయి దేవుడా! ఇది మనిషి పిల్లకాదు.ఇది మనుషుల రక్తాన్ని పీల్చే ఒక రకమైన గబ్బిలం, నిజంగా నా వక్షం నిండా పాలున్నా ఇలాటి తురుష్కజాతి గబ్బిలానికి పాలిచ్చి దైవాపచారం చెయ్యలేను..."

"అవును... ఇది దైవాపచారమే....ముమ్మాటికీ దైవాపచామరే" శృతి కలిపారు మిగిలిన వాళ్ళు.

"ఏమిటేమిటి?.... ఏదీ చూడనియ్.... గబ్బిలంకాదర్రా.... ఇది సైతాను భూతపు మరో రూపమే.... ఒరే అబ్బాయి, వెంటనే ఈ క్యాంపు లోంచి మొహం కనబడకుండా పోతావా చితకొట్టమంటావా? నువ్వు అడుగెట్టినచోట పంచమహాపాతకాలు చుట్టుముడతాయి" అంటూ మికలీని దూరంగా తరిమేశారు. ఏం చేయగలడు? నిస్సహాయుడు

నిరాధారుడు. కనీసం సానుభూతి చూపేవాళ్ళైనాలేరు. గుడ్లనిండా నీళ్ళు కుక్కుకుని..

"ఆదరించువారే లేరా ఈ వనిలోన? మమ్మాదరించు దాతలు లేరా ఈ ధరలోన" అని వాపోతూ తిరగసాగాడు. అతని ఆకలిదప్పుల మాట దేవుడెరుగును? ఈ శిశువును ఆకలి రక్కసి కోరలు నుండి కాపాడడం అతనికి తక్షణ సమస్య అయి కూర్చుంది.అయితే తను ఏం చేయగలడట! ఈ శిశువు ఏడ్చి ఏడ్చి ఎంత త్వరగా మరణిస్తే ఎంత బాగుండును అనిపిస్తుంది. నాగరికులమైన మనకైతే పాపం అతడు అజ్ఞాని అందుకే అతడు మనంత నాగరికంగా ఆలోచించ లేకపోయాడు అనుకుందుము. అతడు ఏకాకి.అన్నీ పోగొట్టుకున్నవాడు. ఇంతసేపు అతను మోస్తున్నది ఆకలితో అలమటిసోన్న ఒక చిన్నారి శిశువును కాదని.... నర రూపంలో ఉన్న ఓ దెయ్యపు పిల్లనని అనిపించేసరికి వెన్నులోంచి వణుకు పుడుతోంది. అయినా అతనిలో లవలేశంగానైనా మిగిలివున్న బాధ్యత, మానవత్వం ఆ శిశువుని అలా మోయిస్తూనే వున్నాయి. అయ్యో పాపం పసివాడు.మికలీ ఒక షెడ్డు నీడలో చేరాడు, బయట వేడిగా వుంది. షెడ్డు లోనూ వెచ్చదనం పరుచుకుని వుంది. అతనికి తన కడుపులో ఎలకలు పరిగెడుతున్న సంగతి గుర్తువచ్చింది. వీధులలో సగం సగం తిని పడేసిన పదార్ధాలనో, అవ్వీ దొరకకపోతే పెంట కుప్ప మీద పడి వున్న పదార్థాలను కుక్కలతో పోటీ పడోతినాలి. తప్పదు. అప్పుడు మొదటిసారిగా అతనికి జీవితం అతి భయంకరమైన దానిగా తోచ సాగింది. తోస్తేమాత్రం ఏం చెయ్యగలడు!

చేతుల్ని ముఖానికి అడ్డుపెట్టుకుని వెక్కి వెక్కి ఏడవనారంభించాడు. ఎవరు వింటారు. ఈ దీనుడి ఏడుపు? ఎవడికి కావాలట. ఎవరు ఎలా పోతే మాత్రం?? తొందరపడి ఆలా అనెయ్యకండి. సర్వసాక్షికి ఇవేమీ తెలియవనే అంటారా?....ఏమో !

మికలీ తలెత్తి చూసేసరికి అతని ముందు ఒక చైనా యవకుడు నిలబడివున్నాడు, మికలీ ఆతన్ని ఆ క్యాంపులో చాలాసార్లు చూసాడు కాని అంతగా గమనించలేదు అయితే ఆ చైనీయుడు మికలీని ఆతని అవస్థనూ నిత్యం చూస్తూనేవున్నాడు, అతగాడు ఈ క్యాంపులో పేపరుతో చేసిన రక రకాల ఆటవస్తువులూ ఏవేవో గమ్మత్తు వస్తువులు అమ్మి వ్యాపారం చేద్దామని వస్తూండేవాడు. ఆయితే అతని దగ్గర ఎవ్వరూ ఏమీ కొనేవారుకాదు.ఈ చైనా వాడు చింతాకుల్లాటి కళ్ళతో, తప్పడముక్కుతో, పచ్చగా, కుదమట్టంగా వుండడంతో క్యాంపులోని పిల్లలు ఆటపట్టిస్తూ ఉండేవారు. పైగా

"ఫీలింగ్, స్టింకింగ్ చింక్★ అని పిలుస్తూ హేళన చేసేవారు.

మికలీ కేసి ఆ చైనా యువకుడు చాలా దయగా చూశాడు. అంత చిన్నకళ్ళల్లోనూ విశ్వమంత విశాలమైన దయ ఉబికి ఉబికీ తన్నుకు వస్తూ కనబడుతోంది.

"అలా ఏడవకూడదమ్మా అబ్బాయ్..." అన్నాడు ఎంతో సిగ్గుతో ముడుచుకుపోయినవాడిలా వున్న మికిలీతో. "రా అమ్మ రా! నాకూడా రా." అన్నాడు.

నేను రాను. అన్నట్టు తల అడ్డంగా వూపడం ఈ మాటు మికలీ వంతయింది....మికిలీ అక్కణ్ణించి వేగంగా పారిపోదామని కూడా భావించాడు. ఈ ప్రాచ్యదేశస్థుల క్రూరత్వాన్ని గురించి మికలీ వాళ్ళ దేశంలో వున్నప్పుడు ఎన్నో రకాల కథలు విన్నాడు. వాళ్ళ దేశంలోనేకాదు ఈ క్యాంపులోకూడా తరచు వినబడేదేమంటే....ఈ చైనావారూ జపాన్ వారూ క్రైస్తవ పిల్లల్నిఎత్తుకుపోయి....యూదుల్లా వారి రకాన్ని పిండుకుని కడుపునిండా తాగుతారట.

అయితే ఆ చైనీయుడు ఒక అంగుళమయినా కదలకుండా అలాగే నిలబడివున్నాడు. నిండా మునిగిపోయేవాడిలో గడ్డిపోచయినా ఆశని కల్పించినట్టు చావుకి ఇన్ని చావులుండవుకదా అని అతని కూడా బయలుదేరి వెళ్ళాడు. పొలంగట్టు మీంచి నడిచి వెళ్ళటంతో చేతుల్లో పిల్లాడితో సహా తూలిపడిపోయాడు మికలీ.

అయితే చైనా యువకుడు మికలీ చేతిలోని శిశువును తానే అందుకుని తన గుండెలకు సుతారంగా హత్తుకుని ముందుకు నడవసాగాడు.

వాళ్ళు అనేకమైన కాళీ ఇళ్ళని దాటుకుంటూ వెళ్ళారు. చివరికి ఒక తోట మధ్యలో వున్న కర్రలతో కట్టిన ఒక ఇంటి ముందు ఆగేరు,

తలుపు మీద సున్నితంగా రెండు మూడు సార్లు తట్టాడు. ఒక చిరుదీపం దాల్చిన ఓ చిన్నపాటి యువతి వచ్చి తలుపు తీసింది. ఈ చైనా యువకుని చూడగానే ఆ అమ్మాయి కొద్దిగా సిగ్గుపడింది,బుగ్గలు ఎరుపెక్కాయి ఆయినా చిరునవ్వుతో వారికి

స్వాగతం పలికింది. మికలీకి ఇది కలో నిజమో అర్థం కావడం లేదు. లోపలికి వెళ్లాలంటే భయం, ఆందోళన ఏవేవో ఉద్వేగాలు అందుకే తడబడుతూ నిలబడ్డాడు.

“సందేహంలేదు....లోపలికి రావోయ్....ఈమె నా భార్యే....

“కానున్నది కాకమానదు”” అనుకుంటూ లోపలికి అడుగేశాడు మికలీ.

అది పెద్దగదే....అయితే దానివి కాగితాలు అంటింపుతో రెండు భాగాలుగా చేసారు...బీదరికం కనపడుతున్నా ఆ ఇంట్లో ఆరోగ్యం ఉట్టిపడుతూ వుంది. సౌజన్యం సరేసరి.

“ఇది మా పాప... అంది ఉయ్యాలలో ఆడుకుంటూన్న ముద్దు పాపాయిని చూపిస్తూ. ఆ పాపాయి ఎంతో ముద్దుగా వున్నాడు.ఇంతటి ఆందోళనలోనూ మికలీ పాపాయి దగ్గరిగా వెళ్లి బుగ్గగిల్లి అభినందించకుండా వుండలేకపోయాడు. కడుపునిండా పాలుతాగినట్టున్నాడు. హాయిగా నిద్రపోతున్నాడు.

భర్త భార్యను సంజ్ఞచేసి పిలిచాడు.చాపమీద కూర్చోమన్నాడు. కూర్చోపెట్టి ఈ దెయ్యపు(లాటి)శిశువును చేతికందించాడు. చూడగానే ఆమెకూడా వెర్రికేక పెట్టింది. అయితే భయంతోనో ఏహ్యాభావంతోనో వేసిన కేకకాదు. దయ చిప్పిల్లి వేసిన సానుభూతి చిహ్నమైన కేక. ఆ శిశువును గుండెలకదుముకుని పాలు కుడుపసాగింది. ఆమె పాలిండ్లు ఆర్ద్రమై పాలను ఎగచిమ్మేయి. ఆకలిగొన్న శిశువు ఆవురావురని పాలు తాగసాగింది,

**కవిత**

# గళాధిపత్యం



**- నస్రీన్ ఖాన్**

ఆ గొంతులోనే ఉంది
ఉన్మాదపు కోరలు పీకే ఉత్పాతమంతా
అవును
ఒకదానికొకటి తోడై గర్జిస్తున్న ఆ శబ్దం లోనే ఉంది
చీకటిని పారద్రోలే వెలుగంతా

నిన్నా మొన్నటి దాకా తెలియనేలేదు వారికి
భ్రమర నాదాలు మాత్రమే వినిపించిన
ఈ గళాలు
ఘీంకరిస్తే పాదాలదాకా అలజడి పాకుతుందని

సన్నగా పీలగా పలికే స్వరాలు
వీలైతే నిశ్శబ్దాన్ని తొడుక్కున్న ఆ నెమ్మది గొంతుకలు
సుడిగాలుల ప్రకంపనాలు సృష్టిస్తాయని
ఊహించి ఉండరు ఎవ్వరూ

రూపు కట్టని ప్రశ్నల్లో ఆలోచనలింకా తారాడుతూనే
ఉన్నాయి
మురికి మెదళ్ళకు అప్పుడే ఒణుకు పుట్టింది
భయం మాటున దాక్కుని ఉన్న
ఆలోచనలు
తుప్పు వదిలించుకుని
బుల్లీ బాయ్, సుల్లీడీల్స్ గా రూపాంతరం చెందాయి

మార్ఫింగుల మాయాజాలంతో
ఇంటర్నెట్ వీధుల్లో
దేహాలు వేలం వేస్తే సిగ్గుపడి పారిపోతాయని
అంతులేని విషాన్ని చిమ్మితే
మోరెత్తిన కంఠాలు
అవమానపు జ్వాలల్లో నశిస్తాయని రగిలిపోయాయి

ఏమౌతుంది
తాటాకు చప్పుళ్ళకు
బెదిరే గొంతుకలా అవి
మేకపోతు గాంభీర్యాలకు పారిపోయే
పిరికిపందలా వాళ్ళు

ఈ దేశపు మూలవాసుల వారసత్వాలు
వేర్లను తాకిన ఊడల విషాన్ని లాగి పడేసే ధీరలు
సారవంతమైన దేశాన్ని కలగంటున్న ఆశావహులు

# వెన్నెల గొడుగు



- డా: తాళ్లపల్లి యకమ్మ

ఛీ ఛీ..! పొద్దు పొద్దున్నే దరిద్రపు ముఖాన్ని చూడలేక చస్తున్నా.. నంటూ అందంగా అద్దాలు దాపిన ఆరంతస్తుల మేడ సూర్య కిరణాల కాంతికి ధగ ధగా మెరిసి పోతున్న షూ మార్ట్ ఓనర్ రంగారావు ఆగర్వత్తులను వెలిగించి మొదటి అంతస్తులో ఉన్న దేవుళ్ళ పటాలకు దూపం వేస్తూ షాపు ముందు ఉన్న రోడ్డు వైపు చూపులు సారిస్తూ తిట్ల దండకంతోనే దేవుళ్ళకు దూప దీప నైవేద్యాలు సమర్పించి సర్రున బైటికి వచ్చాడు రంగారావు.

నడిచి నడవలేక అడుగులో అడుగు వేసుకొంటూ వచ్చి, చేతిలోని చిల్లుల సంచి రంగారావు షాపు ముందు రోడ్డు పక్కన ఒక మూలన పెట్టి, "పటేలా"అంటూ రెండు చేతులు జోడించింది ఒక ఎముకల గూడు.

" ఒరే రామిగా..!ఎన్ని రోజులని నిన్ను భరించాలిరా.. నేను.. ఇక్కడి నుండి నీ చింపిరి బొంత పాత చెప్పుల దరిద్రం తీసేయమంటే దరిద్రం పట్టుకున్నట్టే పట్టుకున్నావేందిరా నా షాపు ముందు పొద్దున్నుండి రాత్రి వరకు గబ్బిలం వేలాడినట్టు వేలాడుతున్నావు. షాపు ముందు దిష్టి బొమ్మలాగా పడుంటావులే అనుకొని ఇన్ని రోజుల నుండి నిన్ను వెల్లగొట్టకుండా ఆగాను. వారం రోజుల్లో నా పెద్ద కొడుకు, కోడలు అమెరికా నుండి వస్తున్నారు. వాళ్ళు నిన్ను,నీ అవుతారం చూసి నిన్ను ఇక్కడ ఉండనిస్తున్నందుకు నా ముఖం మీద ఉమ్మేస్తారు. నీ దిక్కుమాలిన ఆ చింపురు బొంతలు అన్నీ తీసుకొని తట్ట బుట్ట సర్దుకొని రెండు రోజుల్లో వెళ్లిపోవలే లేకుంటే నిన్ను, నీ వస్తువులను మున్సిపాలిటీ వాళ్ళను పిలిచి చెత్త కుప్పలో వేయిస్త ఏమనుకుంటున్నావో"అంటూ ఉరుముతున్నాడు రంగారావు.

అప్పుడే వస్తున్న రమేష్ షాపు ముందు చెప్పులు విప్పి లోపలికి వెళ్లబోతు "పొద్దున్నే ఎందుకండీ రంగారావుగారు మా నాయినను అట్లా తిడుతున్నారు"అనే మాట పూర్తి కాక ముందే "ఒరే ఒళ్ళు కొవ్వెక్కిందార.... ఓనరను పట్టుకొని పేరు పెట్టి పిలుస్తావా .... ! ఏదో ఒక్క ఊరివాళ్లం అని మీ అయ్య మొఖం చూసి నీకు నా షాపుల పని ఇచ్చిన, నీ అయ్యకు నా షాపు ముందు పాత చెప్పులు కుట్టుకోవటానికి ఇంత జాగిచ్చిన.... సారు అని పిలువాలే ఏందీ అర్థమైందా..!మీరు మీ కులం బుద్ది పోనిచ్చుకోరార నీ.... !"అంటూ బూతుల పంచాంగం మొదలు పెట్టాడు రంగారావు.

" ఆగురి పటేలా.. జర ఆగురి ..! పోరనికి తెల్వదు పటేలా..!ఈ ఒక్క పాలికి మా తప్పు కాయండి ..!"అంటూ రెండు చేతులు జోడించాడు రామయ్య.

"బాగుందిరా.. యవ్వారం నీ కొడుకేమో గుర్రాంచుతడు నువ్వేమో కాళ్ళు మొక్కుత బాంచన్ పటేలా..! అంటవు. ఈ ఒక్కసారికి నీ మొఖం జూసి ఇడిసిపెడుతున్న, రొండు రోజులు గడువిస్తున్న.... తర్వాత తండ్రీ, కొడుకులు కలిసి చిప్ప పట్టుకొని రోడ్డెక్కుతరో, ఉద్యోగాలు చేసి ఉల్లేలుతారో మీ ఇష్టం" అనుకుంటూనే "ఏందిరా....! సదువుకున్ననని టెంపరారా....! గతిలేని బతుకులకు రోషమెందుకురా..!నడువ్.. నడువ్ లోపల అద్దాలు తుడిచి,ఊడవాలే పోరా....గుర్రాంచింది చాలుగానీ...."అంటూ రమేష్ మెడబట్టి లోపలికి నెట్టాడు రంగారావు.

తరాలు మారినా మారని తమ తల రాతలను తిట్టుకుంటూ కళ్ళలోని నీళ్ళను గుండెలోకి ఒంపుకొని లోపలికి వెళ్ళి మూలన ఉన్న చీపురుని చేతులోకి తీసుకున్నాడు రమేష్.

చిల్లుల సంచిలోనుండి ఒక చింపిరి బొంతను తీసీ కింద పరిచి, సంచిలోని గూటం, పంద్రాయి, ఆరే,పనికత్తి, దారపుండ, ఉంగటాలు, గూడలు తెగిపోయిన కొన్ని పాత చెప్పుల జతలు, కొన్ని తోలు ముక్కలు, కొన్ని రబ్బరు ముక్కలు, చెప్పుల మొలలు

ఒక్కొక్కటిగా తీసీ ఆ చింపుల జోర బొంత మీద పెట్టి, పాత బట్ట చుట్టి ఉన్న నీళ్ళ బాటిల్ మూత తీసుకొని తలపైకెత్తి గటగట నాలుగు గుటకల నీళ్ళు తాగి, బాటిల్ మూత పెట్టి సంచిలో ఒక మూలకు పెట్టుకొని, ఒక పొడవాటి గొడుగును సంచిలోనుండి తీసి, కుడిచేతి బొటన వేలితో బలవంతంగా బటన్ నొక్కగానే తుప్పుపట్టిన బటన్ లోపలికి పోయి గొడుగు విచ్చుకోగానే నెమ్మదిగా ఒక దీర్ఘ శ్వాస తీసుకొని గొడుగును బొంత పక్కన నిలబెట్టి దాని కింద కూర్చున్నాడు రామయ్య .ఆకాశంలో నక్షత్రాలను తలపింప చేస్తున్నాయి ఆ గొడుగుపై చిల్లులు. ఆ చిల్లులలో నుండి వెన్నల రాత్రుల్లో పిండారబోసినట్టుగా సూర్య కిరణాలు ఆ గొడుగుపై పడి ఆ చిల్లుల గుండా రామయ్య మీద వెలుతురుతో పాటు వేడి తాపాన్ని కూడా కురిపిస్తున్నాయి. ఒంటి నిండా ముచ్చమటలు పడుతుంటే పంద్రాయిపై పక్కనున్న పాత ప్లాస్టిక్ డబ్బాలో పట్టుకున్న నీళ్ళు ఎడమ చేతితో తీసుకొని చిలకరిస్తూ పనికత్తిని నూరుతూ రోడ్డు వైపు అటూ ఇటూ చూస్తున్నాడు ఆశగా.

చాలా సంవత్సరాల తర్వాత ఉద్యోగ బదిలీ పై పుట్టిన ఊరికి వస్తున్న ఊపాధ్యాయురాలైన తులసి అప్పుడే రైలు దిగి తన వెంట డిగ్రీ చదువుతున్న తన కూతురుకు కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా రోడ్ల విస్తరణ, వీధిలైట్లు, నూతనంగా నిర్మించిన ఎత్తైన భవంతులతో గుర్తు పట్టలేనంతగా మారిపోయిన ఊరును చూపిస్తూ నడుస్తున్న తులసి కాలికి ఎదురుగా ఉన్న ఒక పోటు రాయి తగిలి ఒక్కసారిగా ముందుకు మొగ్గి చెప్పు ఉంగటం తెగి కాలి పట్టు తప్పి ముందుకు పడబోయిన తులసి చేయి పట్టి వెనుకకు లాగి పట్టుకుంది తులసి కూతురు వెన్నెల.

"అరే.. కొత్త చెప్పు తెగిపోయిందే....! ఇప్పుడు ఎలా..!దీన్ని కిట్టిద్దామంటే ఇక్కడ చెప్పులు కుట్టే వాళ్ళు ఎవరు కనిపించటం లేదు కదా....!"అనుకుంటూ చుట్టూ చూపులు సారించింది తులసి.

"పాత చెప్పును కుట్టియ్యడమెందుకు అమ్మా.... అదిగో కొంచెం ముందుకు వెళితే అక్కడో పెద్ద చెప్పుల షాపు కనిపిస్తుంది చూడూ, అక్కడ చెప్పులు కొనుక్కొని ఆటో ఎక్కుదాం పదా.. ఈ చెప్పులు ఆ చెత్తకుండీలో పారేయమ్మా.."అంది చనువుగా తల్లి చెయ్యి పట్టుకొని వెన్నెల. మూడు నెలలు కూడా కాలేదు అప్పుడే పారేయ్యాలా.. అయినా ఇప్పుడు అన్నీ మీద మెరుగులకు బానే ఉంటాయి కానీ ఇదిగో ఇలాగే తెగిపోతాయి. మా చిన్నప్పుడు మా నాయిన చెప్పులు కిట్టిస్తే ఎంత గట్టిగా ఉండేవో తెలుసా..!"అంటూ వెన్నెల వైపు చిరునవ్వుతో చూసింది తులసి.

"అవునా.. అమ్మా.. ఇక నువ్వు నీ.. చిన్నప్పటి ముచ్చట్లు మొదలుపెట్టావంటే ఇక ఇక్కడే తెల్లారిపోతుందిగానీ.. ఇక వెళదాం పదమ్మా.."అంటూ నవ్వింది వెన్నెల.

"అంటే నీను సోది చెప్పుతున్నాననేగా అర్థం...!"అంటూ భుంగ మూతి పెట్టింది తులసి.

"కాదు కాదు.. అలా.. ఏం కాదమ్మా.. మా.. మంచి అమ్మవు కదూ..!పద.. పద.. మనం ముందు చెప్పులు కొనుక్కుకుందాం.."అంటూ పాత చెప్పులను తీసీ పారేయబోయింది వెన్నెల.

"ఏయ్ వెన్నెలా ఏం చేస్తున్నావ్.. ఆ చెప్పులు ఈ కవర్లో వెయ్యి వీలైనపుడు కుట్టించుకుంటాను..."అంటూ హ్యాండు బ్యాగులో నుండి ఒక కవర్ తీసీ అందులో తెగిపోయిన చెప్పులు వేసి పట్టుకుంది తులసి.

కష్టాలకు వెరువకుండా, కన్నీళ్లకు జడువకుండా ఎన్ని ఆటుపోట్లు వచ్చినా తట్టుకొని నిలబడిన తులసికి రూపాయి విలువ, ఆకలి విలువ తెలిసు కాబట్టే ఈ రోజు సమాజంలో తనకంటూ ఒక ఉన్నత స్థానాన్ని సంపాదించుకున్న తల్లిని తదేకంగా చూస్తూ ఉండిపోయింది వెన్నెల.

"వెన్నెలా.. వెన్నెలా.. ఏంటీ అలా చూస్తున్నావ్.. ఇక వెలుదామా.."అంటూ వెన్నెల చెయ్యి పట్టి అటూ ఇటూ ఊపింది తులసి.

"ఏం లేదమ్మా.. నీకు ఇంత ఓర్పు, సహనంతో పాటు పొదుపు చేయడం ఎలా అలవాటయ్యింది" అంటూ ప్రేమగా తల్లి వైపు చూసింది వెన్నెల.

"అదా..! మీ అమ్మమ్మ తాతయ్యల నుండి, ఈ నిచ్చెనమెట్ల సమాజం నుండి, పేదరికంతో పాటు అంటరానితనం, అవమానాలు నేర్పించాయి. అందుకే పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించాను. మీ తాత చెప్పులు కుట్టి , మీ అమ్మమ్మ కూలి చేసి ఎంతో కష్టపడి నన్ను చదివించారు. అందుకే ఈ ఆలోచన . ఇప్పటికీ మనం ఎన్ని అంతరాలను అవమానాలను చవి చూస్తున్నామో నీక్కూడా అనుభవమేగా వెన్నెలా.. పైసలు సంపాదించటమే కాదు, వాటిని పొదుపుగా వాడుకుంటేనే జీవితాలను ముందుకు నడుపుకోగలుగుతాం..!"అంటూ వెన్నెలను తీసుకొని ముందుకు నడిచింది తులసి.

రంగారావు షూ మార్ట్ దగ్గరికి వెళ్ళిన తులసి కళ్ళు ఆరంతస్తుల అద్దాల మేడ ముందు వెన్నెల గొడుగు కింద చెమటలు కక్కుతూ చెప్పులు కుడుతున్న రామయ్యాను చూస్తున్నాయి.

"అమ్మా..అమ్మా..! ఈ లోకంలోనే ఉన్నావా....!"అంటూ చెయ్యిపట్టి ఊపుతున్న వెన్నెలను చూస్తూ "అదిగో ఆ తాత దగ్గర చెప్పు కుట్టించుకుందాం..!"అంటూ ముందుకు నడిచింది తులసి.

"కొత్త చెప్పులు కొనుక్కుందాం అంటే వినవు కదమ్మా..! సరే అయితే నీ ఇష్టప్రకారమే కానియ్ ..!"అంటూ పక్కకు నిలబడింది వెన్నెల.

" పె ద్ద య్యా . . ! బా గు న్నా వా నే . . ! " అ ం టూ పలకరించిందితులసి. కళ్ళు పెద్దవి చేసి, చేతిని నొసలుకు ఆనించి సూపు సరిగ్గా దొరుకతలేదు బిడ్డా..!"అంటూ తులసి వైపు చూశాడు రామయ్య.

"పెద్దయ్యా..! నేను తులసిని గంగయ్య బిడ్డను. నేను చిన్నప్పుడు ఈ ఎదురుగా ఉన్న స్కూల్లో చదువుకునేటప్పుడు రకరకాల చెప్పులు చేసి ఇచ్చేవాడివి, ఎప్పుడు చెప్పులు తెగినా స్కూల్లో నుండి ఉరుకొచ్చి నీ దగ్గరే కుట్టించుకొనేదాన్ని, మా స్కూల్లో పిల్లల, టీచర్ల చెప్పులు తెగినా నువ్వే కుట్టి కొత్త చెప్పుల లెక్క చేసి ఇస్తుంటివి కదనే..!"అంటూ గలగలా గోదారిలా మాట్లాడుతున్న తులసిని గుర్తు పట్టి, "గప్పటి సంగతులన్నీ యాదిబెట్టుకున్నవా తులసమ్మా..! గప్పటికి గిప్పటికి నీ మాట తీరు ఏమీ మారలేదు బిడ్డా..! నువ్వు పెద్ద సదువులు సదివి పంతులమ్మవైనవట గద బిడ్డా..మీ నాయిన గా ముచ్చట చెప్పుకుంట మస్తు మురిసిండు." అన్నాడు రామయ్య ఆప్యాయంగా. రామయ్య దీన స్థితిని చూసిన తులసి కళ్ల ముందు మూడు దశాబ్దాల కాలం కదలాడుతుంది.

"ఏమైంది పెద్దయ్యా.. నా చిన్నతనంలో ఎంత బాగుండేవాడివి, ఈ అద్దాల మేడ కట్టిన స్థలంలో నీదోక చిన్న చెక్క గుమ్మీ ఉంటుండేగదా..!ఆ జాగను ఎందుకు అమ్ముకున్నారు. ఇలా రోడ్డు మీద ఈ స్థితి ఏంటీ..!"అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది తులసి.

"ఏం జయ్యలె బిడ్డా....! ఉన్నదో లేనిదో తిని ఊళ్ళే ఉంటుంటిమి. అయినా ఎనకటి సంది మనయి ఎట్టి బతుకులేనాయే..!మీ పెద్దమ్మ అడివిలకు పోయి తంగేడు కట్టెలు కొట్టుకొచ్చి వాటి చెక్క తీస్తే, ఆ చెక్క లందగోలేంలకు అయ్యేది. కట్టెలు పొయ్యి కిందికాయే"అని రామయ్య అంటుండగానే "ఏంటీ.... ! లందగోలెమా....! నీళ్ళ గోలెం గిరించి తెలుసు గానీ..!"అంటూ ప్రశ్నార్థకంగా తల్లి వైపు చూసింది వెన్నెల.

"మీ అమ్మకేమెరుక మనుమరాలా.. నేను చెప్తుతా ఇను.. ఊర్లల్లా ఆసాముల బర్లు, గొడ్లు చచ్చిపోతే మా మాదిగోల్లమే పోయి వాటిని ఊరి బైటికి తీస్కొని పోయి ఒడుపుగా తోలు ఒలిచి, ఆ తోలు తెచ్చి ఒక గోలెముల ఏసి, ఇన్ని నీళ్ళు పోసి, ఇంత సున్నం ఏసి, ఇంత తంగేడు చెక్క ఏసి, తోలును నానబెట్టేదాన్నే లందగోలెం అంటరు"అన్నాడు రామయ్య. "మరి అది ఇంట్లోనే ఉంచితే వాసన రాదా..!"అంటూ అమాయకంగా అడిగింది వెన్నెల.

"ఇంటింటికీ అదే ఉంటుండే గూడెమంతా గౌలు వాసన వచ్చేది. ఆ వాసన భరించటం మా ఆకలి బతుకులకు అలవాటుగా మారింది"అంటూ భుజం మీది తువ్వాలతో కళ్ళు ఒత్తుకున్నాడు రామయ్య.

"మరి ఆ తోలును ఏం చేసేవాళ్ళు తాత" అంది ఆసక్తిగా వెన్నెల.

"వారం పది దినాలు గడిచినంక ఆ తోలును తీసి పని కత్తితోని ఊని, సుబ్బరంగా మంచి నీళ్ళల్ల జాడిచ్చి ఎండలో అరబెట్టి, దాన్ని వార్లుగా కోసి అందంగా చెప్పుల జోళ్లు చేసి ఆసాములకు ఇచ్చేటోల్లమ్. ఆడొల్లు ఆసాముల ఇండ్లళ్ళ ఊడిగం చేస్తే యాడాదికోపాలి ఆల్లు దయదలిచి కల్లంల ఇన్ని వడ్ల గింజలు ఇడిసిపెడితే అదే మహాభాగ్యమని కళ్లకద్దుకొని తీసుకొని బతుకులు ఏళ్లదీసుకొనేవాళ్ళం"అంటూ నిట్టూర్చాడు రామయ్య.

"అది సరే పెద్దయ్యా.. అదంతా నాకు తెల్సిన ముచ్చటేగాని.. నీ డబ్బాకొట్టు ఏమైంది..!"అంది ప్రశ్నార్థకంగా తులసి.

"గాడికే వస్తున్న తులసవ్వా.....! రాంగ రాంగ.. ఆసాములందరు ఎవుసాయం ఇడిసిపెట్టి భూములన్నీ అమ్ముకొని పట్నం దారి పట్టిరి.. మిగిలిన వాళ్ళు లబ్బరు చెప్పులు తొడుగుడు మొదలువెట్టిరి, ఇగ ఊల్లె శారదంత జాగ గూడా లేని నా అసోంటోళ్ళు బతుకుదెరువు కోసం ఉన్న రొండు లాగదూడలను అడ్డికి పావుశేరు అమ్ముకొని, ఇంతంత గుమ్మి డబ్బ పెట్టుకొని, ఊల్లె నుంచి తెచ్చిన తోలు తోటి చెప్పులు

చేసి ఆ డబ్బుల పెట్టుకొని అమ్ముకుంటూ, ఇటు పాత చెప్పులు కుట్టుకుంటు,కొద్దిగా యాపరం సాగి నాలుగు మెతుకులు దొరుకుతున్నాయని సంబురపడేలోపే" అంటూ ఉబికి వస్తున్న దు:ఖాన్ని ఆపుకోలేక నోట్లో తువ్వాల కుక్కుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్న రామయ్యను చిన్న పిల్లాడిలా దగ్గరకు తీసుకొని ఓదారుస్తూ "అసలేం జరిగింది పెద్దయ్యా..!"అంటూ వెన్ను నిమిరింది తులసి.

నెమ్మదిగా తనను తాను తమాయించుకున్న రామయ్య "ఇగో తులసవ్వ....! మా ఊరి రంగయ్య పటేలు దినామ్ పట్నం పోయి పేకాటలు, ఇంకెందో ఆటలాట ఆడి ఆడి ఇల్లు వాకిలితో సహ ఉన్న భూములన్నీ అమ్ముకొని మొత్తం దివాలా దీసి పెండ్లం, పిల్లలను ఎంటబెట్టుకొని కట్టుబట్టల తోటి ఈ ఊరు చేరిండు"అంటూ ఒక దీర్ఘ శ్వాస తీసుకొని "పని కోసం తిరిగి తిరిగి బికారిగా నా దగ్గరికి వచ్చి దీనంగా నిలబడ్డడు. 'కూసో పటేలా.. అని నేను కూసున్నచిన్న బల్లె పీట తీసి, నా నెత్తికున్న రుమాలు తీసి దుమ్ము దూలి తుడిసి యిస్తిని. దర్జాగ కాలుమీన కాలేసుకొని కూసోని నా దుకునాన్ని తేరిపార జూసీ, ఒరే రామిగా..! పట్నం ఒచ్చి దుకాణం గికాణం బెట్టి బాగానే ఉన్నవ్ గదరా..! అన్నాడు.

ఏదో పటేలా అట్టట్ట బతుకుతున్నం అనంగానే అటు ఇటు జూసి సపుక్కున నా రొండు చేతులందుకొని ఒరే.. రామిగా.. నిన్ను ఒక మాటడుగుతా కాదనకురా..! అని గీమాడిండు"అంటూ తులసి వైపు చూస్తూ కన్నీరు పెట్టుకుండు రామయ్య.

"తర్వాత ఏమైంది పెద్దయ్యా.. రంగయ్య పటేలు నిన్ను ఏమడిగిండు....!"అంటూ ఆతృతగా అడిగింది తులసి.

"ఏం చెప్పను తులసవ్వా....ఆనాడు రంగయ్య పటేలు మనల్ని తన తలవాకిట్లకు గూడా అడుగు పెట్టనిచ్చేటోడు కాదు. ఆయన గారి పెండ్లం లచ్చుమమ్మ గారు గూడా దూరం.. దూరం అనుకుంట పైనుంచి చెంబెత్తి దోసిట్ల నీళ్ళు పోత్తుంటే సగం నోట్లే, సగం కింద పోతుండే. అటువంటి పటేల్ ఆయాల నా రొండు చేతులు పట్టుకొని నన్నుసాయమడిగిండు"అంటూ మూలకున్న బాటిల్ తీసి 'ఒక్క గుటికెడన్ని నీళ్ళు తాగుత బిడ్డా నాలికె పిడిచ కట్టుకుపోతుంది'అని మంచి నీళ్ళు తాగి దమ్ము తీసుకొని, ఒకసారి అద్దాల మేడ వైపు తిరిగి చూశాడు రంగయ్య.

"ఆయన సహాయం అడగగానే నువ్వు నీ స్థలాన్ని మొత్తం అమ్మినవా....!"అంది ఒకింత కోపంగా తులసి.

"అయ్యో.. తులసవ్వా.. నేను అమ్మలేదు.. పురాగా ఇను జర.. 'ఒరే రామిగా నువ్వు రకరకాల తోలు చెప్పులు చేసి బాగానే అమ్ముతున్నావుగా నీ చెప్పులతో పాటు నేనో నాలుగు జతల రబ్బరు చెప్పులు పెట్టుకొని అమ్ముకుంట కాదనకురా.. నా భార్య ,బిడ్డలు ఆకలితో మల మల మాడి చస్తున్నారు' అని రంగయ్య పటేలు వలవల ఏడ్చే వరకే నా గుండె చేరువైంది. 'దానికేం భాగ్యం పటేలా.. పెట్టుకోండ్రి..' అని అన్నానో లేదో ఇసుంత రమ్మంటే ఇల్లంతా నాదే అన్నట్టు రోజిన్ని చెప్పుల జతలు తెచ్చి నా చెప్పులల్ల కలిపి వచ్చిన జనాలను మాటలతోటి మాయ చేసి లబ్బర్ చెప్పులను కొనేటట్టు చేసిండు , రోజురోజుకు నా యాపారం సన్నగిల్లింది. ఆయన పిల్లలను సదువుకు తోలిండు. నా పిల్లల్ని బడి మాన్పించి షాపుల పనికి పెట్టిండు. అదును జూసి లోను ఇప్పిత్తనని నమ్మించి కాయితాల మీన మా అందరితోటి ఏలు ముద్రలు ఏయించుకొని, రంగయ్య పటేలు రంగారావుగా మారిండు. చెప్పుల షాపు రామయ్యమాత్రం రోడ్డుమీద పాత చెప్పులు కుట్టుకునే రామిగాడుగా మిగిలిండు. ఇప్పుడు ఈ రోడ్డు మీద గూడా ఉండొద్దని గెదుముతుండ"ని తులసి చేతుల్లోముఖం దాచకొని చిన్న పిల్లడిలా బోరున విలపించాడు రామయ్య.

తులసికి వెయ్యి గుణాపాలు ఎదలో దిగినంత బాధ కలిగింది. "ఏమిటి ఈ అన్యాయం,పల్లెల్లో ఉన్నపుడు ఎట్టి చాకిరి చేయించుకొని మావాళ్ళ శ్రమను దోచుకున్నారు. చివరకు పట్నాలకు చేరి కూడా ఇలా సర్వం దోచుకోవడం వారికే చెల్లుతుంది. ఈ సమాజంలోని మనుషులకు తరతరాలుగా చెప్పులు చేసి వాళ్ళ కాళ్ళు కందకుండా కాపాడుతున్న వారిని పంచముడిని చేసి వెలివాడల్లో పడేశారు"అంటూ ఎంతో ఆవేదన చెందిన తులసి "పెద్దయ్యా నేను రేపు ఉదయమే వస్తాను "అని వెన్నెలను తీసుకొని వెళ్ళింది.

ఉదయం పది గంటలకల్లా రంగారావు షాపు దగ్గరికి చేరుకుంది తులసి. రోజు లాగే బతుకు బండిని నడపడం కోసం చింపుల బొంత పరుస్తున్నాడు రామయ్య. రంగారావు మెడలో పలుపు తాడంత బంగారు గొలుసు ధగధగ మెరుస్తుంది. రెండు చేతులకు పది వేళ్ళనిండా బంగారు ఉంగరాలు. ముంజేతికి బేడీలు వేసినట్టుగా ఉన్న బ్రాస్లెట్లు, తెల్లని కద్దర్ బట్టలతో క్యాష్ కౌంటర్ దగ్గర కూర్చున్నాడు రంగారావు.తులసి షాపులోకి వెళ్ళగానే "రండి మేడం రాండి.. ఏ రకం చెప్పులు కావాలో ఎదురుగా ఉన్నాయి చూసుకోండి.."అంటూ చెప్పుల వైపు చూపించాడు రంగారావు.

"నేను చెప్పుల కోసం రాలేదండి.."అంది తులసి. 'మరింకేం కావాలి'అన్నట్టుగాచూశాడు రంగారావు. "మా తమ్ముడి కోసం వచ్చాను"అంది తులసి. "మీ తమ్ముడా.. సేల్స్ మ్యాన్స్ ఇంకా రాలేదండి, మీ తమ్ముడి పేరెంటీ"అన్నాడు రంగారావు" వాళ్ళెవరూ కాదండీ.. అదిగో అతడే మా తమ్ముడు"అంటూ అద్దాలు తుడుస్తున్న రమేష్ వైపు చూపించింది. "ఏందీ..ఆ రామిగాని కొడుకు ఈ రమేష్ గాడు నీకు తమ్ముడా..!"అంటూ మీరు అని సంభోదించిన రంగారావు నువ్వు అని చులకనగా మాట్లాడుతూ "ఒరే వారి మీ అక్కటరా.. నీ కోసం వచ్చింది.."అంటూ ముఖం చిట్లించుకుంటూ 'కట్టు బొట్టు చూసి ఎవరో పెద్ద కులం ఆమె అనుకొని గారు.. మీరు.. అని మాట్లాడిన'అని లోలోపల తనను తానే తిట్టుకున్నాడు రంగారావు.

"నేను రమేష్ ను బయటికి తీసికెలుతున్నానండి "అంది తులసి. "ఏవమ్మా..!వాన్ని నువ్వు బయటికి తీసుకపోతే.. ఇక్కడ పని ఎవరు చేస్తారు.. నువ్వు చేస్తావా.. ఏందీ..!"అన్నాడు హేళనగా.

"మిస్టర్ రంగయ్య.. మాటలు జాగ్రత్తగా రానివ్వు..!, వీడెమన్నా నీకు కట్టు బానిస అనుకుంటున్నావా..!అంటూ గట్టిగా దబాయించింది తులసి.

"రంగయ్య ఏందీ.. మర్యాద లేకుండా, నా పేరు రంగారావు.. అయినా నా పేరు నాకేం తెలుసు..!"అంటూ గట్టిగా ఉరిమాడు రంగారావు.

"నీ పేరూ తెలుసూ .. నువ్వు రంగారావుగా మారిన పరిణామ క్రమమూ తెలుసు"అని తులసి అంటుండగానే "ఓ.. తులసవ్వ.. ఎందుకు బిడ్డా పెద్దోళ్ల తోటి కొట్లాట ఇటురా..!"అంటూ రామయ్య తులసిని ఆపుతున్నాడు. "అవునక్కా.. వాళ్ళ సంగతి నీకు తెల్వదు కూలిచ్చి విషం తినిపిస్తరు..!"అంటూ వణికిపోతున్నాడు రమేష్. "నీనేమి ఆయనతో గొడవ పడటం లేదు.. జరగవలసిన నష్టం ఎలాగో జరిగిపోయింది, ఋజువులు లేకుండా ఘరానా మోసం చేశాడా పెద్దమనిషి రంగయ్య. ఆయన షాపులో నువ్వేమి ఉండొద్దు"అంటూ రమేష్ చేయి పట్టుకొని బయటికి తీసుకొస్తున్న తులసిని ఉద్దేశించి "నువ్వు పని మధ్యలోనుండి తీసుకొనిపోతే నేను నీ మీద కేసు పెడతా"నంటూ బెదిరించాడు రంగారావు.

"కేసు పెడతావా.. రంగయ్యా.. కేసు..!పోదాం పదా.. పోలీస్టేషన్ కు ఏ సెక్షన్ కింద కేసు పెడతావో పదా.. పనిలో పనిగా రామయ్యకు నువ్వు చేసిన మోసం కూడా బయటపెడదాం.."అంటూ ఎదురు తిరిగింది తులసి.

'బాగా చదువుకున్నదానిలా ఉంది, చట్టాలు గిట్టాలు అని ' లా'పాయింట్లు మాట్లాడుతుంది, ఈమె తోటి పెట్టుకుంటే తీగె లాగితే డొంకంతా కదిలినట్టు నా మోసం బయట పడిపోతది'ని మనసులోనే భయపడుతూ పైకి మాత్రం "ఆ.. ఆ..పోండి.. పోండి.. నాకు పనివాళ్ళు దొరకరా.. ఏంది.. పైసలు పారేస్తే బొచ్చెడు మంది దొరుకుతరు.."అంటూ బింకాలు పోయాడు రంగారావు.

రమేష్ ను వెంట తీసుకొని ఎస్సీ కార్పొరేషన్ ఆఫీస్ కు వెళ్ళిన తులసి తన శూరిటి మీదనే లోన్ ఇప్పించింది.

పోగొట్టుకున్న చోటనే వెతుక్కోవాలన్నట్టు రంగారావు షాపు ఎదురుగానే చిన్న చెప్పుల షాపు పెట్టించింది తులసి. కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ రెండు చేతులు జోడించి తులసికి కృతజ్ఞతలు చెప్పుతున్న రామయ్య రెండు చేతులు పట్టుకొని "పెద్దయ్యా.. మీకు చదువు రాక పోవడంవల్లనే ఇంత మోసం జరిగింది. మన బానిసత్వం పోవాలంటే ఇప్పటి నుండి మన పిల్లలనైనా చదివించాలి,మన బాధలను పోగొట్టడానికి ఎన్నో బాధలు పడ్డ ఇదిగో ఈ మాహాత్ముడు అంబేద్కరుడే మన దేవుడు. ఈయన స్ఫూర్తి తోనే నేను ఇప్పుడు మీకు సహాయం చేయగలిగిన స్థాయికి ఎదిగాను. మనవాళ్ళకు మనమే చేయూతను అందించకపోతే ఎలా..! ఇకపై మీకు ఎప్పుడు బాధ కలిగినా ఈ దేవుని వైపు చూడడండి ధైర్యం మీ వెన్ను తట్టి మిమ్మల్ని ముందుకు నడిపిస్తుంది"అంటూ అంబేద్కర్ ఫోటోను రామయ్య చేతికి అందించింది తులసి.

అంబేద్కర్ ఫోటోను ఎదురుగా పెట్టుకొని పని ప్రారంభించారు రామయ్య,రమేష్. తన షాపు ముందు నిలబడి 'ఇగ వీళ్ళు యాపరం చేసి నన్ను అందుకోగలరా..'అని అనుకుంటున్న రాంగారావు గర్వపు చూపులు ఎదురుగా ఉన్న అంబేద్కర్ ఫోటోపై పడగానే, అంబేద్కర్ చూపుడు వేలు సరిగ్గా రంగారావునే నిలదీస్తున్నట్టుగా ఉంది. రంగారావుకు ముచ్చెమటలు పట్టి తన ఆరంతస్తుల అద్దాల మేడ పేక మేడల్లా కుప్పకూలిపోతున్నట్లు అనిపించి నిలుచున్న చోటనే కుప్ప కూలిపోయాడు.

**- డా. తాళ్లపల్లి యకమ్మ**
మహబూబాబాద్ జిల్లా, సెల్ : 9704226681

వ్యాసం

# విముక్త స్త్రీల ముక్త గీతాలు - బౌద్ధంలో స్త్రీలు



## (భారతీయ స్త్రీల తొలి కవిత్వ సంకలనం 'థేరిగాథ' పరిచయం)

- కొల్లాపురం విమల

"Grow full..

Like the moon on the fifteenth day...

Burst the mass of darkness" (punna)

బౌద్ధ భిక్షుకి పున్న చెప్పిన పై కవితాత్మక వాక్యాలు చికాగో లో నల్ల జాతీయులైన స్త్రీలతో కలిసి నేను బౌద్ధ దీక్ష తీసుకున్నప్పటి అపురూప క్షణాలను గుర్తు చేసినై. ఎమ్మా గోల్డ్ మన్ వంటి మేధావుల నాయకత్వ స్ఫూర్తిని అందుకున్న హైడ్ పార్క్ నల్లజాతి స్త్రీలను కలిసే అదృష్టం నాకు చికాగో యూనివర్సిటీలో ఉద్యోగం వల్ల కల్గింది. బుష్ నిరంకుశ ధోరణీ, 2003 సం. నాటికి పెచ్చరిల్లుతున్న ఇరాక్ యుద్ధోన్మాద సందర్భంలో మమ్మల్ని చుట్టుముట్టిన నిరాశా నిస్పృహల చీకట్లను బద్దలు కొట్టేందుకు బౌద్ధం మాకు ఆసరా ఇచ్చింది. ఐతే అప్పటికింకా తెలియదు 2500 సం.ల పూర్వమే ఎందరో స్త్రీలు బౌద్ధ జీవితాన్ని తమ విముక్తి మార్గంగా యెంచుకున్నారని. వారు తమ అనుభవాలను అద్భుత కవితాపాదాలుగా మనకందిచ్చారన్న విషయం ఇప్పటికైనా తెలుసుకునేందుకు అవకాశం కల్పించింది ఈ వ్యాస సందర్భం.

'బౌద్ధంలో స్త్రీలు' అన్న అంశంవైపు చూపు సారించినప్పుడు 2,500 సంవత్సరాలకు పూర్వమే బౌద్ధ స్త్రీలు రాసిన అద్భుతమైన గాథలు నా దృష్టికి వచ్చినై. అక్క మహాదేవి వచనాల వలె తేట నీటి వంటి ఆ సాహిత్యం చూసాక బౌద్ధంలో స్త్రీల గురించి ఇప్పటికీ కొనసాగుతున్న అపోహలు, అనుమానాలూ, ప్రశ్నలూ, జవాబులూ ముప్పిరిగొని నన్ను విస్మయానికి గురిచేసినై. మన దేశంలో బౌద్ధంలో స్త్రీల గురించిన అపోహలు బ్రాహ్మణవాదమూ, వలసవాదమూ జమిలిగా అర్ధసత్యాలను చరిత్రగా నమోదు చేయడంతోనే ప్రారంభమైనై. నా చిన్నతనంలో సాంఘీకశాస్త్రం పాఠాల్లో బౌద్ధం క్షీణించడానికి కారణం స్త్రీలే అన్న పాఠాలుండేవి. అదే సత్యంగా నమ్మేతరం నాది. ఈ విషయాన్ని నిర్ధారించే కథనాలు పురాతన శిథిలాలను 'లంజెదిబ్బలు'గా ఇప్పటికీ చెలామణి చేస్తూనే వున్నై. మొత్తానికి బుద్ధుడు అయిష్టంగా (?) స్త్రీలకు ఆరామాల్లోకి ప్రవేశం కల్పించడం, ఫలితంగా క్రమంగా ఆరామాల్లో అరాచకం ప్రబలడం – ఆరామాలు భ్రష్టుపట్టడం – బౌద్ధం నామరూపాలు లేకుండా పోవడానికి కారణమైందనే కల్పిత చరిత్ర నిన్నమొన్నటి వరకూ నిజమైన చరిత్రగా చలామణి అయింది. ఇంకా భిన్న స్థాయిల్లో అవుతూనే వుంది. ఇందుకు చరిత్ర రచనలో వున్న పితృస్వామ్య భావనల్లోంచి చేసిన సూత్రీకరణలే మూలం తప్పితే బౌద్ధతత్వం లోపం కాదు అని నా అవగాహన.

బౌద్ధం మూల భావన సహనుభూతి. తాత్వికంగా సమస్త జీవావరణంలోని వైవిద్యాలను హత్తుకొని గౌరవించే భావనలను బోధిస్తుంది. బౌద్ధం లోని ఈ inclusiveness అనివార్యంగా జనాభాలోని సగభాగమైన స్త్రీలకు సమానత్వాన్ని ఎలాంటి జార్గాన్ లేకుండా ప్రతిపాదిస్తుంది. ఐతే కొందరు బౌద్ధ పరిశోధకులు చేసిన విశ్లేషణల్లోంచీ, ఆసియా దేశాల బౌద్ధ స్త్రీల అనుభవాల్లోంచీ బౌద్ధంలో సైతం చొరబడిన పితృస్వామిక భావజాలాన్ని ఆనవాలుపట్టొచ్చు. ఉదాహరణకి బౌద్ధం తొలినాళ్ల చారిత్రక దశను సూచించే థేరవాద గ్రంథాల్లో పునర్జన్మ గురించి ప్రస్తావన వచ్చినప్పుడు 'కర్మఫలం లోని లోటు వల్ల స్త్రీగా జన్మిస్తారనే' మాటను ఉటంకిస్తూ బుద్ధుని బోధలో స్త్రీపట్ల కన్పించే చిన్నచూపుగా కొందరు విమర్శకులు అంచనా వేయడం చూడొచ్చు. అట్లాగే స్త్రీలకి బోధకుల స్థానం పొందే అనుమతి లేకపోవడం, బోధకులుగా వారి నాయకత్వాన్ని నీరుగార్చే పరిస్థితుల వల్ల ఆసియా దేశాల్లో స్త్రీల స్థానం అంచులకు దిగజారిందనే వాదనలు ప్రస్తుతం కొందరు

చేయడం కద్దు. అయితే ఈ అంశాలు బుద్ధుడు ప్రతిపాదించిన జ్ఞాన సిద్ధాంతంలోని లోపాలకు ఉదాహరణలుగా ఒప్పుకోలేం. ఎందుకంటే బుద్ధుని బోధనలు ప్రాథమికంగా మౌఖికమైనవి. వాటిని ఎందరో అనుయాయులు తమదైన ధోరణుల్లో రికార్డు చేయడం వల్ల ఈలాంటి పితృస్వామిక భావనలు చొరబడి వుండవచ్చు. అట్లాగే బౌద్ధారామాల్లో పురుషుల ఆదిపత్యం ఆయా స్థలకాల సందర్భాలను బట్టి చొరబడి వుండవచ్చు. నిజానికి బౌద్ధంలో సకల జీవ సమానత్వమే మూల సిద్ధాంతమైనప్పుడు నాన్ సెల్ఫ్ అనేది ఆచరణ ఐనప్పుడు, 'జండర్' అనే అంశం పరిధిలోకి రాని విషయమౌతుంది. అట్లా చూసినప్పుడు బౌద్ధం జెండర్ అంశాన్ని తన అవగాహనలోకి ఇంకించుకోని తత్వంగా నిర్ధారితమౌతుంది.

ఇక చరిత్రరచనలో వాస్తవాల పేరిట చరిత్రకారులు చేసిన విషయాల ఎంపిక కూడా బౌద్ధంలో స్త్రీల గురించిన గందరగోళానికి కారణమైనై. ఉదాహరణకి "స్త్రీల ప్రవేశంతో వెయ్యి సంవత్సరాలు మనగలిగిన బౌద్ధం ఐదువందల సంవత్సరాల వరకు మాత్రమే నిలువగలుగుతుందని" అంటూ బుద్ధుడు నిస్పృహ తో నిట్టూర్చారనే విషయాన్ని ఎత్తిచూపే చరిత్రకారులు, తన ప్రాణం నిలబెట్టిన "సుజాత నుంచి జీవిత సత్యాన్నందుకున్నానని" బుద్ధుడు అనడాన్ని ప్రముఖంగా చూపరు. బుద్ధునికి స్త్రీల పట్ల విముఖతా భావం వుందని చెప్పకనే చెప్పే విమర్శకులు, స్త్రీలకు ప్రత్యేకంగా వున్న 5 'సంకారాల' గురించి బుద్ధుడు స్వయంగా ప్రస్తావించడం గురించి చెప్పరు. ఋతుక్రమం – గర్భం – కాన్పు వంటి '3' సంకారాలతో పాటు పుట్టింటిని వదిలి కొత్త కుటుంబంలో పాదుకోవడం, ఒక వ్యక్తి నిరీక్షణగా జీవితం స్థిరపడటం వంటి మిగిలిన '2' సంకారాల గురించి చర్చిస్తూ స్త్రీల కున్న శారీరకమైన క్లేశాలతో పాటు సామాజిక అణచివేతలు వారి జీవితాన్ని దుక్కభరితం చేయడాన్ని బుద్ధుడు సూటిగా ప్రస్థావించడాన్ని విమర్శకులు ఆనవాయితీగా విస్మరిస్తరు. నిజానికి ధ్యానం (విపశ్యన) ద్వారా స్వీయ స్పృహకు సంబంధించిన అవలోకనా, జ్ఞానానికి సంబంధించిన ఆలోచనా తద్వారా సాధించే స్వేచ్ఛ గురించి బుద్ధుడు చేసిన చర్చలు స్త్రీల స్వేచ్ఛకు దారులు పరిచినై. సంప్రదాయిక చట్రాలను ఛేదించి స్త్రీలకు విముక్తిని ప్రతిపాదించినై. వారికి స్వేచ్ఛగా, వివేచనతో మాట్లాడే సామాజిక సందర్భాలకు కల్పించినై. అందుకు సాక్ష్యంగా చరిత్ర రచనల్లో మరుగుపడిన స్త్రీల గొంతులు వారి రచనల ద్వారా మనకు ఈనాటికీ విన్పిస్తూనే వున్నై. ప్రపంచంలోనే స్త్రీల తొలి కవిత్వ సంకలనంగా గుర్తింపు పొందిన 'థేరిగాథ' అందుకు స్పష్టమైన ఉదాహరణ.

భారతీయ స్త్రీల తొలి రచనగా కూడా గుర్తింపు పొందిన సంకలనం 'థేరిగాథ'. బుద్ధుడు జీవించిన కాలంలోనే దాదాపు 2,500 సం.లకు పూర్వమే స్త్రీల చేత రచింపబడిన సృజనాత్మక రచనగా ఇది విశిష్టమైనది. పాలీ భాషలో సంకలితం కావింపబడిన స్త్రీల తొలి ఉదాన (పాలీ భాషలో చైతన్యవాక్యాలు అని అర్థం) సంకలనంగా ఇప్పటికీ గొప్ప ప్రాసంగికతను కల్గివున్న గ్రంథమిది. ఆ కాలం నుంచే స్త్రీలు బోధకులుగా సాగిన, ఇప్పటికీ పలు దేశాల్లో బోధకులుగా సాగుతున్న భిక్షుణుల జీవితం గురించి చెప్పటం ఈ సంకలనం మరో విశిష్టత. మరీ ముఖ్యంగా స్త్రీల జ్ఞానమార్గాన్ని బుద్ధుడు నిరసించాడనీ, స్త్రీలు విముక్తి మార్గంలో సాగలేని అర్భకులని బుద్ధుడు భావించాడనే వాదనలు అవాస్తవమైనవని ఈ సంకలనంలోని స్త్రీల గాథలు నిరూపిస్తై. 'థేరి' అంటే అనుభవజ్ఞులైన స్త్రీలు (గురువులు) రాసిన ఆత్మ కథనాల్లాంటి గాథలివి. చిన్న చిన్న పాదాల్లో కొండంత జీవితాన్ని చూపిన కవిత్వ వ్యక్తీకరణలివి. అక్క మహాదేవి రాసిన 'వచనాల్లాగా' స్పష్టమైన స్త్రీ గొంతుకతో తామున్న సామాజిక, వ్యక్తిగత జీవిత సందర్భాలను వున్నదున్నట్టుగా చెప్పిన గాథలివి. బుద్ధుడు జీవించిన కాలంలోనే దమ్మపథాన్ని అందుకున్న 'థేరి' గాథలతో పాటు 3 నుంచి 6వ శతాబ్దం వరకు ఆయా కాలాల్లో భిన్న సామాజిక నేపథ్యాల, ప్రాంతాల స్త్రీలగాథలు ఇందులో సంకలనమైనవి. 6వ శతాబ్దంలో దమ్మపాలుని వ్యాఖ్యానాలతో పాలీ భాషలో సంకలితమైనై. 'బౌద్ధం' తమకు చూపిన 'విముక్తి' మార్గాన్ని పదిమందికి చెప్పే క్రమంలో అలవోకగా వెలువడిన స్త్రీల సృజనలివి. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే 'విముక్తి' దిశగా విజయం సాధించిన స్త్రీల ముక్త గీతాలివి. తమ రోజువారీ జీవిత ప్రస్థానంలో ఎన్నో ఇక్కట్లకు లోనైనా చివరకు తమదే అయిన మార్గాన్నెంచుకున్న ఈ స్త్రీలు 'వంచితలు'గా గాక సంప్రదాయ చట్రాలను ఛేదించి నిలిచిన విజేతలుగా కన్పిస్తారు. తిరుగులేని 'వీర' వనితలుగా బుద్ధుని చేత కీర్తించబడుతారు. ఉదాహరణకి ఈ సంకలనం లోని ఒక కవితలో 'వీర' అనే థేరి బుద్ధుడు తనతో చేసిన సంభాషణగా రాసిన కవిత ఇలా వుంటుంది.

**వీర**

"నీ పేరుకి అర్థం నాయక – వీరా
నీ నాయకత్వ లక్షణాలకు నప్పిన పేరు
అన్నిటి లోతెరిగిన భిక్షుకవు నీవు

నీ శరీరాన్ని పదిలంగా చూసుకో — అది నీ చివరి మజిలీ

తర్వాత తిరిగి చావుకు వాహనం గాకుండా మాత్రం చూసుకో దాన్ని – వీరా''

బుద్ధుడు ఇట్లా తనతో అన్న మాటలను గాధగా పాఠకులతో పంచుకున్న 'థేరివీర' మాటలు స్త్రీని సబలగా, నాయకురాలిగా బుద్ధుడు చూపిన వైనానికి సాక్ష్యంగా కన్పిస్తై. అదే సమయంలో 'నిర్యాణం' గురించి బోధ చేయడమూ చూడొచ్చు. అట్లాగే తమకున్న ప్రత్యేకమైన 'సంకారాల' నుంచి బైటపడి స్త్రీలు విముక్తి మార్గాన్నెంచుకునే సామాజికావరణాన్ని బౌద్ధం ఏర్పర్చించదనడానికి 'ముత్త' రాసిన గాథ ఓ ఉదాహరణ

**ముత్త**

నా పేరుకి అర్థం విముక్త
స్వేచ్ఛా జీవిని నేను, ఆ మూడు వికృతావస్థల్లోంచి
రోలూ – రోకలీ – ఆ వొంకర వస్తువుతో బుద్ధిలేని నా మొగుడూ
చావు పుట్టుకల నుంచి బైటపడిన దాన్ని
మరు జన్మను పెకిలించి పారేసిన
విముక్తను — ముత్తను''

స్త్రీల జీవితంలో ఎడతెగని యాంత్రిక జీవితపు వొత్తిడినీ, సహనుభూతిని కోల్పోయిన పురుషుని వికృతావస్థలను స్పష్టంగా వివరిస్తూనే బౌద్ధం తనకు కల్పించిన అవకాశాన్నీ, అది చూపిన విముక్తి మార్గాన్నీ 'ముత్త' ఇందులో సూటిగా వివరించడం చూడొచ్చు. ఇంకో గాథలో 'అనొపమ' అనే భిక్షుక అంటుంది.

'నేను పుట్టింది గొప్ప కుటుంబంలో
సంపదలకు, విలువైన వస్తువులకు పుట్టినిల్లది
అందం — చందం — నేను
మేఘు ని సొంత బిడ్డని —
పోటీలేని 'అనొపమ'ను
నా పేరుకు తగ్గట్టు బతికిన —
రాకుమారుల కలల రాకుమారిని
కోటీశ్వరుల కొడుకులు కోరిన వధువుని
చివరాఖరికి 'అనొపమ'ను 'నాకివ్వు' అని
ఓ వరునిచే కోరబడ్డ దాన్ని
''నీ బిడ్డ బరువుకి ఎనిమిదింతల వెండి బంగారాలను
శుల్కంగా ఇచ్చుకుంటానన్న' వరునికి నిశ్చయమైనదాన్ని —
బుద్ధున్ని చూసాన్నేను — అందుకోలేని అతీతుడాతడు
పాదాలంటి పూజించా — అటువేపు వొదిగి నిలిచా —
గౌతముడు బోధించాడు నాకు శాంతిదయల దమ్మపదాన్ని
మరలిరాని ఏకాత్మనై — కూర్చుండిపోయానక్కడ
జుట్టు కత్తిరించుకొని — ఇల్లూ వాకిలి వొదిలేసి

ఇప్పటికి ఈ ఏడో రోజుకి — కోరికలను పెకిలించి పారేసిన — అనొపమను —

కోశాధికారియైన మజ్జ (మేఘుని) కూతురైన తనను ఎనిమిదింతల ధనం శుల్కంగా ఇచ్చి ఓ వరుడు పెళ్లిచేసుకోదలచిన వైనాన్నీ, బౌద్ధాన్ని విముక్తి మార్గంగా ఎంచుకున్న విషయాన్ని 'అనొపమ' ఈ గాథలో స్పష్టంగా వివరిస్తుంది. శతాబ్దాల కిందట నుంచీ కన్యాశుల్కమో — వరకట్నమో — పేరేదైనా స్త్రీల జీవితాలతో కర్కశంగా ఆడుకునే వెసలుబాటు కల్పించిన పితృస్వామిక భావజాలం గురించి స్పష్టంగా చెప్పిన కవిత ఇది. అంతేకాదు, ఆత్మగౌరవంతో బతికే వెసలుబాటను బౌద్ధం ఆనాటి స్త్రీలకు కల్పించిదనడానికి కూడా ఈ గాథ నిదర్శనం. ఇలాంటివే మరికొన్ని గాథలు స్త్రీలుగా తమ భౌతిక వాస్తవికతను అచ్చంగా చూపుతూనే చివరి పాదాల్లోకి వచ్చేసరికి తమ జీవితాలకు కుదుపు ఇచ్చిన యే సంఘటనకో బౌద్ధతత్వాన్ని అందుకునే ఎరుక కల్గడం, బౌద్ధులుగా మారడం వంటి విషయాలను ప్రస్తావిస్తై. ఉదాహరణకి ఒక థేరి వంట చేస్తున్నప్పుడు కూరమాడి పదార్థరూపు మారడం చూసి తాత్వకమైన 'అనిత్య' భావనను ఎరుకలోకి తెచ్చుకొని భిక్షుకగా మారడాన్ని కూడా చూడొచ్చు.

ఇక బ్రాహ్మణీయ పురుష స్వామ్యం స్థిరపరిచిన ఆచారాల్లోని డొల్లతనాన్నీ, దాన్ని నిర్ద్వంద్వంగా దిక్కరించే ధైర్యాన్నీ, స్థైర్యాన్నీ బౌద్ధతర్కం బహుజన స్త్రీలలో నింపిందనడానికి ఉదాహరణగా కన్పించే మరో గొప్పగాధ 'పున్నిక — బ్రాహ్మణుకి' గాథ. కవితా పాదాల సంఖ్యను బట్టి ఇది కొంత నిడివిగల కవిత. రోజు రోజూ గంగలో మునిగి పాపాలు కడుక్కోవాలని పోయే బ్రాహ్మణుని చూసి 'యజమానురాళ్ల దెబ్బలకు తాళలేక, దూషణలను భరించలేక మరో దారిలేక రోజూ ఏటికి వెళ్లి చలిలో వణుకుతూ కావడిమోసేదాన్ని నేను; మరి నీవెరికి భయపడి రోజు రోజూ వణుకుతూ ఏటికి వెళ్తున్నావ్ అని నిలబెట్టి మరీ ప్రశ్నిస్తుంది పున్నిక. ''పాపాలు కడుక్కోవడానికి గంగలో మునుగుతూన్నాననే'' బ్రాహ్మణుని మాటలకు ''పాపాల భయముంటే చేయకుండనే వుండాలె, తెలిసి గానీ, తెలియకగానీ'' అంటూ ''నీళ్లలో మునిగి

పాపాలు కడిగేసుకునేదుంటే నీళ్లలో ఈదే చేపా, తాబేలూ, ఎండ్రకాయ అన్నీ నేరుగా స్వర్గానికెగరవా?'' అంటూ బౌద్ధం ప్రతిపాదించే భౌతిక తార్కికతను బ్రాహ్మణునికి బోధిస్తుంది పున్నిక. అంతేకాదు, స్త్రీలందరిదీ ఒకే రకమైన దుఃఖం కాదనీ, పేదరికం – కులం ద్వారా సంక్రమించే అదనపు పీడనలో తోటి స్త్రీలు సైతం యజమానురాళ్లుగా చేసే దౌష్ట్యాలను కూడా కండ్లముందుంచుతుందీ గాథ.

ఇక వర్ణ, వర్గ నిచ్చెనమెట్ల సామాజిక వ్యవస్థలో అందరికంటె చివరిమెట్టున నిలిచే అంటరాని, బడుగు బహుజన స్త్రీలే గాకుండా సమాజవెలికి గురయ్యే వేశ్యలు, గణికలు, బిచ్చగత్తెలు, పిచ్చి తల్లులు సైతం బౌద్ధాన్ని తమ విముక్తి మార్గంగా ఎంచుకున్న వుదంతాలు కొల్లలు. ఆ మార్గాన్నెంచుకొని బోధకులుగా మారిన అంబపాలి, విమలల అద్భుతమైన గాధలు 'థేరిగాథ' లో కన్పిస్తై. అంబపాలి గాథకు సంబంధించి ప్రచారంలో వున్న కథనం ప్రకారం ఈమె ఓ రాకుమారి. దొంగతనం నేరంలో శిక్షపడిన దొంగను చెరసాలకు తీసుకెళ్తున్నప్పుడు కటకటాల వెనుక 'బందీ'గా వెళ్తున్న ఆ దొంగను చూసి ప్రేమలో పడుతుంది. తండ్రి అభీష్టానికి వ్యతిరేకంగా ఆయన్ని పెళ్లి చేసుకుంటుంది. అడవుల పాలౌతుంది. భర్తయైన దొంగ ఆగడాలను భరించలేక చివరికి ఓ రోజు చంపేస్తుంది. ఆపైన సమస్త ప్రాపంచిక దుఃఖాలను అన్వేషించే దిశలో సాగిన ఆమె జ్ఞానాన్వేషణ ఆమెను జైన గురువుగా నిలబెడుతుంది. అదే క్రమంలో పండితులతో చేసే చర్చల్లోంచి, జీవితం నిర్దేశించే అనుభవాల్లోంచీ బుద్ధుని బోధను అందుకుంటుంది. బౌద్ధ జీవితంతో థేరిగా ఎదుగుతుంది. ఈ మొత్తం గాథలో స్త్రీగా 'స్వేచ్ఛ' కోసం అంబపాలి చేసిన అన్వేషణా, దాని పరిణామాలు, గమ్యమూ కన్పిస్తుంది. ''అనిత్యతను హత్తుకున్న జీవిత సత్యాలను అన్వేషించే మార్గం బౌద్ధం' అని చెప్పే ఇలాంటి మరో గణిక గాథ – విమల గాథ.

**విమల**

వేశ్యా వాటిక వాకిట
మతిపోగొట్టే అలంకరణలో నేను
వేట కత్తెను
మూర్ఖుల కోసం
వల పన్నిన దాన్ని –
నా నగ్న సౌందర్యంతో
వారి కలల రాణినై
వాళ్లని పరిహసిస్తూ, విరగబడి
నవ్వినదాన్ని –
ఈ రోజు –
జుట్టు కత్తిరించుకొని
చేరిక చుట్టుకొని
భిక్షాపాత్రతో – నేను –
అదే నేను –
యే ఆలోచనలు లేని
శూన్యనై
చెట్టు పాదాల చెంత
కూలబడిన దాన్ని –
పురుషులనూ, దేవుళ్లనూ
జీవితం లోంచి ఒక్క వేటుతో
తెగనరికిన దాన్ని – విరక్తని
విమలని –

అంటూ యే దేవుడినో, సామాజిక అస్తిత్వాన్నో గాక స్వీయ స్పృహలోంచి చేసే చింతనతతో స్వేచ్ఛను ఆకళింపుజేసుకున్న స్త్రీగా విమల కన్పిస్తుంది. ఈ గాథ స్త్రీ శరీరాన్ని 'పురుషుని దృష్టి' (male gaze) నుంచి తప్పించి పితృస్వామ్య వ్యవస్థను నేరుగా సవాలు చేస్తుంది. ఈలాంటి 73 స్త్రీల గాథలు సంక్షిప్త, మధ్యస్థమైన పాదాల నిడివిలో '8' విభాగాలుగా థేరిగాథ లో నమోదైనై. బౌద్ధతత్వాన్నీ, స్త్రీల జీవితాలనూ నేరుగా చర్చించే చారిత్రక రికార్డులు ఈ గాథలు.

మొత్తానికి బౌద్ధిక భౌతికవాదులైన ఆనాటి స్త్రీల జీవితాలనూ, స్వీయాస్థిత్వ స్పృహలోంచి మొదలైన వారి ఆత్మిక ప్రయాణాలనూ, విముక్తి దిశగా సాగిన వారి తాత్విక అన్వేషణలనూ మన కళ్ల ముందుంచుతై ఈ గాథలు. తమ సొంత గొంతుకలతో లయాత్మకమైన వాక్యాల్లో బౌద్ధాన్ని 'మతం'గా గాక అనుభూతి వాద మనో వైజ్ఞానిక తత్వంగా నిరూపించిన స్త్రీల ఈ గాధలు బౌద్ధతత్వంలో స్త్రీల అంశానికి సంబంధించిన విషయాలను అర్థం చేసుకోవాడానికి సాయపడుతుందని చెప్పడమే ప్రస్తుత మీ వ్యాస పరిమితి. 8 విభాగాల్లో 73 గాథలుగా పరుచుకున్న ఈ సంకలనం లోని మూల గాథలను, 6వ శతాబ్దంలో దమ్మపాలుడు చేసిన వ్యాఖ్యానాన్నీ వినిర్మాణ పద్ధతుల్లో మరింత లోతుగా తరచి చూడ్డం వల్ల మరెన్నో అంశాలు దృష్టికి రావొచ్చు. ఆ దిశగా పరిశోధకుల దృష్టికి 'థేరిగాథ'ను తేవడమే బౌద్ధంలో స్త్రీల అంశం పట్ల వున్న

అపోహలు తొలగేందుకు తొలి అడుగువుతుంది. ఆ దిశగా నేను వేసిన ఈ అడుగుకు స్ఫూర్తి ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా ఈ విషయంపై అధ్యయనం చేస్తున్న స్త్రీవాదులు. బౌద్ధం తాత్వికంగా ప్రతిపాదించిన విషయాలు సత్యాలుగా సర్వామోదాన్ని పొందడమే గాక ఎందరో సంస్కర్తలకు, సామాజిక ఉద్యమాలకు దిక్సూచి అవడం మనకు తెలిసిందే.

ఈ నేపథ్యం లోంచి చూసినప్పుడు ఆదునిక కాలంలోని స్త్రీవాద సిద్ధాంతాలకూ, బౌద్ధం ప్రతిపాదించే పునాది భావనలకూ వున్న సారూప్యత అర్థమౌతుంది. ఈ అవగాహన ఈ రెంటినీ పరస్పర పూరక అన్వేషణలుగా చూపుతుంది. ఉదాహరణకి స్త్రీవాద సిద్ధాంతం సమాజంలో స్థిరపడిన 'జండర్' పాత్రల గురించి చేసే చర్చలో "పితృస్వామిక వ్యవస్థలో పురుషుడు స్వతంత్ర వ్యక్తిగా పొందే గుర్తింపు వల్ల 'తను' అనేఅహం (స్వీయాత్మ) భావనలో కూరుకుపోవడం" గురించి లోతుగా చర్చిస్తుంది. ఈ స్వయాత్మ (అహం) లో నుంచి పురుషుడు తన చుట్టున్న ప్రపంచాన్ని objectify చేసే ధోరణిలో స్థిరపడటం, స్త్రీలు ఆ ప్రపంచంలో భాగంగా 'ఇతరులు'గా ఆబ్జక్టిఫై కావడం గురించి స్త్రీవాదం చర్చిస్తుంది. తాము అణచుకున్న ego taits ని స్త్రీలపై ప్రొజెక్ట్ చేసే పితృస్వామ్య దృక్పథం పురుషులలో స్థిరపడటం గురించీ స్త్రీవాదం విశ్లేషిస్తుంది. స్త్రీలు సైతం ఈలాంటి పురుష దృక్పథాలను భిన్న స్థాయిల్లో తమలోకి ఇంకించుకోవడం మూలంగా తమని తాము బలహీనులమనీ, అబలలమనీ భావించడాన్ని కూడా విమర్శకు పెడుతుంది స్త్రీవాదం. మొత్తానికి స్త్రీపురుషులను 'జెండర్' పాత్రల్లో కుదించడమంటే అహాన్ని స్థిరీకరించడమే అనే అవగాహన స్త్రీవాద దృక్పథం కల్గిస్తుంది. సరిగ్గా ఇక్కడే బౌద్ధం స్త్రీవాద భూమికకు దగ్గరవుతుంది. బౌద్ధం తాత్వికంగా non-self ని ప్రతిపాదిస్తుంది. ఎలాంటి 'ఇగో' లు లేని 'స్వీయాత్మ' అన్వేషణను స్వేచ్ఛకు మార్గంగా చెబుతుంది. అట్లా బౌద్ధం 'జెండర్డ్' సమాజంలో 'జెండర్డ్ సెల్ఫ్' ని deconstruct చేసే దిశగా ఆచరణను ప్రతిపాదిస్తుంది. ఇదే స్త్రీవాద ఆచరణకు భూమిక. థేరిగాథ లో ఒక గాథలో "The arrow so hard to see, embedded in my heart" అన్న కవితాత్మక వాక్యం ఈ భూమికను సూచిస్తుంది.

స్త్రీవాదమూ, బౌద్ధం రెండూ సాంప్రదాయిక ఆలోచనలూ, ధోరణులూ లోపభూయిష్టమైనవనీ, ఆ ధోరణులు సామాజిక జీవితంలో దుక్కాలకు హేతువులని వాదించడం లో కూడా సారూప్యతను చూపడం కన్పిస్తుంది. మొత్తానికి రెంటి సారమూ భావజాలపరమైన మేధోకల్పనలు స్వేచ్ఛకు ఎట్లా ప్రతిబంధకాలో వాటినెలా అధిగమించాలో అనే అన్వేషణ గురించే. ఇదే విషయాన్ని థేరిగాథలో 'సుమేథ' అనే థేరి "If I consider carefully what makes a person the senses & their objects; The basic elements that make up everything, I see that all of it is constructed" అని అంటుంది. మొత్తానికి బుద్ధిజం అంటే స్త్రీవాదమే అనే అవగాహన ప్రపంచవ్యాప్తంగా స్థిరపడుతున్న సందర్భంలో ప్రస్తుతం మనం వున్నం. ఈ విషయాలను గురించి ఆలోచించిన ఆదునిక తెలుగు కవులు, రచయితలు సైతం లేకపోలేదు. దాశరథి, కాటూరి, సినారె మొదలుకొని ఈనాటి స్త్రీవాద రచయిత్రి వోల్గా, లక్ష్మీపార్వతుల వరకు ఈ విషయాలను చర్చించిండ్రు. ఐతే చరిత్ర సృష్టించిన గందరగోళంలో బుద్ధ గాథనూ, తత్వాన్నీ తమదే అయిన దృష్టితో అర్థం చేసుకొని కథనాలు సృజించిండ్రు. వారిలో తెలంగాణా ఆదునిక కవులైన దాశరథి, సినారె లది అనుభూతివాద ధోరణి. కాటూరి – లక్ష్మీపార్వతులది ప్రభందధోరణి. పితృస్వామ్య వ్యవస్థలో ఇమిడిన తాత్వికతలోంచి బుద్ధున్ని చూపే రచనలివి. అందుకు భిన్నంగా వోల్గా రాసిన 'యశోబుద్ధ' బుద్ధతత్వాన్ని స్త్రీపురుషుల సమానత్వాన్ని ప్రతిపాదించే స్త్రీవాదంగా చూపుతుంది. ఈ రచన బౌద్ధం తాత్విక భూమికయైన 'non self' లో 'జెండర్' అనేది తాత్వికంగా 'ఇమడని' అంశమని గుర్తించింది. 'యశోబుద్ధ' ప్రతిపాదించినట్లు స్త్రీపురుషుల 'చేతన' ఒకేసారి సాధ్యపడగలదనీ, అలా సాధించినప్పుడు సమస్త ప్రపంచం శాంతి అహింసల లయాత్మక జీవనం సాగించగలదనీ 'థేరిగాథ' సైతం స్పష్టం చేస్తుంది. సమిష్టితత్వం, విశ్వ ప్రేమ ప్రాతిపదికగా అంతరాలు లేని స్నేహం అనుభూతించడం, ఆచరించడం గురించి బౌద్ధం చెబుతుంది. స్త్రీవాదం అదే కోరుతుంది. ఫెమినిజం, బుద్ధిజం రెండూ అట్లా పరస్పర పూరకాలు. రెండూ సౌభ్రాతృత్వం, శాంతిమయ జీవితం, ప్రకృతితో లయాత్మక జీవనం, జనాబా లో సగభాగమైన స్త్రీల అంతరంగాలనూ జీవితాలనూ అర్థం చేసుకొని సహానుభూతి సాధించడం వంటి విషయాలను తాత్విక అవసరాలుగా గుర్తిస్తై. ప్రస్తుతమున్న కల్లోల ప్రపంచ సందర్భంలో ఈ అవగాహనలు తక్షణ అవసరం. 'థేరిగాథ' వంటి స్త్రీల గాథల / రచనల అధ్యయనం ఆ దిశగా ఒక అడుగు వేయడమే.

★ ★ ★

కవిత

# రైతో రక్షతి రక్షితః

రైతు రాజ్యం మనదంటాము
రైతు లేని రాజ్యం లేదంటాము
రైతే రాజని కూడా అంటాము
కానీ రైతుని బొక్కలిరగా తంతాము
రైతుపై జీపులెక్కించి చంపుతాము

ఎండకు ఎండి, వానకు తడిచి
చలికి వణికి,రాత్రింభవళ్ళు కష్టించి
అప్పుల పాలై తిప్పలు పడుతూ  పంటను పండించి
పది మంది ఆకలి తీర్చే చేతికొచ్చిన పంటను
అమ్ముకోవడానికి రైతుకి ఇన్ని కష్టాలా....?

ప్రజల కోసం ప్రగతి కోసం అనే  ప్రభుత్వాలకు తిండి
గింజలు సేకరించడం కంటే దండి పని ఉందా  ?

అకాల వర్షాలతో చేతికొచ్చిన
పంట వరద పాలవుతూ ఉంటే
బోరున విలపిస్తున్న ఆ రైతు గోస
ఎవరికి పట్టేది, ఎవరికి తెలిసేది?

దళారుల చేతికి చిక్కిన పంటను
అడ్డగోలు ధరలకు అమ్ముతూ ఉంటే
బతుకు జీవుడా అంటూ
ఎంతో కొంతకి మనమే కొంటాం.
కుటుంబాన్ని ఎల్లతీసుకుంటాం

రైతుకి సామాన్యుడికి నడుమ
దళారీ లేని రోజులు వస్తేనే
కష్టానికి తగ్గ  ఫలితం
కార్మిక కర్శక దోస్తాన మిళితం

రాష్ట్రం కేంద్రం , కేంద్రం రాష్ట్రం
సీఎమ్ పీఎమ్ , పీఎమ్ సీఎమ్
దళారీ బేపారి, బేపారి దళారీ
రాజ్యం పోయి ప్రజారాజ్యంలో
రైతే రాజుగా దేశం నిలబడాలి

పంటను పండించే రైతే నేను
పండించనని మానేస్తే
ఏదో ఒక పనిచేసుకొని బతుకుతా
అని అనుకుంటే
మన పరిస్థితి ఏంటి???

రైతు కోసం నిలబడలేమా ?
మనం సైతం మర్లబడలేమా  ?

రైతు క్షమాగుణం కలవాడని
అన్నం పెట్టె చెయ్యి వెనక్కి పోదని
రైతు ఎవుసం చేయక మానడని
ఇంత గోస పెట్టడం న్యాయం కాదు

రైతుల్లారా తిరగబడండి
ప్రజలారా మానవహారమవ్వండి
ప్రభుత్వాలు దిగిరాక తప్పదు
దేశం కడుపు నిండక ఎండదు

రైతో రక్షతి  రక్షితః

**సౌజన్య వేముల**
హన్మకొండ

సమీక్ష

# కళ్ళు తెరిపించే ఓల్గాగారి రాజకీయ కథలు-ఓ విశ్లేషణ



- డా॥కొండపల్లి నీహారిణి

రాజకీయాలు,రాజనీతి అంటే ఏమిటి? రాజనీతి ఒక శాస్త్రం. రాజకీయం ఒక చర్య. ఒక కార్యాచరణ చేతన.

సమాజం లోంచి సమాజ పరంగానే విశ్లేషణ వివేచనలతో సమూహాలను కదిలించేదిగా పుట్టుకొచ్చి బలపడి ప్రాబల్యంతో రాజకీయాలు జనపాలనకు తగిన విధంగా రూపుదిద్దుకున్నాయి. ఈ గమన క్రమంలోనే అవినీతికి మరోపేరుగా, ‘అంతా రాజకీయం’ అనే మారుపేరుగా మార్చేసిన రోజుల్లో ఉన్నాం. రాజకీయాలు అనే ఈ మాట గొప్పమాట.

కాని ఏనాటినుండో తమవైన రాజకీయాలు చేసి స్త్రీని తమ చేతుల్లో కీలుబొమ్మగా చేసిన రాజకీయాలు ఎన్నో ఉన్నాయి. ఓల్గా గారి “రాజకీయ కథలు” కథలుగా మనల్ని చదివించి మనకళ్ళు తెరిపించేవి.

ఈ కథా సంపుటిలో పది కథలున్నవి. దేనికది వేరుగా ఉంటూనే అంతస్సారంలో ఒక్కటే సత్యాన్ని చెప్పిన కథల్లో “లోపల కథల పేర్లు చూస్తే సీతజడ, ముక్కుపుడుక, కళ్ళు ఇలాంటి పేర్లున్న కథలతో కూడిన కథాసంకలానికి రాజకీయ కథలు అనే పేరు ఎందుకు పెట్టవలసి వచ్చిందనే ప్రశ్న వచ్చి తీరుతుంది.” అంటూ ముందుమాటలో ఓల్గా గారే రాసిన ఈ మాటలను మనమూ సమీక్షించుకుందాం.

స్త్రీ అనగానే ఎట్లా ఆలోచిస్తారో, ఎట్లా ఊహిస్తారో, ఎట్లా మాట్లాడుతారో ఓల్గాగారుచాలా నిర్మొహమాటంగా ఎట్లా రాసారు వారి ముందుమాటలో తప్పకుండా అందరూ చదవాలి. అప్పుడైనా ఆత్మవిమర్శ చేసుకునే ప్రయత్నం చేస్తారు. పురుషులు సరేసరి, స్త్రీలు కూడా స్త్రీల గురించి తక్కువభావమూ, తప్పుడు భావమూ కలిగి ఉండడాన్ని గమనిస్తుంటాం. ఇదిపోవాలి. ఈ అనవసర అభిప్రాయాలు అభ్యంతరకర అభిప్రాయాలు సమసిపోయినప్పుడే స్త్రీస్వామ్యం గురించి మాట్లాడాలి. ఆడవాళ్లను అందంతోనూ, మగవాళ్ళను పర్సనాలిటీతోనూ వర్ణించి వర్ణించి తరించిపోయే మానవులు ఒక్కసారి ఆత్మావలోకనం చేసుకోవాలి. చాలామంది గుమ్మడికాయదొంగలుంటారు. మనకు తెలియకుండానే మనలోనూ గుమ్మడికాయ దొంగ భావము ఉంటుంది. స్వీయ పరిశీలన చేసుకుంటేగాని ఇది బోధపడదు.

హింసలు పలురకాలు. ప్రత్యక్ష హింసలకంటే పరోక్షహింసలు మహా ప్రమాదకరమైనవి. అవి గుర్తించలేం. అంతాబాగానే ఉన్నది కదా అని అనుకునేలోపే లోచూపు తెలుస్తుంది. కనిపించని అవమానము తెలుస్తుంది. దీనితో స్త్రీలు ‘నేనింతేనేమో’ అని అనుకునే ఆత్మన్యూనతలో పడిపోతారు. భయం అనే గొయ్యిలోకి తొయ్యబడతారు. ముందునుయ్యి వెనుక గొయ్యి రెండూ తవ్విపెడ్తుందీ సమాజం ముందుగానే అదే.. పెళ్ళీ..పిల్లలు. మరి ఈ రెండూ జీవితానికి అక్కరలేదా? అంటే, ఉన్నది అనేదే సరైన సమాధానం. కాని ఎప్పుడు ఈ సమాధానం సరైనదవుతుంది? ఈ ప్రశ్నకి మల్టిపుల్ ఆన్సర్స్ క్రింద ఇచ్చి తికమక పెట్టే ప్రశ్న. అన్ని ఆన్సర్స్ కరెక్టే అనిపించేలానో, ‘ఆబౌఆల్’ అని ఉన్నదే కరెక్ట్ అనిపించేలానో ఉండేప్రశ్న. మరిప్రశ్న వేసుకోవడమూ, ప్రశ్న వేయడమూ సరైన తెలివికి

చిహ్నం అనికదా అంటారు. ఇప్పుడు మన తెలివికి ఒక పరీక్ష. ప్రశ్నలన్నిటికి సరైన జవాబులు రాసిన వారేకదా ప్రథమంలో ప్రథమశ్రేణి తెచ్చుకోగలిగేది. అబ్బో! ఇదంత ఏదో చిక్కుముడి లాగానే ఉన్నది. పెళ్ళి, పిల్లలూ అనే కౌటుంబిక జీవనం అంతా సమానాధికారాలతో సమదృష్టితో ప్రేమైక బాంధవ్యాలతో గౌరవాభిమానాలతో సాగితే బాగుంటుంది. మనం కన్నపిల్లలకు 'పెళ్లి' మీద ఆసక్తికలిగే కుటుంబాన్ని ఇవ్వగలిగే జీవితం కావాలి. దీంట్లో ఆడ, మగ, స్త్రీ, పురుషులిద్దరి ప్రమేయమూ ఒక్కవిధ్యంగా ఉండాలి. అదే ఆదర్శ జీవితం అవుతుంది.

ఓల్గాగారు రాసిన ఈ కథల్లో ఈ 'ఆదర్శం' అని చెప్పబడుతున్నమాట కుటుంబాలలోని స్త్రీలు, వారిపై అందరి అభిప్రాయాలూ కథలలో పాత్రలుగా, సన్నివేశాలుగా, సందర్భాలుగా, మాటలుగా, సంభాషణలుగా, చేష్టలుగా కన్పిస్తాయి. అబ్బో బోలెడన్ని ఆదర్శాలు! మనసు చీకటిలో ప్రశాంతత లేని విశ్రాంతిని తీసుకుంటుంటాయి, ఒనగూరుస్తుంటాయి.

'సీతజడ' కథలో వయసు పెరిగిన సీత జబ్బు వలన జుట్టురాలిపోవడంతో ప్రారంభించి, ఆమె యవ్వనంలో అతి జాగ్రత్తగా పెంచుకున్న అందమైన తలకట్టును వర్ణిస్తారు. అట్లాగే అన్నలు చిరాకుపడిన తనముందే తిరగడం, చింపిరిజుట్టు అని ఎవ్వరూ అనకుండా ఉండడం, ఆదివారం పేలు దువ్వించుకునే కష్టాలు అన్ని అంటూ జుట్టు తీసేస్తే ఏంటి అన్నట్టు అమ్మకు చెప్తే, ''ఇవ్వేం పిదపకాలం బుద్ధులే' ఆడపిల్లవి ముచ్చటగా జడవేసుకుని పువ్వులు పెట్టుకోక, మగరాయుడల్లే గుండు గీయించుకుంటావా'' అని చివాట్లేసింది. మగరాయుడు – అతని గుండు గొప్పదైతే, ఆ గొప్ప తనెందుకు చేయించుకోకూడదో సీతకు అర్థం కాదు. ఇక్కణ్ణుంచి మొదలైతే రెండు జడల నుండి పెళ్ళీడు వచ్చినపిల్లగా ఒక్క జడకు మారి, ఈ జుట్టు అందాల గొడవలలోపడి స్కూల్ ఫైనల్ తప్పి పెళ్ళిదాకా వస్తుంది. పెళ్ళైన కొత్తలో జుట్టును, జడను శాయశక్తులా పొగిడిన పెళ్ళికొడుకు సంపూర్ణంగా భర్త అయ్యాక ''కాస్త జుట్టూడితే ఏమవుతుంది?' సగానికి కత్తిరించమనే"వరకు ఎదిగి సీతకళ్ళకు నీళ్ళు తెప్పించాడు. నీళ్ళు బోసుకుని ఇద్దరు కొడుకుల్ని కన్నాక అతను మరణిస్తాడు. జుట్టు ఎక్కడ తీయమంటారో అని భయపడిన సీతకు ఒకే ఒక్క స్నేహితురాలు సుభద్ర "జుట్టుంటే ఏమిటి? లేకుంటే ఏమిటి? జుట్టుకింద ఉన్న మెదడు ముఖ్యం" అని ఎప్పుడో చెప్పిన ఏకైక స్నేహితురాలు వచ్చి పల్కరించి "నీకు జుట్టంటేప్రాణం తీయకు" అనిచెప్తుంది. తన అన్నలు నాయనమ్మ మాటలు సాగనివ్వక జుట్టు తీయవద్దన్నాక నెమ్మదిస్తుంది ఆమె మనసు.

తలంటుకునేముందు నూనె పెట్టుకున్నా ఓర్వలేని వదినలు "ఇక ముడేసుకోరాదూ" అని మూతితిప్పడం చూసి కుళ్ళికుళ్ళి ఏడుస్తుంది సీత. కొడుకు లిద్దరి క్రాపులు చూసినపుడల్లా ''తనకో కూతురైన పుట్టిఉండకూడదూ'' అనుకున్న సీత "సుభద్రకు జుట్టంటే కసిమాత్రం పోలేదు" . ఏం చేస్తుంది పాపం చిన్న జుట్టు" అని అనుకునేదాకా ఎదుగుతుంది సీత. జబ్బు వచ్చి రాలిపోతుంటే ఇవన్నీ గుర్తుచేసుకున్న సీత మనసులో ప్రశ్నలే ప్రశ్నలు చాలా అస్పష్టంగా మెదిలాయి.

ఇలా ముగిసిన ఈ కథ చదివితే అనేకానేక ప్రశ్నలు పాఠకుల తలలో మొలుస్తాయి.

ఆడపిల్ల నిత్యకృత్యాలూ ఎన్నో చిన్న చిన్న విషయాలకూ కథలలో కనిపిస్తూ ఆలచనలో పడవేస్తాయి. ''అలా దిక్కులు చూస్తావేం అని'', "తలొంచుకు నడువు", "నేలమీద చూడు" అంటూ మొట్టికాయలు వేసిన అమ్మ మాటలనుండి తొంగి చూసిన అమాయకత "ఎక్కడెక్కడివన్నీ నీ కళ్ళకే కనిపిస్తాయేమిటే అంటోందిఅమ్మ. అమ్మ కళ్ళకు ఏమీ కనిపించవు, కనిపించిన వాటిని గురించి అమ్మ పట్టుకోదు. ఆడవాళ్ల కళ్ళు ఇట్లా ఎందుకుంటాయో?" అని ముగించిన 'కళ్ళు' కథమొత్తం ఆడవాళ్ళు మగవాళ్ళు అని వేరేవేరే 'కళ్ళు' ఉంటాయని చెప్పేకథ.

కథలెట్లా పుడతాయి? కాకమ్మకథలో, జోలెమ్మకథలో, పిచ్చోడి కథలో ఏవో కథలు, ఎలా పుడతాయి? బ్రతుకునుండే పుడతాయి. కల్పనలోంచి కాదు. అయినా కల్పనలు ఎవరు చేస్తారు? ఎట్లా చేస్తారు? తాము చూసినవో విన్నవో తనదైన ప్రతిభతో కల్పనలూ జోడించి అల్లేవే కథలు. ఓల్గాగారి పదునైన కలం కథకు జీవం పోస్తుంది. "నీనోరు కుట్టెయ్యాలి?" అని అత్త అంటే జానకి పకపకా నవ్వి "నీకు తెలియదా?" "మాటలు పుట్టేదే ఇక్కడ. నోట్లో నుంచి వస్తున్నాయంతె" అని తలకాయమీద కట్టుకుంది. పెళ్ళికాకముందు ఇంట్లో విన్నమాటను శ్రద్ధగాపాటించి మాటలు తగ్గించుకున్న జానకికి పెళ్ళయ్యాక సమస్యగా తయారయి "ఏంటాచూపులు –

ముంగిలా, మాట్లాడవేం..?" అనే భర్తకు మౌనం చిరాకని తెలుసుకోలేకపోతుంది. రోజులు గడుస్తుంటే ఆ చికాకు కాస్త కోపంగా మారి "నోర్ముయ్ ఆడదానికి అంత నోరు పనికిరాదు" , "ఆడదానివి నోరుమూసుకుపడుండు" అనేదాకా పెరిగి విరక్తిగా, పిచ్చిగా నవ్వితే "ఏంటా విపరీతపు నవ్వు? ఆడదానివేనా?" అనేంతగా మారే జీవితం "నోర్ముయ్" కథలో జానకిలా ఎందరో జానకిల ప్రతిరూపంగా తోస్తుంది.

పెళ్ళికీ, అందానికీ ఉన్న అవినాభావ సంబంధాన్ని చెప్తూనే 'వెన్నెముక' కథలో ఆడపిల్లల్లో కలిగే భయాలూ, అనుమానాలూ ఎలా ఉంటాయో గుర్తుచేస్తారు. ఏది ఏమైనాగాని బుద్ధి, జ్ఞానం ఉన్నవాళ్లు 'వెన్నెముక' గురించి ఆలోచించాలనిపించింది' అనే ముగింపుకు కట్టుబడి ఉండాలి. మహిళలకు కావలసిన ఆత్మాభిమాన, ఆత్మబలం, ధైర్యం వంటి గుణాలు శరీరాన్ని నిలబెట్టే వెన్నెముకగా ఉంటాయని అంతర్భావ సందేశాన్నిచ్చిన కథ. 'రాతిగుండెలు' కథ గుండెలున్న వారిని పిండేస్తుంది. ఇంట్లో ఎన్ని జాగ్రత్తలు కన్నవాళ్ళు చెప్పినా, స్వంత తెలివితో ఎంత జాగ్రత్తగా అమ్మాయిలు ఉన్నా ఈ బయట కన్పించని మూర్ఖమృగాలున్నారే వాళ్ళవల్ల ఎన్ని చిక్కులో ఈ కథ లోకం అజ్ఞాన నిశీధిలో టార్చ్ లైట్ వేసి చూపుతుంది. ఇక 'అయోని' కథ స్త్రీలను ఎన్నికష్టాలకు ఎట్లా గురిచేస్తుందో చూపిస్తూ సమాజంలోని దాష్టికాన్ని పరిశీలనలోకి తెస్తుంది. విషం పూసిన కత్తిగా మగవాళ్లలో దుర్మార్గులు ఎట్లా ఉంటారో రాస్తూనే చందమామ కథలనుండి అసహ్యమైన కథ రాయాల్సివచ్చిన పరిస్థితులతో కథ చదవగానే వద్దన్నా కనుకొనుకుల్లోంచి అప్రయత్నంగా కన్నీరు జారిపోతుంది.

పెళ్ళి అనేది ఓ పవిత్రబంధం అనుకున్నప్పుడు పెళ్ళితో వచ్చే మంచి చెడులు సమానంగా భరించాలని చెప్పే కథలు 'కేసు', 'ఒక రాజకీయకథ' కథలు. కష్టమనేది భర్తకు వస్తే భార్య ఎంత ఓర్పు వహిస్తుందో, భార్యకు అనారోగ్యమో, అనుకోని కష్టమో వస్తే కూడా భర్త అట్లాగే ఓర్పు వహించాలి కదా! ఈ తేడాను సూక్ష్మ దృష్టితో పాత్రోచితంగా చెప్తూ కథలల్లారు. సంతానం కలగడం అనేది పెళ్ళికన్నా ముందు ఎవరికీ తెలియదు. అటువంటిది పెళ్ళయ్యాక రెండేళ్ళకు నెలతప్పి మూడు నెలల గర్భం విచ్ఛిత్తి అయ్యి పిల్లల్ని కనే శక్తి కోల్పోయిన భార్యను నిర్మొహమాటంగా వదిలేయడం ఎంతో అన్యాయం. ఒక రాజకీయకథ అదే చెప్తుంది. ప్రతిఒక్కరూ చదవాల్సినకథ.

సంతానాన్ని కనడం అనేది రేపటి తరాన్ని నిలబెట్టడమే అని నొక్కి వక్కాణిస్తూ ఉద్యోగినులకు ప్రపంచంలోని కొన్ని దేశాలలో కల్పిస్తున్న వసతులను మనదేశంలోనూ కల్పించాలనే ఉద్దేశ్యంతో రచించిన కథ 'కేసు' కథ. పిల్లల పెంపకం విషయంలో ఇద్దరి బాధ్యత ఎంతో ప్రభుత్వాలదీ అంతే బాధ్యత. పిల్లలు కనీసమైన తమ అవసరాలను చూసుకోగలిగే వయసు వచ్చేవరకూ పిల్లల్ని కన్న తల్లిదండ్రులకు ఉద్యోగాల్లో కొన్ని వెసులుబాట్లు కలిగించాలని చెప్పే కథ. అయితే ఈ విషయాలపై కోర్టుకు వెళ్దామనుకున్న మహిళ ఎట్లాంటి ఎదురుదెబ్బ తినాల్సి వచ్చిందో, చివరికి ఆమె తీసుకున్న ధృడనిశ్చయం ఏంటో కథ చదివితెలుసుకోవాలి. ఇక చివరిది పదవదీ 'ఆర్తి'కథ. చాలా ఆలోచింపచేసే కథ. ఎవ్వరిమీద తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దు. పూర్వాపరాలు తెలుసుకున్న తర్వాతే ఏమైనా మాట్లాడాలి అనేది తప్పక అర్థం చేయిస్తుందీ కథ. బాల్యంలోని అమాయకత,ఎదుగుతూ ఉంటే వచ్చే తెలివీ,సమాజ పరిశీలనతో బాటు ఇంట్లో వాళ్ల వైఖరులు అన్నీ అర్థమైన ఒక అమ్మాయి కథ. పెరిగి, చదువు పూర్తికాగానే పెళ్ళయ్యి, ఇద్దరుపిల్లల తల్లి అయ్యాక గాని తను ఎట్లా చూడబడ్తున్నదీ అనేది అర్థమైన అమ్మ జీవితగాథ. "పిల్లలు నీ స్వంత ఆస్తి కావటం కాదమ్మా! నువ్వే మగాడి ఆస్తివి". అంటూ హక్కుదారులెవరో చెప్పించిన ఈ మాటలు ఆర్తి కథలో కనిపించి బుద్ధికి పదునుపెడ్తాయి. చివరంటా వేలుపట్టుకు నడిపించి తీరుతుందీ ఇందులోని భావం. "కానీ ఆమె ఈ పోరాటం చెయ్యనిదే నాకున్న స్వప్న శక్తికి అర్థంలేదు. సార్థకతలేదు" అన్న ముగింపుతో ఈ కథ చైతన్య స్త్రీ శక్తి కి అద్దంపడ్తుంది.

ఒక మంచి కథలపుస్తకం చదివామన్న సంతృప్తి పాఠకులకు కలుగుతుంది. కాస్తనైనా సమాజం గురించీ, మహిళల గురించి నిలకడగా ఆలోచించాలనే స్పృహ కలుగుతుంది. ఓల్గా గారి 'రాజకీయకథలు' వివిధ సంఘటనలలో దాగిన తాత్త్విక భూమికను తెలియజేస్తాయి. స్త్రీల జీవితాలకు అద్దంపడ్తూ పురుషులకు స్త్రీలపట్ల తమకున్న అసమంజమైన అభిప్రాయాలను మార్చుకునేలా చేస్తాయి. స్త్రీ వాద రచయిత్రిగా ఓల్గాగారి లక్ష్యం కూడా ఇదే అని పాఠకులు భావిస్తారు.

స్త్రీల కథలన్నీ స్త్రీ మనోవ్యథా చిత్రణలే.

★ ★ ★

కథ

# ధర్మీబాయి దొకాన్



- ఆచార్య సూర్య ధనుంజయ

హైదరాబాద్ నగరంలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేసుకుంటూ ఉరుకులు పరుగుల జీవితాల్ని గడిపే వారిలో గోపాళా నాయక్, సరోజ బాయిల కుటుంబం ఒకటి. గోపాళా హైదరాబాదులోనే చదువుకున్నాడు. ఉద్యోగం కూడా హైదరాబాదులోనే కావడంతో సిటీతో దాదాపుగా 50 ఏండ్ల అనుబంధం ఉంది. 30 ఏండ్లుగా నైట్ డ్యూటీలు, ఎక్స్ ట్రా డ్యూటీలల్లో పడి వారి సొంత ఊరైన తార్యానాయక్ తండాకు పోవడమే మానేశారు. పెండ్లికి ముందు పెండ్లైన కొత్తలో అప్పుడప్పుడు తండాకు వెళ్ళి వస్తుండేవారు. కొన్నేళ్ళ క్రితం గోపాళా తల్లిదండ్రులు కాలం చేయడంతో తండాలో ఎవరూ లేరని అక్కడికి పోవడం పూర్తిగా బంద్ అయిపోయింది. సరోజ తల్లిదండ్రులు కూడా వైజాగ్ లో అన్న దగ్గర ఉంటున్నారు. అందుకే తండాకు వెళ్ళడం తక్కువైపోయింది.

గోపాళా సరోజాలకు 25 సంవత్సరాల కొడుకున్నాడు. పేరు భరత్. తల్లిదండ్రుల లాగానే భరత్ ఎత్తుగా అందంగా ఉంటాడు. తెలివిలోను, చదువులోను ఫస్ట్. భరత్ ఓ రోజు ఒక అమ్మాయిని ఇంటికి తీసుకొచ్చి "మమ్మీ డాడి షి ఈజ్ కావ్య వుయ్ ఆర్ ఇన్ లవ్".

"వుయ్ వాంట్ టు గెట్ మ్యారి"

అని తాను చెప్పదల్చుకొన్న విషయాన్ని దడదడ కాన్ఫిడెంట్ గా చెప్పాడు. కొడుకు మాటల్లో ధైర్యాన్ని గమనించిన గోపాళా వారిద్దరి వైపు చూసి చిన్నగా నవ్వాడు. సరోజ మాత్రం ఆ విషయాన్ని అంత ఈజీగా తీసుకోలేకపోయింది. ఒక్కగానొక్క కొడుకు ఇలా చేస్తాడని కలలో కూడా ఊహించలేదు. ఎంతో అల్లారుముద్దుగా పెంచింది. తన తమ్ముని కూతురు స్వప్నను తన కోడలుగా తెచ్చుకోవాలని ఆశపడింది. కానీ కొడుకు ఇలా సడన్ గా....

కావ్య బంజారా అమ్మాయి కూడా కాకపోవడంతో తాను చాలా కంగారుపడింది. తనకు ఇష్టం లేదన్నట్టు కోపంగా బెడ్రూమ్ లోకి వెళ్ళిపోయింది. తల్లి అలా వెళ్ళడంతో భరత్ చాలా భయపడ్డాడు. తల్లి అంగీకారం లేనిదే భరత్ ఏ పని చేయడు. కానీ తల్లిని చూశాక కావ్య, భరత్ ముఖంలో ఏదో తెలియని భయం. ఏం చేయాలో తోచక బిక్కమొహం వేసి తండ్రి వైపు చూశాడు. వారి ఆందోళన గమనించిన గోపాళా,

"సరోజా! సరోజా! ఒకసారి బయటికి రా!

ఏదైనా అభ్యంతరం ఉంటే చెప్పు.

అంతేకాని ఇలా ఏం చెప్పకుండా లోపలికి వెళ్ళిపోతే ఎలా"!

మనసులో ఉన్న బాధను బయటికి కనపడకుండా భార్యతో అన్నాడు.

"అయినా వాళ్ళిద్దరు మేజర్లు. ఆర్యసమాజ్ లోనో, ఇంకెక్కడో పెండ్లి చేసుకోకుండా మనమీద గౌరవంతో ఇంటికి వచ్చి చెప్పారు. వారి విజ్ఞతకి మనం కూడా విలువివ్వాలి కదా"! అన్నాడు గోపాళా.

"ఆంటీ మీరేది చెబితే అదే చేస్తాం. మీ నిర్ణయాన్నే మేం కట్టుబడి ఉంటాం. కాని బయటికి రండి ఆంటీ ! మిమ్ములను ఒప్పించి మాత్రమే పెళ్ళి చేసుకుంటాం ఆంటీ" వినయంగా పలికింది కావ్య.

"ఔను మమ్మీ నువ్వు ఏది చెబితే అదే చేస్తాం".అంటూ తల్లిని బ్రతిమాలాడు భరత్. సరోజ ఒక్క క్షణం ఆలోచించింది. వాళ్ళందరూ తనకు అంత ఇంపార్టెన్స్ ఇవ్వడం అంతలా

బ్రతిమిలాడడం ఎంతో మంచిగా అనిపించింది సరోజకు. బయటికి వచ్చి సరోజా సోఫాలో వాలిపోయింది. కొడుకు చేసిన పనికి తన బాధను గుండెలో దాచుకొని ఇలా అంది.

"నేను ఒప్పుకోవాలంటే రెండు కండిషన్స్. వాటిని ఒప్పుకుంటాం అంటేనే పెళ్ళి" అంటూ కన్నీళ్ళను కొంగుతో తుడుచుకుంటూ గట్టిగా అన్నది. తన తల్లి సున్నిత మనస్కురాలని మరీ కఠిన నిబంధనలు ఏమి పెట్టదని ఊహించిన భరత్ వెంటనే –

"ఓకే మమ్మీ. మేము మీరు చెప్పిన దానికి శిరసావహిస్తా"మని బదులిచ్చాడు. అంతలో పని అమ్మాయి అందరికి టీ చేసి ఇచ్చింది. అందరిలో కాసేపు మౌనం రాజ్యమేలింది. కావ్య ఏం కండిషనోనని మనసులో ఉన్న భయాన్ని బయటికి కనిపించకుండా గోళ్లు గిల్లుకుంటూ కూర్చుంది.

"నీ కండిషన్ ఏంటి సరోజా"! అడిగాడు గోపాళా నాయక్. ముగ్గురి వైపు చూస్తూ...

"ఇదిగో చూడండి నావి రెండే రెండు కండిషన్స్. ఒకటి పెండ్లి మన సంస్కృతి ప్రకారం బంజారా డ్రెస్సులు అలంకరణలతో జరగాలి.

రెండు తండాలోనే ఈ పెళ్ళి చేయాలి అనేది నా నిర్ణయం"

అని కఠినంగా సూటిగా చెప్పింది సరోజ.

అది విన్న కావ్య ఆశ్చర్య పోయింది. కావ్య సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయి. బంజారా వేషభాషలు విలక్షణంగా ఉండడమే కాకుండా ఆభరణాలు, బట్టలు చాలా బరువుగా ఉంటాయి. తన బాల్యంలో ఒకరిద్దరు ఆ డ్రస్సులో ఉన్నవాళ్ళను చూసి దడుసుకున్న విషయం, ఒకసారైతే ఒక లంబాడీ స్త్రీని చూసినాక జ్వరం పట్టుకున్న విషయం కళ్ళముందు గిర్రున తిరిగాయి.

"అమ్మో ఇది చాలా కష్టం. నేను నేను" అని మనసులోనే మెదులుతున్న భావాలను కంటితో చెప్పింది భరతకు. ఏం చేయాలో అర్థం కాలేదు భరత్ కు. అమ్మకు ఎలా సర్ది చెప్పాలో తోచడం లేదు. కాసేపు తండ్రి వైపు చూస్తూ ఉండిపోయాడు భరత్.

"అమ్మా మన వివాహ ఆచారాలను ఇప్పుడు ఎవరూ పాటించడం లేదు కదా!కావ్య సిటీలో పెరిగిన అమ్మాయి. మన కల్చర్లో పెళ్ళి అంటే నెలల తరబడి జరుగుతాయని నా చిన్నప్పుడు అమ్మమ్మ చెప్పేది. కానీ ఇప్పుడు ఎలా మమ్మీ !" అని సాగదీస్తూ కావ్యవైపు చూశాడు. కావ్య మొఖం వాడిపోయింది. భరత్ తండ్రి దగ్గరికి వెళ్ళి

"డాడీ ఇప్పుడు ఎలా! ఏం చేద్దాం" అని అన్నాడు భరత్.

"అమ్మ చెప్పింది వాస్తవమే. మనం ఏ స్థాయిలో ఉన్నా కూడా మన సంస్కృతీ సంప్రదాయాలు, కట్టు, బొట్టు, జుట్టును మరవకూడదు. నేను హైదరాబాదులో చదువుకున్నా కూడా నా పెళ్ళి సంప్రదాయ బద్ధంగా తండాలోనే జరిగింది. మా దొర ఎంత వద్దన్నా కూడా మా అమ్మా నాన్న ఒప్పుకోలేదు. అవును నేను నీకు చెప్పలేదు కదా! నా చిన్నప్పుడు రాంరెడ్డి దొర ఇంట్లో జీతం ఉన్న. అక్కడ దొరకు వాళ్ళ అన్నదమ్ములతో గొడవలు జరగడంతో బతకడానికి పట్నం వచ్చేసినరు. వాళ్ళతోపాటు నన్ను కూడా పట్నానికి తీసుకొచ్చినరు. పట్నం వచ్చినాక ఇంట్లో పనంత అయిపోయినాక రాత్రిళ్ళు మా చిన్న దొర నాకు రోజు చదివిస్తుండే. అలా పదవ తరగతి పరీక్షరాసిన. ఆ తర్వాత ఇంటర్ ఒక్కసారికే పాసయి డిగ్రీలో జాయినయిన. ఇలా నేను చాలా కష్టపడి పగలు పనిచేస్తూ, రాత్రిపూట చదువుకున్న. సరే ఇప్పుడు నా కథ ఎందుకు లే బేటా!"

"కానీ డాడీ ఇప్పుడు మన వాళ్ళందరూ ఆధునిక పద్ధతులనే అనుసరిస్తున్నారు. మన కల్చర్ ఎప్పుడో మరచిపోయాం కదా!

సిటీలో మనం ఎన్నో బంజార ఫ్యామిలీల పెళ్ళిలకు వెళ్ళినం. వారు కూడా మోడ్రన్ స్టైల్ లోనే చేసుకున్నారు. పైగా అప్పటి డ్రస్లు, ఆర్నమెంట్స్ ఇప్పుడు ఎక్కడ దొరుకుతాయి డాడీ! అని ఆందోళనగా అడిగాడు భరత్".

"అట్లా అంటావేందిరా! మీ మమ్మీ చెప్తుంది కరెక్టే. మన కల్చర్ ని మనమే బతికించుకోవాలి. వెతికితే సిటీలో ఎక్కడో ఓ చోట మన బంజారా షాపులు ఉండవచ్చు. నాకు తెలిసిన ఒక ప్రొఫెసర్ మన జాతి పై రీసర్చ్ చేశారు. ఏమైనా తెలుసేమో కనుక్కుంటా" అన్నాడు కాస్త అరచినట్టుగా.

"డాడి ! నేను కావ్యతో మాట్లాడాలి ఒకసారి. తనేమంటుందో. తన అభిప్రాయమేంటో"!

"కావ్య ఏమంటావ్ అడిగాడు భరత్'. కావ్య వెంటనే

"మా మమ్మీ డాడీలకు చెప్పాలి. నేను మన పెళ్ళి విషయం వాళ్ళకు చెప్పనే లేదు". అంది కావ్య.

కావ్య తల్లితండ్రులది హైదరాబాదే. కాని బెంగుళూరులో స్థిరపడ్డారు. పెళ్ళి ముచ్చట్లు ఫోనులో చెప్తే బాగుండదని ఆ రోజు రాత్రే రైల్వే స్టేషనుకు వెళ్ళి ట్రైన్ ఎక్కింది కావ్య. రైలు కదిలింది. కావ్య మనసు రైలు కంటే వేగంగా పరిగెడుతుంది. తల్లిదండ్రులను ఎలా ఒప్పించాలో, ఏం చెప్పాలో ఎటూ అర్థం కావటం లేదు. మనసంతా ఆలోచనలతో కమ్ముకొన్నది. భరత్, ఆంటీ, ఆంకుల్ అందరూ మంచివారే. మంచి ఫ్యామిలి. కాని ఆంటి ఇలాంటి కఠినమైన నిర్ణయం తీసుకుంటుందని అనుకోలేదు. ఇలా ఆలోచిస్తూ నిద్రలోకి ఎప్పుడు జారుకుందో...

కావ్య లేసేసరికి ట్రైను బెంగుళూరు చేరుకుంది. ఇంటికి వెళ్ళిన కావ్యకు "ఏందే చెప్పా పెట్టకుండా వచ్చావు? వస్తున్నట్టు కనీసం ఫోను కూడా చేయలేదు" అన్నది కావ్య వాళ్ళ అమ్మ.

కావ్య ఏమి మాట్లాడకుండా ముభావంగా ఉంది.

"మాట్లాడవేందే" అంటూ కాళ్ళు చేతులు కడుక్కో అన్నం పెడతానంది.

"ఏం లేదు మమ్మీ"!

"ఆ...చెప్పు ఏంటో" అని మళ్ళీ ప్రేమగా అడిగింది. తర్వాత మెల్లిగా భయపడుతూ... ఒప్పుకుంటుందో! లేదో! మనసులో అనుకుంటూ.... తన పెళ్ళి ప్రస్తావన భరత్ ఫ్యామిలితో జరిగిన ముచ్చటంతా మెల్లగా చెప్పింది. హైదరాబాదులో గోపాళా నాయక్ పక్కిల్లే కావ్య వాళ్ళది. గోపాళా ఫ్యామిలి గురించి, మంచితనం, సింప్లిసిటీ అంతా వారికి తెలుసు. అయినా కులం అడ్డువచ్చింది. "లంబాడీల ఆచారాలు, వ్యవహారాలు, కట్టు, బొట్టు పూర్తిగ మనకు విరుద్ధంగా ఉంటాయి. వద్దు బిడ్డా'! అని సర్ది చెప్పబోతుంది.

కాని కావ్య "నేను భరత్ పది సంవత్సరాలుగా ప్రేమించుకున్నాం. భరత్ లేకుండా నేనుండలేను" అని తల్లితో చెప్పింది.

"ఎలాగైనా నువ్వే డాడీని ఒప్పించు" అని తల్లిని వేడుకుంది. వాళ్ళకు కావ్య ఒక్కగా నొక్క కూతురు. అందుకే కూతురు నిర్ణయాన్ని కాదంటే పరిణామాలు ఎలా ఉంటాయోనని భయపడింది కావ్య తల్లి. మెల్లగా భర్తకు బిడ్డ మనసులోని మాట చెప్పింది. ఆలోచించి నిర్ణయం తీసుకున్నారు ఇద్దరు. కావ్య తండ్రి అభ్యుదయ భావాలు కలిగిన వారు కనుక మంచి రోజు చూసుకొని హైదరాబాదు వచ్చి మాటముచ్చట చేసుకొని పెళ్ళి తేది ఖరారు చేసుకున్నరు.

★ ★ ★

పెళ్ళి షాపింగ్ కోసమని బంజారా హిల్స్ లోని తండ్రి చెప్పిన బట్టల దుకాణానికి బయలుదేరారు భరత్ కావ్యలు. బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 10లో పెద్ద పెద్ద కాంప్లెక్స్లు, క్లాత్ షోరూంలు ఉన్నాయి. కాని వీటిల్లో ఎక్కడ 'ధర్మబాయి దొకాన్' కనిపించలేదు. చివరకు ఒక వీధి సందులో బంజారా డ్రెస్ అద్దాలు మెరుస్తూ... కారు పై ఫోకస్ పడడంతో అటువైపు వెళ్ళి చూస్తే ఆశ్చర్యం. ఆ షాపు చిన్నగా టైలరింగ్ షాపు సైజులో ఒకే ఒక్క రూంలో ఉంది.

కారు కూడా వెళ్ళలేని ఆ సందులోకి మెయిన్ రోడ్డు పక్కన కారు పార్కింగ్ చేసి షాప్ వైపు నడిచారు ఇద్దరు. పేరుకు చిన్న దుకాణమే అయినా ముస్తాబు ఎంతో ముచ్చటగ ఉంది. ప్లెక్సీలు, బ్యానర్స్, రేడియం స్టిక్కర్లు కాకుండా నల్లటి బ్యాగ్రౌండ్ పై పసుపు పచ్చరంగుతో 'ధర్మబాయి దొకాన్' అని చేతి రాతతో రాసిన అక్షరాలు వారి మనసుకి హాయి గొలిపినాయి.

సమంత, అనుష్క లాంటి సినిమా వాళ్ళ బొమ్మలు ఇతర బట్టల షాపుల్లోలాగ పెట్టిలేవు. లంబాడి యువతులు పెళ్ళిలలో, తీజ్ పండుగలలో ఆటలాడినవి పత్రికల్లో వచ్చిన పేపర్ క్లిప్పింగు అతికించి ఉన్నాయి. ఏ.సి. లేదు కాని, గాలి చల్లగా తగుల్తుంది. ఫ్రిజ్ లేదు. ఆక్వాలేదు. కాని మెట్లెక్కగానే పక్కనే ఒక మట్టికుండ అందులో చల్లటి నీళ్ళున్నాయి. ఎక్కడ చూసినా గవ్వలు, మువ్వలు, పూసలు, కుట్లు, అల్లికలతో చేసిన బట్టలు, ఆభరణాలు వేలాడుతూ కనిపిస్తున్నాయి. ఆ వాతావరణం అంతా చూడగానే పంజరంలో బంధించిన చిలక ఎగిరిపోయి చెట్టుకు వేలాడుతున్న గడ్డిపోచల గూటిలోకి చేరినట్లు అనిపించింది వారికి.

షాపులో వర్కర్లు ఎవరు కనిపించడం లేదు. కానీ ఒక 60 ఏళ్ళ బామ్మమాత్రం బండలు ఊడుస్తూ కనిపించింది. ఆమె ముగ్గు బుట్టలా ఉన్న తెల్లటి జుట్టుతో, కాస్త ముడతలు పడిన మోముతో చేతిమీద, ముఖం మీద పచ్చబొట్లతో నడుముకి ఒక అందమైన పూసల అల్లికలతో ఉన్న గుడ్డ సంచితో ఏదో

తెలియని ఆకర్షణగా కనిపించింది వీరికి.

"దాది షాపులో ఎవరూ లేరా! షాపు ఓనర్ ఎప్పుడు వస్తార"ని అడిగారు.

"ఓనరు, వర్కరు అన్నీ నేనే బెటా"నని

బోసి నవ్వుతో బదులు పలికింది. ఆ మాటలు విన్న కావ్య భరత్ లకు ఆమె పై గౌరవమే కాదు భక్తి కూడా ఏర్పడింది వెంటనే.

"మీరు గ్రేట్ దాది"

అంటూ దండం పెట్టారు. వారు అడిగిన మాటలన్నింటికి ఎంతో ప్రేమగా స్పందించింది ధర్మీయాడి. ఆమె మాటలకు మంత్రముగ్ధులైన ఆ జంట "దాది అసలు మన బంజార డ్రస్సులు, అలంకరణలు ఎందుకు ఇలా ప్రత్యేకంగా ఉన్నాయో చెప్పరా"! అంటూ చనువుగా అడిగారు.

"మనది శాన గొప్ప జాతి బేటా!. మన సంస్కృతి, ఆచారాలు వందల, వేల సంవత్సరాల సంది కొనసాగుతున్నై. కాలం మారింది అందరూ మారిపోయింద్రు. కానీ మనం మారలేదు. అంతేకాదు బేటా..." అంటూ గబగబ చెప్ప సాగింది ఆమె.

"మన తొలినాళ్ళలో పృథ్వీరాజ్ చౌహాన్ అనే రాజుని గోరి అనే తురకాయన కండ్లుపీకిస్తే చివరికి పృథ్వీరాజు ఆ గోరిని సంపిండు. అప్పుడు ఘోరి సైన్యం చంపేస్తదేమోనని అడవులకు పోయినమంట. అప్పటి సంది గీ రంగురంగుల బట్టలు కట్టడం, ఒల్లంతా నగలు తొడుక్కొంటూ అడవి జంతువుల నుంచి కాపాడుకున్నారంట" తనకు తెలిసిన విషయాన్ని వచ్చిరాని తెలుగు భాషలో ఇంకా ధారాళంగా చెప్పసాగింది.

ఆ మాటలు వింటున్న వారికి ధర్మీయాడి అక్షరాలు నేర్వని టీచరులాగ, పట్టాపొందని పరిశోధకురాలిలాగా అనిపించింది. ఆమె చెప్పడం వల్ల వారి జాతి గురించి కొత్త విషయాలెన్నో తెలిశాయి వారికి.

"ఇగో బేటా అమ్మాయి డ్రెస్"

అంటూ పాటేర్ ఫేట్యా'', టుక్రీ' లను టేబుల్ మీద పెట్టింది. అబ్బాయి డ్రెస్సు అంటూ పాంగ్జి), ఝుగ్లా, ధోతి", ఖ్యాళ్, బర్చీర్ కో , ఖల్చీర్ కో?"లను టేబుల్ మీద పరచి చూపించింది.

ఆ రంగురంగుల బట్టల్ని చూడగానే వారి కన్నులు జిగేల్ మన్నాయి. అన్నీ కుప్పపోసినట్లున్న రంగుల వస్త్రాలు, తీరొక్క పువ్వులతో పేర్చిన బతుకమ్మలాగ ఉంది ఆ దృశ్యం. ఆ బట్టల్లోంచి పట్టులంగాని, ఘుంగ్రో అనే అద్దాల ముసుగును పట్టుకొని మురిపెంగా ఒంటి మీద వేసుకొని చూసుకుంది కావ్య. ఘుంగ్రను తలమీద కప్పుకుంది. వీటిని ఇరువురు వేసుకొని సెల్ఫీ తీసుకొని మురిసిపోయారు. ఆనందాల్ని చిందిస్తున్న వారి ముఖాల్ని చూసి ధర్మీయాడి ముఖం వెలిగిపోయింది.

కాసేపు కాగానే కావ్యకి తాను ధరించిన దుస్తులు బరువుగా అనిపించి తీసివేస్తూ

"దాది ఏంటి మీ వస్త్రాలు ఇంత భారీగా ఉన్నాయి? మీరెట్ల వేసుకుంటారు రోజు. వీటిని వేటితో తయారు చేస్తారు? ఎవరు తయారు చేస్తారు" అంటూ నిట్టూర్పుగా ప్రశ్నలు గుప్పించింది కావ్య. ధర్మీయాడి సన్నగా నవ్వుతూ

"బేటా నీకు కొత్త కదా గిట్లనే ఉంటది. మాకు మాత్రం అలకగానే ఉంటాయి. కడుపులో బిడ్డ కన్నతల్లికి బరువు కానట్లే, కప్పుకునే వస్త్రం బంజారాలకు బరువుగా అనిపించదు బేటా" అని బదులిచ్చింది ధర్మీయాడి.

"దాది మీ దగ్గరికి రావడం చాలా సంతోషంగా ఉంది. అమూల్యమైన విషయాలు తెలిశాయి. ఈ జాతి గొప్పతనం నాకు ముందు తెలియదు. ఇప్పుడు మీ వల్ల తెలిసింది. దాది మా పెళ్ళి బట్టలన్నీ మీరే కుట్టి ఇవ్వాలి. అంటూ ఆమెను హత్తుకుంది కావ్య".

"సరే" అన్నట్లు సన్నగా నవ్వింది ధర్మి యాడి.

"మా బంజారా సంస్కృతి సంప్రదాయాల్ని బతికించాలన్నా ఉద్దేశంతోనే గీ షాపు నడుపుతున్న, ఎక్కువ తక్కువ లాభం కూడా చూసుకోను" అంటూ కాస్త భారంగా చెప్పింది.

"చూశావా కావ్య మా బంజారాల గొప్పతనం. జాతిని ఎంతలా ప్రేమిస్తారో! కావ్యవైపు చూస్తూ కనుబొమ్మలు ఎగరేశాడు భరత్. ఓ చిరునవ్వు నవ్వుతూ సూపర్ అన్నట్లుగా చేయి చూపించింది కావ్య.

"దాది చెప్పండి ఇవన్నీ ఎలా కుడతారు"? కావ్య ధర్మియాడిని మళ్ళీ అడిగింది.

"నువ్వు తెలుసుకొని ఏం చేస్తవు బేటా"!

"దాది నేను ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చదువుతున్న ఇందులోని టెక్నిక్స్, డిజైనింగ్ నాకు ఉపయోగపడుతది".

"సరేబేట నీకు అక్కరకు వస్తదంటే చెబుతాను" అంటూ... మొదలు పెట్టింది. "దాది మీకు అభ్యంతరం లేకుంటే మీరు చెప్పేది రికార్డ్ చేసుకుంటాను" అన్నది ఫోన్ ఓపెన్ చేస్తూ కావ్య. సరే నన్నట్లుగా తలూపింది ధర్మీయాడి.

"బేటా! మా లంబాడీలు తమ బట్టలు స్వయంగా వారే కుట్టుకుంటారు. కుట్లు, అల్లికలలో మాకు చేయిబాగా తిరిగి ఉంటుంది. ఈ పని మా పూర్వీకుల నుండి మాకు అబ్బింది. వస్త్రం కుట్టడానికి కావలసిన గుడ్డను, అద్దాలను, పూసలను, రంగుల దారాలను అంగడికి పోయి రంగ్రేజి బజార్లా తెచ్చుకుంటం. ఒక్కో వస్త్రం కుట్టడానికి శాన టైం పడ్తది. డిజైన్ ఎక్కువగా ఉంటే ఒక్కొక్కసారి రోజులు నెలలు కూడా పడ్తాయి. అందుకే మా జాతిలో పెళ్ళీలు నెలల పాటు జరిగేవి అప్పట్లో. హోళి వస్త్రాలు, తీజ్ వ్యాయా (పెళ్ళి) వస్త్రాలు, రోజు వేసుకునే వస్త్రాలు ఒక్కటేంటి బేటా ప్రతిది మా వాళ్ళే కుట్టుకుంటారు. ఇప్పుడు ఊరోళ్ళ లెక్క అందరిలాంటి బట్టలు కడుతున్నారు. కానీ అప్పుడైతే అందరూ మా వేషధారణలోనే అందంగా దుర్గమ్మలా ఉండేవారు. ఏ జాతి వాళ్ళకు లేని సొమ్ములు, ఏసం మా జాతికే ఉంది. అది వారికే సొంతం. కాని ఇప్పుడు మా వాళ్ళు కూడ మర్చిపోయినరు. అప్పుడప్పుడు అంటే పండుగలకు, పబ్బాలకు ఏస్తున్నరు బిడ్డా! "

ధర్మియాడి చెప్తుంటే నిశ్చేష్టులైపోయి కదలకుండా శ్రద్ధగా వింటున్నారు భరత్, కావ్యలు. ఇంతలో ధర్మియాడి టేబుల్ మీద ఒక వస్త్రాన్ని తీసి చూపుతూ", బేటా! దీన్ని ఫేట్యా అంటారు. దీనికి వెడల్పైన 'లేపో 287 అనే నడుము పట్టీని కుడుతాం. లంగాకు అంచుభాగాన 'లామణ్" కుడ్తాము. ఇవి ఎక్కువ ఎర్రటి రంగులోనే ఉంటా"యని చెప్పి, ఇంకొక వస్త్రం తీసుకొని "దీనిని 'కాంళి' అంటారు. దీనికి వెండి మువ్వలు, దియాని" అనే వెండి బిళ్ళలు కుడ్తాము. అద్దాలు, పూసలు జతచేసి కాంళి ధగధగ మెరిసేలా కుడతాం. ఇంకొకటి తీసి "ఇది టుక్రీ. అంటే ముసుగు. దీని మధ్యలో పువ్వులాగ కుట్టి నలువైపులా దారాల కుచ్చులను కుడుతాము" అంటూ వరుడు వస్త్రాలను కూడా తీసి ఎంతో ఆనందంగా చూపించి వివరంగా చెప్పింది. ఆమె అలా చెపుతూ ఉంటే బంజారా దేవతే ధర్మియాడి రూపంలో వారి జాతి ఔన్నత్యాన్ని చెప్తున్నట్లు అనిపించింది వారిద్దరికి.

"ఒక్క వస్త్రాలే కాదు, చెవి బుట్టలు, పాపిడ బిళ్ళలు, జడగంటలు, ముక్కుపోగు, కంఠాభరణాలు, పూసల హారాలు, దండలు అన్నీ మా బంజారాలు పెట్టుకునే నగలమ్మా" అని టేబులు మీద ఆ వస్తువులన్నిటిని పోసింది. ఆ వెండి వెలుగులకు ఆ షాపంతా తళతళ మెరుస్తుంది. ఎప్పుడూ బంగారాన్ని, డైమండ్ రింగ్స్ ని చూసి ఆభరణాలంటే అవే అనే ఊహలో ఉన్న కావ్య కండ్లు ఒక్కసారిగా తామర పువ్వుల్లా వెడల్పుగా విచ్చుకున్నాయి. జీవితంలో అంత అందం ఎప్పుడూ చూడనట్టు తనువంతా పులకించింది ఆమెకు.

వాటన్నిటిని దోసిట్లోకి తీసుకొని "వీటి పేర్లేంటి ధర్మియాడి"అని సంబరంగా అడిగింది.

ఒక్కొక్క దాన్ని పట్టుకొని చూపుతూ "ఇది ఘు?, ఇది పక్కపినోసి, గిది టీకి, గిదేమో కన్యా, మర్కి, భూర్య, హాంగ్లీ, మూంగార్ హార్లు" అని ఎంతో ఓపికతో పసుపుపచ్చగా విచ్చుకున్న మోముతో చెప్పింది ధర్మియాడి.

కావ్యకు బంజారాల మీద ముందు ఉన్న అభిప్రాయం మారిపోయింది. ఎంత అందమైన వస్త్రాలు, ఆభరణాలు అని పులకించిపోయింది కావ్య. తాను ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చదువుతుంది కానీ ఇన్ని రకాల ఆభరణాలు, అలంకరణాలు ఏ ట్రెడిషన్లోనూ, ఏ ఫ్యాషన్ షోలోను ఆమెకు ఎదురు పడలేదు. ఇన్ని వస్తువులు ఒక మనిషి ధరించగలడా! అంటూ ధర్మియాడి ముందు సంశయం వ్యక్తపరిచింది.

"హా ధరించాలి బేటా ఇంకా, ఆయుధాలు కూడా పూర్వం రోజువారి ఆహార్యంలోనే ధరించే వారంటా. కాలక్రమేణా అలవాట్లు మారినయి. గివన్నీ బట్టలు వేసుకొని, వెండి నగలు పెట్టుకుంటే సూడముచ్చటగా ఉంటారు" అని అన్నది ధర్మిబాయి.

వారికి కావలసినవన్నీ ఎంపిక చేసుకొని "మా పెండ్లికి ఇంకా నెల రోజులు ఉన్నాయి. వారం రోజుల ముందువచ్చి అన్నీ తీసుకెళ్తాం" అని ఆర్డర్ ఇచ్చి అడ్వాన్స్ పది వేలు ఇచ్చి బయటకు కదిలారు.

అనుకున్నట్లుగానే బంజారా ట్రెడిషన్లో వస్త్రాలు

దొరికినందుకు గోపాళా సరోజలు ఎంతో సంతోషపడ్డారు. పెళ్ళికి వారం ముందే తండాకి వెళ్ళాలి. అక్కడ పెళ్లి పందిరి, తండాలోని బంధువులను పిలవడం ముందే అన్ని అరేంజ్ మెంట్స్ చేసుకోవాలని అందరూ మాట్లాడుకున్నరు. ఒక్కడే కొడుకు కనుక అంగరంగ వైభవంగా పెళ్ళి జరిపించాలని అనుకున్నారు భార్యాభర్తలిద్దరు. పిల్లలిద్దరు తమ మాటలను, తమ సంప్రదాయాన్ని గౌరవించినందుకు లోలోపల సంబరపడ్డది సరోజా.

వారం ముందు వెళ్ళి పెళ్ళికార్డు ఇచ్చి ఆర్డర్ ఇచ్చిన తమ బట్టలను తెచ్చుకున్నారు కావ్య భరు. ఆ తర్వాత పెండ్లి తండాలో బంధుమిత్రుల సమక్షంలో సంప్రదాయ బద్దంగా జరిగింది. హచారాపచారా', డోరణ్ భాందేరో, వ్యాయభాందేరో ఆ తర్వాత తాంగ్డి', బారకాడేరో నొక్త నిర్వహించారు. పెళ్ళికి వచ్చిన వారంతా వరుడు వధువుల బట్టలు ఆభరణాల గురించే మాట్లాడుకుంటున్నారు. 'హైదరాబాదు హైటెక్ సిటీలో ఉంటున్నా కూడా తమ మూలాలను మరచిపోకుండా సంప్రదాయంగా వివాహం చేసినందుకు పెళ్లికి వచ్చిన వారంతా సరోజా గోపాళా నాయలను వేనోళ్ళ పొగిడారు. 'తార్యా నాయక్ తండాలో స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలిచిన బంజారా పెండ్లి' అంటూ సోషల్ మీడియాలో వైరల్ అయింది. చాలామంది నెటిజన్లు కావ్యను డ్రస్ ఎక్కడ కొన్నావని అడగగా ! షాపు ఫొటో పెట్టి దాని కింద ధర్మియాడిని ఇంటర్వ్యూ చేసిన వీడియోని పోస్ట్ చేస్తూ

"ఇగో ఈ దొకాన్లోనే నా డ్రస్ సీక్రెట్" అంటూ చెప్పింది కావ్య.

ధర్మిబాయి బంజారా డ్రెస్ అల్లికలు, కుట్ల గురించి చెప్పిన వీడియో కొన్ని రోజుల్లోనే లక్షల వ్యూస్ పొందింది. ఆ దొకాన్ ఫేమస్ అయిపోయింది. హైదరాబాదు చుట్టు పక్కలే కాక ఇతర రాష్ట్రాల నుంచి బంజారాలు ఫ్యాన్సీ డ్రస్సుల షాపువారు వచ్చి ఆ షాపులో బట్టలు కొనడం మొదలు పెట్టారు.

★ ★ ★

భరత్ పెళ్ళి అయి సంవత్సరం గడిసింది. అతడి ఎల్. ఎల్.బి. చదువు పూర్తయింది. ఇప్పుడు కోర్టులో లాయరుగా పనిచేస్తున్నాడు. రోజు లాగే ఆరోజు హైకోర్టుకి వెళ్తున్నాడు భరత్. కారు పంజాగుట్ట దగ్గరికి రాగానే రెడ్ సిగ్నల్ పడడంతో కారు ఆపాడు. పంజాగుట్ట చౌరస్తాలోని సిగ్నల్ సిటీలోని హెవీ ట్రాఫిక్ ఏరియాల్లో ఒకటి. సిగ్నల్ దాదాపు ఎనిమిది నిమిషాలుంటది. అప్పటికీ ఆరోడ్డంతా కార్లు, బైకులతో నిండిపోయింది. భరత్ కారు ముందు 20 కార్లదాకా ఉన్నాయి. ఆ కార్ల సందుల్లో ఎవరో ముసలావిడ చేతిలో పేపర్ల పొట్లాలు పట్టుకొని, నెత్తిన ఒక గంపనెత్తుకొని ఏదో అమ్ముతున్నట్లు కనిపించింది భరత్ కి.

ఇక్కడ 'కార్లు స్పీడుగా పరుగులు తీస్తాయి. ఏదయినా తగిలితే ఏమైనా ఉందా! పాపం ఈ వయసులో ఈమెకేంటో ఇంత కష్టం' అనుకున్నాడు మనసులో.

అంతలో గ్రీన్ సిగ్నల్ పడింది. కారు ముందుకు పోనిచ్చి చూడగా ఒక్క క్షణం ఆశ్చర్యచకితుడయ్యాడు. ఆ బుట్టలో పల్లీలు పెట్టుకొని అమ్మే ముసలమ్మ ఎవరో కాదు. వారి పెళ్ళికి వస్త్రాలు కుట్టిచ్చిన ధర్మియాడీనే. కారు రోడ్డు పక్కకి ఆపి షాక్ లోంచి తేరుకొని దగ్గరికి వెళ్ళి చూశాడు. అనుమానం లేదు ఆ దాదీనే. వెంటనే ఆమె నెత్తిన బుట్టను చేతిలోకి తీసుకొని రోడ్డు దాటించి తన కారులోని వాటర్ బాటిల్ ఇచ్చి తాగమన్నాడు. ఒంట్లో సత్తువ, చేతుల్లో శక్తి లేక వణుకుతున్న కూడా ఆ చేతులతోనే బాటిల్ దీసుకొని నీళ్ళు తాగింది.

"యాడి గుర్తుపట్టినవా"!

అని అడిగాడు. తీక్షణంగా చూస్తూ గుర్తుపట్ట లేదన్నట్లు తలూపింది.

"నేను భరత్ ని. నా పెళ్ళి బట్టలు నీ షాపులోనే కొన్నాం" అన్నాడు.

కాస్త గుర్తుపట్టినట్లుగా తలూపింది. "మీకు షాపు ఉంది కదా! ఇలా పల్లీలు అమ్ముతున్నవేంది" అడిగాడు భరత్.

ఒక్కసారిగా ఆమె ముఖమంతా దుఃఖ మయమైంది. "ఏం చెప్పను బేటా! ఎవరో రమణారావు అంట పెద్ద కంపెనీ యజమాని అంట! నీ బట్టల షాపులో బట్టలు చాలా ఫేమస్ అయినాయి. నేను వాటిని మోడల్ గా తీసుకొని సిటీలో పది షాపులు పెట్టి బంజారా డ్రెస్సులు అమ్ముతాను. నువ్వు గీ షాపు నడపొద్దు, వ్యాపారం చేయొద్దని నన్ను బెదిరించాడు. నా దుక్నం మొత్తం పగులగొట్టిండు. పోలీసులకు చెప్పినా పట్టించుకోలేదు. రమణారావు పెద్ద పలుకుబడి ఉన్న మనిషంట బేటా"! విషన్న వదనంతో అన్నది.

"సరే అయిందేదో అయింది. కాని నీవు కృష్ణా! రామా! అని కూర్చోక ఎందుకు ఈ తిప్పలు పల్లీలు అమ్ముడు. నీకు కొడుకులు, బిడ్డలు లేరా"! అన్న అతని ప్రశ్న పూర్తి కాకముందే ఆమె కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి.

"ఆ మాయదారి దేవుడు యాక్సిడెంట్ లో నా కొడుకు, కోడలిని తీసుకెళ్ళిండు బేటా. నా మనమరాలు మనవడు ఎనిమిది, పదేండ్ల సిన్న పిల్లలు. నా దగ్గర ఉన్నారు. ఆళ్ళని సాకదానికే గీ తిప్పలు" అంటూ బోరున యేడ్చింది ధర్మిబాయి.

ఆ మాటలకు భరత్ గుండె బరువెక్కింది. "నీకు నేనున్నాను. న్యాయం చేస్తా యాడి" అంటూ ఆమెని కారు ఎక్కించుకొని ఆమె కిరాయికి ఉంటున్న ఇంట్లో దించి రేపొచ్చి కలుస్తానంటు వెళ్ళిపోయాడు.

జరిగిన విషయం తల్లిదండ్రులు, భార్యతో చర్చిస్తూ తాను ధర్మియాడి తరపున కొట్లాడుతానని, రమణారావు మీద కేసు వేస్తానని చెప్పగా వారు అందుకు అంగీకరిస్తూ మా సపోర్ట్ కూడా నీకుంటదని అంటూ నైతిక బలాన్ని, మద్ధతుని ప్రకటించారు.

మరుసటి రోజు అన్నట్టుగానే రమణారావు పై కేసు వేశాడు భరత్. మూడు నెలల విచారణ తర్వాత తీర్పు ధర్మియాడికి అనుకూలంగా వచ్చింది. రమణారావు ముసలావిడ పై దౌర్జన్యం చేసినందుకు 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు 20 లక్షల జరిమానా విధించడమే కాక ఆమెకు షాపుని తిరిగి అప్పజెప్పాలని తీర్పునిచ్చింది ధర్మాసనం.

మూడు రోజుల్లో షాపుని ధర్మియాడికి అప్పగించి 20 లక్షల జరిమాన కట్టిండు రమణారావు. ధర్మియాడి కళ్ళలో ఆనందం వెల్లివిరిసింది. ఆ డబ్బులు ఆమెకి ఇస్తూ "దాది మీ షాపు మీకొచ్చింది. ఈ డబ్బులతో ఇంకా నాలుగు బ్రాంచిలు పెట్టండి ఆదాయం బాగుంటది. నీ మనవళ్ళను మంచిగ చదివించు".అని భరత్ అనగానే...

"వద్దు బేటా! ఈ డబ్బులు! రేపు మళ్ళీ ఎవడో రౌడీ వస్తాడు నన్ను బెదిరిస్తాడు. ఆ షాపుకు పోను" అంటూ భయంగా పలికింది.

సరే అదే నీ భయం అయితే నా భార్య కావ్య నీకు తోడుగా ఉంటది. ఆమె ఫ్యాషన్ డిజైనింగ్ చేసింది. ఆమెతో పాటు ఇంకో అయిదుగురు వర్కర్లను పెడదాం. మన బంజారా సంస్కృతి, వస్త్రాలు, సంప్రదాయ వస్తువులను కాపాడుకోవాలంటే మనం ఈ షాపు నడపాలి!

అంటూ ధర్మియాడిని ఒప్పించాడు. షాపుని రెనోవేషన్ చేయించి పెద్దగా రెండంతస్థుల్లో ఏర్పాటు చేయించాడు భరత్. ఇప్పుడు ధర్మియాడి దొకాన్ 13 పదింతలు పెద్దగా అయింది. ఆ యాడి నిజాయితికి, శ్రమకి తగిన ఫలితం దక్కిందని ఆ బజార్ వాళ్ళందరూ సంతోషించారు. తాను సిగ్నల్ దగ్గర పల్లీలు అమ్ముకుంటున్నప్పుడు పరిచయమైన నలుగురు అనాధ పిల్లలని ఆ షాపులో వర్కర్లుగా పెట్టుకుంది ఆమె.

ఆ రోజు షాప్ ప్రారంభం కావడంతో జనాలు షాపుముందు కిక్కిరిసి పోయారు. ఆ దుకాణంలో బట్టలు కొన్నవాళ్ళు, యూట్యూబ్ లో ఆమె ఇంటర్వ్యూ చూసినవాళ్ళు, కావ్య స్నేహితులు, భరత్ తల్లిదండ్రులు అక్కడికి చేరుకున్నారు. రిబ్బన్ కట్ చేయవలసిందిగా అందరూ ధర్మిబాయిని కోరారు.

ఆమె మాత్రం ఆ బాధ్యత భరత్ తల్లి సరోజకి ఇచ్చింది.

"అయ్యో యాడి, ఇది మీ షాపు. మీరే కట్ చేయండి..." అన్నది సరోజ.

"లేదు బిడ్డా! నువ్వే చెయ్యి. నీ కొడుకు భరత్ లేకుంటే ఇదంతా జరిగేదా! ఎయ్యి బావులు, వంద సెరువులు, దీపించిన దానికంటే ఒక్క మంచి కొడుకుని కన్నవారి జన్మధన్యమంటరు బిడ్డా. అట్లాంటి వాడే నీ కొడుకు. తనని కన్న గొప్ప తల్లివి నువ్వు. మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలనే సోయి ఉన్న గొప్ప బిడ్డవి నీవు. కాబట్టి నీ సేయిగుణం మంచిగుంటది". అంటూ కత్తెరను చేతిలో పెట్టింది ధర్మిబాయి. సరోజా రిబ్బన్ కట్ చేసి పరవశించి పోయింది. కుడికాలు పెట్టి అందరూ లోనికి వెళ్ళారు. స్వీట్లు తింటూ ముచ్చట్లు చెప్పుకుంటున్నారు.

కానీ సరోజ మాత్రం ధర్మియాడీనే తీక్షణంగా చూస్తూ ఉండడం గమనించిన భరత్ ఏంటి మమ్మీ అలా చూస్తున్నవ్ అని అడిగాడు.

"ఏం లేదురా... ధర్మియాడి అచ్చం చనిపోయిన మా అమ్మలాగే ఉంది అన్నది".

(2021'మల్లెశాల'వృత్తి కథలు–సంపాదకులు–జ్వలిత)

వ్యాసం

# ప్రశ్నించే గొంతుకలపై కుట్ర



- నస్రీన్ ఖాన్

**ముస్లిం మహిళలే లక్ష్యం**

**అశ్లీల చిత్రాల మార్ఫింగ్ - వేలం**

నూతన సంవత్సరం ప్రారంభం. దేశమంతటా పండుగ వాతావరణం. అందరూ ఆనందోత్సాహాలలో తేలియాడుతున్నవేళ ముస్లిం మహిళలను కించపరుస్తూ అంతర్జాల వేదికపై అవాంఛిత అంశం ఒకటి బయటపడింది. ప్రముఖ ముస్లిం మహిళల చిత్రాలను అసభ్యంగా మార్ఫింగ్ చేసి వేలానికి పెట్టారన్న సమాచారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రస్తుతం నిందితులుగా భావిస్తున్న నలుగురిని అరెస్టు చేసి విచారిస్తున్నారు. వీరిలో పద్దెనిమిదేళ్ళ అమ్మాయితో పాటు మిగతా ముగ్గురి వయసు నిండా పాతికేళ్ళు లేదు. ప్రపంచంపై సరైన అవగాహన అయినా లేని ఈ యువత 'ఒక వర్గాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకుని అసభ్య చిత్రాలను రూపొందించడం. అవి ముస్లిం మహిళల్లో ఎంపిక చేసిన వారివే కావడం, అలా మార్ఫింగ్ చేసి వేలానికి పెట్టడం ద్వారా వారిని అవమానించడం... అనే ఆలోచనలు ఎలా వచ్చి ఉంటా'యన్నదే ఇప్పుడు అందరి మదిని తొలిచే ప్రశ్న. 'వారిని అరెస్టు చేసినంత మాత్రాన మూలంలో దాగిన సమస్య ఏదో ఆ సమస్య సమసిపోతుందా?' అన్నది మరో ప్రశ్న. ఈ సంఘటన ద్వారా ఏం అర్థమవుతోంది అసలు..!?

**బయటపడింది ఇలా**

మహారాష్ట్రకు చెందిన శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది ఈ విషయాన్ని కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఇది చర్చనీయాంశంగా మారింది. 'బుల్లీ బాయ్ యాప్' పేరిట రూపొందిన యాప్ లో బాధితులు ముస్లిం మతానికి చెందిన వారేనని తేలడంతో ఆ వర్గానికి చెందిన ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వందలాది మంది మహిళలు, విద్యార్థినులు, ప్రముఖులు, జర్నలిస్టులు బాధితులు కావడం గమనార్హం. ఇస్మత్ ఆరా అనే జర్నలిస్టు, ప్రియాంక చతుర్వేది వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఢిల్లీ, ముంబై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ యాప్‌లను దిగ్గజ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్‌కు చెందిన 'గిట్‌హబ్' ప్లాట్‌ఫాం ఆధారంగా చేసుకొని రూపొందించారు. బుల్లీ బాయ్‌ను గిట్‌హబ్ బ్లాక్ చేసిందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. పోలీసులు, కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ తదుపరి చర్యలను సమన్వయం చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

**బుల్లీ బాయ్ ఏమిటి?**

గతేడాది జూలై 4న 'బుల్లీ బాయ్'యాప్‌ను పోలిన వ్యవహారం ఒకటి బయటకు వచ్చింది. ముస్లిం మహిళలను ట్రోల్ చేసేందుకు వినియోగించే అసభ్యకరమైన పదంతో కూడిన ఓ యాప్‌ను దుండగులు సృష్టించారు. 'సుల్లీ డీల్స్' పేరిట ఫొటోలు అప్‌లోడ్ చేసి 'డీల్ ఆఫ్ ది డే' అని ప్రకటన ఇచ్చేవారు. ఈ యాప్ తరహాలోనే 'బుల్లీ బాయ్' యాప్ కార్యకలాపాలు ఉండడంతో అనుమానాలు ,ఏకెత్తాయి. ట్విట్టర్, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో యాక్టివ్‌గా ఉండే ముస్లిం మహిళలను ఎంచుకొని, వారి ఫొటోలను సేకరిస్తారు.

యాప్ ఓపెన్ చేయగానే మహిళల ఫొటోలు కనిపించేలా సెట్ చేసి పెడతారు. వీరు అమ్మకపు ధర ఇంత అంటూ వారి ఫొటోపై ధరను ప్రకటన చేస్తారు.

**వేధింపుల అడ్డా**

ఈ అంశం బయటపడటానికి ముందే ఎందరో మహిళలు ఈ వేధింపులను ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు.

గడిచిన డిసెంబర్ మాసంలోనూ సోఫియా (పేరు మార్చబడింది) సోషల్ మీడియాలో వేధింపులు ఎదుర్కొన్నారు. గత ఏడాది నుంచి ఆమె ఇలాంటివి ఎదుర్కొంటున్నట్లు వివరించారు. తాను రెండేళ్ళుగా ఇటువంటి ట్రోల్ కు గురవుతున్నట్లు సోషల్ మీడియాలో ఏక్టివ్ గా ఉండే సమీనా(పేరు మార్చాం) ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు వ్యక్తులు తన ఫొటోలను నగ్న చిత్రాలతో మార్ఫింగ్ చేసి ట్విటర్‌లో పెట్టారని ఆమె తెలిపారు.

ఇది బుల్లీ బాయ్ యాప్ లో ఈమధ్య కాలంలోని సంఘటనలు అయితే, 2020 జులైలో 'సుల్లీ డీల్స్' పేరిట ఇంకో యాప్ ప్రత్యక్షమైంది. ఆ యాప్ లో పైన ప్రస్తావించిన సమీనాతో సహా పదుల సంఖ్యలో ముస్లిం మహిళల ఫొటోలను అందులో పెట్టి వేలం వేశారు. భిన్న నేపథ్యాలున్న ఈ బాధితురాళ్ళలో ఒక్క పోస్ట్ అయినా పెట్టని వారు, కేవలం ముస్లిం పేరు ఉండడంతోనే ఈ వేధింపులు ఎదుర్కొన్నారు. అయితే, లేటెస్ట్‌గా వచ్చిన బుల్లీబాయి యాప్‌లో అనేకమంది కొత్త మహిళలు ఉన్నారు. సుప్రసిద్ధ రేడియో జాకీ శ్యామా, జర్నలిస్ట్ రాణా అయూబ్, సామాజిక కార్యకర్త ఖలీదా పర్వీన్‌లాంటి వీరిలో కొందరు. వీరిలో చాలామంది 60ఏళ్లు దాటిన వారే. వంద మందికి పైగా బాధితులు ఉన్నారు. సామాన్య మహిళలు తప్ప తమ పేర్లు ఉన్న ప్రముఖులు అందరూ ఇటువంటి యాప్ లకు భయపడేదే లేదంటూ స్పష్టం చేశారు.

**హైదరాబాద్ లోనూ...**

హైదరాబాద్లోనూ బుల్లీ బాయ్ బాధితులు ఉన్నారు. ప్రముఖ సామాజిక కార్యకర్త ఖలీదా పర్వీన్ తోపాటు మరో ఇద్దరు జర్నలిస్టులు ఉన్నారు. ఖలీదా పర్వీన్ వయసు 67సంవత్సరాలు. ఆమె బుల్లీ బాయ్ బాధ్యులపై కేసు నమోదు చేశారు. ఉమూమత్ సొసైటీ ద్వారా మహిళలు, బాలికల సంక్షేమం కోసం ఆమె అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. లాక్డౌన్ సమయంలోనూ, హైదరాబాద్ కు వరదలు వచ్చినప్పుడు వేలాది మందిని ఆదుకున్నారు. సాగు చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేపట్టిన ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. అలాగే తన ప్రసంగాలతో రెచ్చగొడుతున్న యూపీలోని ఘజియాబాద్ దస్నా దేవి ఆలయ ప్రధాన పూజారి యతి నరసింఘానంద సరస్వతిని అరెస్టు చేయాలని ట్విట్టర్



వేదికగా ఉద్యమించినందుకు తన ఫొటోను బుల్లీ బాయ్ యాప్ లో పెట్టారని ఆమె చెబుతున్నారు.

**అరెస్టుల వల్ల మార్పు వస్తుందా?**

నీరజ్ బిష్ణోయ్.. బుల్లి బాయ్ అనే యాప్ క్రియేట్ చేసి ముస్లిం మహిళల ఫోటోలను ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టిన వారిలో ప్రధాన సూత్రధారి. ఇతడే ఆ యాప్‌కు కర్త కర్మ క్రియ. దాన్ని క్రియేట్ చేసి.. మహిళల హక్కులకు భంగం కలిగించినా.. ఇంత తప్పు చేసినా.. అతడిలో కొంచెం కూడా పశ్చాత్తాపం లేదని.. పోలీసులు చెప్పినట్టు తెలుస్తోంది. అరెస్ట్ చేసినా.. కోర్టులో హాజరుపరిచినా.. తన ప్రవర్తనలో ఎటువంటి మార్పు లేకపోవడం గమనించవలసిన విషయం. తానేమీ తప్పు చేయలేదు.. అనే విధంగా నీరజ్ ప్రవర్తన ఉన్నట్టు తెలుస్తోంది. తనలో కొంచెం కూడా పశ్చాత్తాపం కనిపించలేదని పోలీసులు ప్రకటించారు.

"నేను ఏ తప్పు చేయలేదు. నేను ఆ యాప్ క్రియేట్ చేయడం తప్పు కాదు.. అంటూ నీరజ్ పోలీసుల ఇన్వెస్టిగేషన్‌లో చెప్పినట్టు తెలుస్తోంది. భోపాల్‌లోని ఓ కాలేజీలో బీటెక్ సెకండియర్ చదువుతున్న బిష్ణోయ్.. బుల్లి బాయ్ యాప్ క్రియేట్ చేసి కొత్త సంవత్సరం రోజునే ముస్లిం మహిళల ఫోటోలను ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టాడు. అసలు సూత్రధారి నీరజ్ అని తెలియక.. పోలీసులు ముందు వేరే వాళ్లను అరెస్ట్ చేశారు. చివరకు ట్విట్టర్ అకౌంట్ ద్వారా నీరజ్‌ను కనిపెట్టి.. అస్సాంలోని జోర్హాట్ జిల్లాలో ఉంటున్న నీరజ్‌ను అరెస్ట్ చేశారు. అస్సాం పోలీసుల సాయంతో ఢిల్లీ పోలీసులు అతడిని అరెస్ట్ చేసి.. వెంటనే కోర్టులో హాజరుపరిచారు. దీంతో కోర్టు 7 రోజుల పాటు అతడిని విచారించేందుకు పోలీసుల కస్టడీకి అనుమతిచ్చింది.

**ప్రముఖుల స్పందన**

యాప్‌ల ద్వారా వికృత చర్యలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విపక్ష పార్టీలకు చెందిన పలువురు నేతలు డిమాండ్ చేశారు.

**రాహుల్ గాంధీ**

మహిళలను అవమానించడంతో పాటు మత విద్వేషాలకు పాల్పడుతున్న ఇటువంటి చర్యలను వ్యతిరేకించాలని, అప్పుడే వాటికి అడ్డుకట్ట పడుతుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు.

**మెహబూబా ముఫ్తీ**

పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ స్పందిస్తూ.. ముస్లింలను ఊచకోత కోయాలంటూ బహిరంగంగా పిలుపునిచ్చినా లేదా ఆన్‌లైన్‌లో ముస్లిం మహిళలను టార్గెట్‌గా చేసుకున్నా కూడా నిందితులపై ఎటువంటి చర్యలు ఉండట్లేదన్నారు. అధికారంలో ఉన్న వారి అండతోనే క్రిమినల్స్ స్వేచ్ఛగా బయటతిరుగుతున్నారని ఆరోపించారు.

**గుర్జీత్ సింగ్ లేఖ**

బుల్లీ యాప్ వెనుక ఉన్న నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు పంజాబ్‌కు చెందిన ఎంపీ గుర్జీత్ సింగ్ లేఖ రాశారు.



సమీక్ష

# ఆమె తెరవని పుస్తకం.!



ఆశావాదం ఆశగా ఆమెను
చూస్తూందెప్పుడూ..!
ఉషోదయ చంద్రోదయాల మధ్య
చైతన్యోద్యమం ఆమె..!
బ్రతుకు రణంలో ఘోరపరాభవాలెన్ని
ఎదురైనా కన్నెత్తి చూడకనే
కడ తేర్చే ధీశక్తి ఆమె సొంతం.!
మగువల మారణహోమాల్లో సమిధలైన
వారికి నిలువెత్తు నిదర్శనం ఆమె..!
కుటుంబ కుహనా రాజకీయాల్లో
రాజీలున్న నేత పాత్రధారి ఆమె.!
ఛీత్కారాల్నే సత్కారాలుగా మలచుకునే
నవ శిల్పకళా చాతురి ఆమె..!
కనుసైగల్లో తన సెగల్ని చల్లార్చుకునే నియంత్రణాధికారి
ఆమె..!
మానవతా నైతిక విలువలకు
వలువలు కప్పే బడి ఆమె..!
సమతా మమతలకు
ఎదురులేని చల్లని ఒడి ఆమె.!
ఆమె ప్రేమ అందిపుచ్చుకునే అమృతం.!
ఆమె కోపం త్రోసిపుచ్చే  హాలాహలం.!
ఆమె జీవితం తెరవని పుస్తకం.!
తెరిచి చదివితే..!
తెరువును మన కళ్ళు..!
కరుగును మన కుళ్ళు..!
అందుకేనేమో.! ఆశావాదం ఆశగా
చూస్తూనే ఉంటుందెప్పుడు ఆమెను.!
తనలోని నిరాశా శ్వాసను వదులుతూ..!
కవితా రచన

**డాక్టర్ పసుపులేటి నాగమల్లిక**
తెలుగు శాఖాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
రామచంద్రపురం, ఆంధ్ర ప్రదేశ్.
7981364632

కవిత

# వీడ్కోలు గజల్



చెలిమి విలువ కట్టలేక మనసునిలా పరుస్తున్న
కంటితడిని దాచలేక మాటలిలా పంచుతున్నా

మోయలేని దిగులంతా కన్నీటిగ మారుతోంది
వీడ్కోలని నాహృదయపు ఘోషనిలా పాడుతున్నా

చదువుల ఒడి పూదోటన బోధనయే ప్రాణమైంది
వీడిపోయే రోజొక్కొటి వచ్చెనిలా ఆపకున్నా

మాటలతో పాటలతో సందడిగా ఏళ్ళు గడిచె
చివరిరోజు శోకవీణ గాయనిలా మీటుతున్నా

తోబుట్టులె తోటివారు మాపిల్లలె విద్యార్థులు
మమతలగుడి మీకు వొదిలి నేనుయిలా వెడుతున్నా


మనసంతా ఆపలేని కల్లోలపు సాగరమే
బదిలీలల ఆటనేడు తప్పదిలా ఒప్పుకున్నా

బోధనలో బ్రతుకంతా గడిచిపోతె మృదువిరీ!
సరికొత్తగ నాగమనపు దారినిలా మార్చుకున్నా

**రమాదేవి బాలబోయిన**
వరంగల్
6281216735

కథ

# కంచికి చేరిన కథ



- వేలూరి ప్రమీల శర్మ

"అమ్మా! లే అమ్మా! ఆకలేస్తోంది... అన్నం పెట్టు" అంటూ తల్లిని పట్టి కుదుపుతోంది ఆరేళ్ళ జాబిల్లి.

"ఒళ్ళంతా నొప్పులుగా ఉంది తల్లీ, లేవలేను... కుండలో గంజన్నం ఉంది పోయి తిను" అంటూ అటువైపు తిరిగి పడుకుంది హారతి.

"ఎప్పుడూ గంజన్నమేనా? నేను తినను" అని గదిలో మూలకు పోయి అలిగి కూర్చుంది జాబిల్లి.

"నా తల్లి కదూ ఈ ఒక్కసారికే తిను. రేపట్నుంచి అన్నీ వండి పెడతాను" అంటూ కూతుర్ని బ్రతిమాలుతోంది హారతి.

తలుపు తోసుకుంటూ లోనికి వచ్చిన వీరభద్రయ్య వైపు భయం, భయం గా చూస్తూ బిక్కు బిక్కుమని మూలకి ఒదిగి కూచుంది జాబిల్లి.

నులక మంచం మీద తన తల్లి పక్కన కూచుని చుట్ట తీసి వెలిగిస్తున్న వీరభద్రయ్యని చూస్తే చంపేయాలన్నంత కోపం గా ఉంది ఆ చిట్టి తల్లికి.

"ఓపిక లేదయ్యా! జరంగా వున్నాది. ఈరోజుకి వొదిలెయ్యి" అంటూ ప్రాధేయపడుతున్న తల్లి వంక దీనంగా చూడడం తప్ప ఏమీ చెయ్యలేని నిస్సహాయత ఆ చిన్నారిది.

"ముందీ ముండని బయటకి పంపు" అంటూ జాబిల్లి వంక చూస్తూ గద్దించాడు వీరభద్రయ్య.

"రాత్రి ప్రెసిడెంటు గారు వచ్చేళ్లారు. తెల్లార్లూ నిద్దర లేదు. ఓపిక లేదు, వొదిలెయ్యయ్యా!" అంటూ బ్రతిమాలుతోంది హారతి.

"సీ...నీ...అయ్యా! ఈ బుద్ధి దేవదాసీ పనికి ఒప్పుకోక ముందుండాల" అంటూ హుంకరించాడు.

"మా అమ్మకి బాగాలేదు, బువ్వ కూడా వొండలేదు" అని ఎక్కిళ్ళ మధ్యన దుఃఖాన్ని దిగమ్రింగుతూ, తల్లి ఆవస్థని కనికరం లేని ఆ మానవ మృగానికి తెలియ చెప్పాలని తాపత్రయ పడుతోంది చిట్టి తల్లి.

"రేపు నీ గతీ ఇంతేనే!" అంటూ గుప్పున పొగ ఊదిన చుట్ట తీసి జాబిల్లి లేత చేతి మీద ముట్టించాడు.

"అమ్మా!!!" అంటూ బాధగా అరిచి కిందపడి ఏడుస్తున్న కూతుర్ని, ఒక్క ఉదుటున లేచి గుండెలకి హత్తుకుంది హారతి.

ఇక లాభం లేదనుకుందో ఏమో తన బిడ్డ చేతిలో పప్పుండనుంచి ఆమెను బయట కూచోబెట్టి తలుపులు మూసింది.

ఇలా పదేళ్లుగా ఆమె నలిగిపోతూనే ఉంది. కోపం కట్టలు తెంచుకున్న ప్రతిసారీ తనను మోసం చేసి దేవాదాసీని చేసిన తల్లిని తిట్టుకుంటూనే ఉంది. ఏడ్చిన ప్రతిసారీ తన బిడ్డ కూడా తనలా కాకూడదని గట్టిగా అనుకునేది. కానీ ఏం లాభం. ఊరి జనానికి ఆమె బాధ పట్టదు. ఇది భగవంతుడి నిర్ణయం అంటూ ఆమె ఆవస్థని గుర్తించినా చూసీ చూడనట్టు వ్యవహరించేవారు. ప్రాణం తీసుకోవాలని, ప్రయత్నించిన ప్రతిసారీ తన బిడ్డ కళ్ల ముందు కదలాడుతుంటే నిస్సహాయంగా రోదిస్తూ ఉండిపోయేది.

★ ★ ★

అప్పుడు ఆమె వయసు తొమ్మిది సంవత్సరాలు. ఊరికి ఏదో అరిష్టం పట్టిందంట... కన్నెపిల్లని బలి ఇవ్వాలన్నారు. మామూలు బలి కాదది. గుండెను కోసే చిత్రవధ. దేవుడికిచ్చి పెళ్లి చేస్తారు. 'మాతంగి'గా పిలవబడే ఆమె ఆ రోజునుంచి ఊరిలో విడిగా ఉండాలి. పూజారి తర్వాత దేవుడి ప్రతినిధిగా ఆమెను కొలిచేవారు, చీకటిపడిన తర్వాత మాత్రం ఆమె ఇష్టాలను ఛిద్రం చేస్తారు. ఇవేమీ తెలీని హారతి... తల్లి తనను దేవుడికిచ్చి పెళ్లి చేస్తోందని తెగ మురిసిపోయింది. ఆరోజుతో ఆమె సంతోషం ఆవిరైపోతోందన్న సంగతి ఆ పిచ్చి తల్లికి తెలీదు.

"ఏ తప్పూ చేయని తనకెందుకింత శిక్ష?" మౌనంగా ఎన్నోసార్లు ఆమె మనసు రోదించింది.

"తన తోటి పిల్లల్లా తానూ ఎందుకు చదువుకోకూడదు?" సమాధానం దొరకని ఎన్నో ప్రశ్నలు ఆమెను వేధించేవి.

తనువు మీద అవగాహన లేని వయసులోనే తల్లయ్యింది. ఒంటరిగానే బిడ్డను సాకింది.

తండ్రెవరో తెలీని బిడ్డను పొత్తిళ్లలో పెట్టుకుని కడుపు నింపుకోడానికి యాచించేది.

ఇనుప సంకెళ్ళ నుండి బయటపడాలని ప్రయత్నించిన ప్రతిసారీ కాలనాగుల్లాంటి ఊరి పెద్దల విషపు బంధనాలను తప్పించుకోలేక ఓడిపోతూనే వచ్చింది. తనకు సాయం చెయ్యాలని ప్రయత్నించిన ఆ ఊరి సోషల్ మాస్టారు గోవిందను ఊరి మధ్యలో స్థంబానికి కట్టి చితకబాదడం ఆమె మర్చిపోలేదు. బరువెక్కిన మనసుని ఓదార్చే మగ దిక్కు లేక అల్లాడిపోయింది. అలా ఆరు సంవత్సరాలు పోరాడి, పోరాడి అలసిపోయింది.

★ ★ ★

తనను మోసం చేసిన భగవంతుడినీ, తన తల్లినీ ఎన్నటికీ క్షమించలేని హారతి... ఆరోజు మొదటిసారిగా దేవుడి ముందు చేతులు జోడించి నుంచుంది.

నువ్వున్నావంటూ ఆనందంతో చెంపలపై కారుతున్న కన్నీటితో అభిషేకం చేసింది.

అందుక్కారణం లేకపోలేదు.

ఇప్పుడు జాబిల్లి ఊరి వారిచే వెలివేయబడి, బలివ్వబడిన తన కూతురు కాదు.

అందరు పిల్లల్లాగానే జాబిల్లి కూడా రోజూ సంతోషంగా స్కూలుకెళుతోంది.

నాకంటూ ఒక కుటుంబం ఉంది అని గర్వంగా చెప్పుకోగలుగుతోంది.

బయట ఊరికి ట్రాన్స్‌ఫర్ మీద వెళ్లిన సోషల్ మాస్టారు గోవింద, అక్కడి స్వచ్ఛంద సంస్థల వారికి హారతి పరిస్థితిని వివరించాడు.

మీడియా వారి సహాయంతో ఊర్లోకి అడుగుపెట్టిన గోవింద, ఈసారి అక్కడి పెద్దలకు నయానా, భయానా నచ్చచెప్పి హారతి చేయి అందుకుని, ఆమెకు ఆసరాగా తానుంటానని చెప్పి, ఆ ఊరి బాగు కోసం రెండు లక్షలు ముట్టచెప్పి... బిడ్డతో సహా, హారతిని బంధ విముక్తురాలిని చేసాడు.

ఆరోజు ఆమెకింకా గుర్తుంది. ఎప్పటిలాగే వడలిన దేహంతో, కడుపు నింపుకోడానికి పొయ్యి వెలిగిస్తోంది. సరిగ్గా అప్పుడే అటుగా పరిగెత్తుకుంటూ వచ్చిన జాబిల్లి, తల్లి చాటున దాక్కుని పరిచయం లేని కొత్త వ్యక్తులు తమ ఇంటిలోకి రావడాన్ని బితుకు బితుకుమంటూ చూస్తూ గమనిస్తోంది.

హారతిని వెతుక్కుంటూ వచ్చిన స్వచ్ఛంద సంస్థ సభ్యులు వారికి ధైర్యం చెబుతూ, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాల గురించి వివరిస్తున్నారు.

కళ్ళల్లో నీటి పొర అడ్డు పడుతుంటే, భగవంతుడి దూతల్లా తన ముందుకు వచ్చిన వారికి, భగవంతుడిలా తమను ఆదుకున్న గోవిందకు చేతులెత్తి నమస్కరించింది.

ఆరోజు తర్వాత ఆమె ఇంక వెనుదిరిగి చూడలేదు. నలుగురిలో గౌరవంగా బ్రతుకుతూ, ఆత్మ స్థైర్యాన్ని కోల్పోయిన ఎంతోమందికి తన కథను వివరంగా చెప్పేది.

"మనల్ని ఎవరూ మోసం చెయ్యరు, మోసపోయాము అనుకుంటూ, బయటపడే మార్గాలు వెతుక్కోకుండా మనల్ని మనమే మోసం చేసుకుంటున్నాం".

ఇది ఆమె తెలుసుకున్న నిజమే కాదు... తన చుట్టూ వున్న ఎందరో అభాగ్యులకి తెలియజేసిన నిజం.

★ ★ ★

ఇరవైమూడేళ్ల తర్వాత తన తల్లి ఫోటోకి గులాబీల మాల వేసి, అగరువొత్తులు వెలిగించి, కళ్ళు మూసుకుని దణ్ణం పెట్టుకుంటున్న జాబిల్లి చెంపలపై కారుతున్న కన్నీరు కట్ట తెగిన గోదారే అయ్యింది. తాను కర్పూర హారతిలా కరిగిపోయి, తనకంటూ ఒక అందమైన జీవితాన్ని ప్రసాదించిన కన్నతల్లి హారతికి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకుంది.

"భగవంతుడా! ఆడదానికి ఇన్ని కష్టాలు ఎందుకు పెట్టావు?" మౌనంగా రోదిస్తూ ఎన్నోసార్లు ప్రశ్నించేది. సమాజం పోకడలలో మార్పు వచ్చి, ఇలాంటి సాంఘిక దూరాచారాలు ఇప్పటికైనా రూపుమాసినందుకు, ప్రజల్లో వచ్చిన చైతన్యానికి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకునేది. తల్లి కోరిక మేరకు ట్రస్ట్ నొకదానిని ఏర్పాటు చేసిన జాబిల్లి... మహిళలకు తమ కాళ్ళ మీద తాము నిలబడేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని, మనోధైర్యాన్ని అందిస్తూ , అమావాస్య చీకట్లలో మగ్గుతున్న అనాధాలకు వెన్నెల దారులు చూపే జాబిల్లిగా నిలిచింది.

★ ★ ★


**వేలూరి ప్రమీల.**

విశాఖపట్నం.

Phone: 9492535415

Mail:prameelaveluri@gmail.com

వ్యాసం

# ఆన్లైన్ విద్య, వర్క్ ఫ్రమ్ హోమ్ తో, కళ్ళకు ముప్పు!!



- డా. ప్రతిభాలక్ష్మి

ఈ కరోనా మహమ్మారి మనుషులను, ముఖ్యంగా పిల్లలను ఇంటికే పరిమితం చేయడంతో, పెద్ద వాళ్ళు వర్క్ ఫ్రమ్ హోమ్, పిల్లలు ఆన్లైన్ క్లాస్సెస్ పేరుతో, పెరిగిన స్క్రీన్ టైం కి అలవాటు పడక తప్పని పరిస్థితి ఏర్పడింది.

పరిశోధకుల ప్రకారం, 2-12సం. వయసు పిల్లలు రోజులో కేవలం గంట మాత్రమే డిజిటల్ డిస్ప్లే ముందు ఉండాలి. దాన్ని 'స్క్రీన్ టైం' అంటారు. పన్నెండు సంవత్సరాలు దాటిన వారు రెండు గంటలు మాత్రమే స్క్రీన్ ముందు ఉండాలి. కానీ, అది ఈ సమయంలో ఎవరికీ సాధ్యం కాదు. స్క్రీన్ అనగా, అది ఫోన్, లాప్టాప్, కంప్యూటర్, టీ.వీ వంటి ఏ డివైస్ అయినా అవ్వొచ్చు.

ఇలాంటి పరిస్థితుల్లో, మనకు ఎదురయ్యే కంటి ఇబ్బందులు, వాటిని తక్కువ చేసుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు ఇప్పుడు తెలుసుకుందాం.

అధికం సమయం స్క్రీన్ చూడడం వల్ల కలిగే ఇబ్బందులు:

* తల నొప్పి
* కళ్ళు అలిసిపోవడం
* కళ్ళు పొడి బారి, మంటలుగా ఉండడం
* కళ్ళు పదే పదే నలవడం
* కంటి చూపు సమస్యలు
* నిద్రలేమి
* మెడ మరియు భుజం నొప్పి
* దీర్ఘ కాలికంగా, అధిక బరువు సమస్య.

**ఈ సమస్యలకు గల కారణాలు:**

* గదిలో సరైన వెలుతురు లేకపోవడం
* స్క్రీన్ మీద వెలుగు పడడం వల్ల అది గ్లేర్ అవ్వడం
* డివైస్ ని సరైన దూరంలో పెట్టకపోవడం
* సరైన పద్దతిలో కూర్చోకపోవడం
* కంటి చూపు సమస్యలకు సరైన అద్దాలు వాడకపోవడం
* అధిక సమయం కూర్చొని ఉండడం
* డివైస్ నుండి వెలువడే బ్లూ లైట్, కంటి లోపలి పొర అయిన రెటీనా ని పాడు చేయడమే కాక, మనిషి నిదురకి ముఖ్యమైన సర్కేడియన్ రిథమ్ దెబ్బతినడం వల్ల నిద్రలేమి సమస్యలు తలెత్తడం జరుగుతుంది.

**కంటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు:**

* వెనక నుండి వెలుతురు స్క్రీన్ మీద పడకుండా కూర్చోవడం
* వీలైనంత వరకు స్క్రీన్ టైం తగ్గించే ప్రయత్నం చేయడం, బయట గడిపే సమయం పెంచడం.
* పడక గదిలోకి డివైస్ తీసుకు వెళ్లకుండా ఉండే ప్రయత్నం చేయడం
* కంటికి 15-30 (4-5") కింద కంప్యూటర్ స్క్రీన్ ఉండేలాగా పెట్టడం
* డివైస్ కి కంటికి ఉండవలసిన దూరం,
* ఫోన్ - 16-18"
* కంప్యూటర్ - 20-28"
* టీ. వీ. - వెడల్పు×32"
* తరుచూ కనురెప్పలు కొట్టడం వల్ల, కళ్ళు పొడిబారకుండా, ఇబ్బంది పడకుండా ఉంటాయి.
* ప్రతి రెండు గంటలకు కనీసం పదిహేను నిమిషాలు విశ్రాంతి తీసుకోవాలి.
* అవసరాన్ని బట్టి, రెగ్యులర్ గా కంటి పరీక్ష చేయించుకొని, వైద్యుల సలహాలు పాటించాలి.
* కూర్చునే పద్దతి: పదాలు నేలమీద పూర్తిగా అనే లాగా కూర్చోవాలి.
* 20-20-20 రూల్:

స్క్రీన్ చూస్తున్న ప్రతి ఇరవై నిమిషాలకు ఒక సారి, ఇరవై అడుగుల దూరం ఉన్న వస్తువును, ఇరవై సెకండ్ల పాటు చూడలి. దానితో కంటి కండరాలకు వ్యాయామం లాగా అయ్యి, అవి ఎక్కువ ఇబ్బంది పడకుండా ఉంటాయి

డివైస్ లకు బ్లూ లైట్ ఫిల్టర్లు, మన కళ్ళకు ఫోటోక్రోమిక్ అద్దాలు, ఆంటీ రిఫ్లెక్టివ్ కోటెడ్ గ్లాస్సెస్ లభిస్తాయి. అవకాశం ఉంటే అవి వాడడం మంచిది. వాటి వల్ల బ్లూ లైట్ వల్ల కలిగే ఇబ్బందులను తప్పించుకొని, కళ్ళు అలిసిపోకుండా చూసుకోగలము.

ప్రకృతిలో మార్పు సహజం, మారడం ఒక్కటే శాశ్వతం. కాబట్టి, ఇలా జాగ్రత్తలు తీసుకుంటూ, కాలానికి అనుగుణంగా మారుతూ, ఆరోగ్యకరమైన అలవాట్లు చేసుకునే వారే, జీవితంలో విజయం సాధించగలరు!

కథ

# తిత్రీబాయి



- శాంతి శ్రీ బెనర్జీ

కాంచన చదువుతున్న నవల పక్కన పెట్టి గోడకున్న గడియారం వంక చూసింది. సాయంత్రం ఐదొవ్వస్తోంది. వంట గదిలో వెళ్లి తన కోసం ఒక కప్పు టీ పెట్టుకుంది. డ్రాయింగ్ రూమ్కి వచ్చి, మళ్లీ నవల చదువుకుంటూ టీ తాగసాగింది. తాగటం పూర్తవుతుండగానే బయట గేటు దగ్గర శబ్దమయినట్లనిపించింది. కుక్కలు మొరగడం కూడా వినపడింది. ఆ రోజు పగటిపూట వచ్చే వాచ్ మెన్ సెలవు పెట్టి రాలేదు. అందుకని లేచి బయటికి వచ్చి వరండా, తోట దాటుకుని గేటు దగ్గరికి వచ్చింది. గేటు బయట ఒక లంబాడా యువతి నెత్తిన గంప పెట్టుకుని నుంచుంది.

ఆమె కాంచన వంక చూస్తూ, "అమ్మా! సపోటాలు తీసుకుంటారా? తియ్యటి కాయలమ్మా" అంది.

సపోటాలు ఇంట్లో తను తప్ప ఎవరూ తినరు. తన ఒక్కదానికోసం ఎందుకులే అనుకుని,

"వద్దమ్మా! ఇంకో చోటుకి పోయి అమ్ముకో!" అంది.

"పొద్దుటి నుంచి అమ్ముతున్నాను. ఇంకా డజను పళ్లే మిగిలాయి. తీసుకోండమ్మా! మీరు తీసుకుంటే ఇక మా ఊరు మేడ్చల్ వెళ్ళిపోతాను" అంది.

అంత దూరం నుంచి మారేడుపల్లి పళ్ళమ్ముకోడానికి వచ్చిందా? అనుకుని ఆమె వంక నిశితంగా చూసింది. ముఖమంతా చెమటతో తడిసి ఉంది. కళ్లు లోతుకు పోయి నీరసంగా ఉన్నాయి. కాంచనకి జాలి వేసి "పోనీలే పాపం! తీసుకుంటాను" అనుకుని –

"డజనెంత?" అని అడిగింది.

"మీకెంత తోస్తే అంతే ఇవ్వండమ్మా!"

కాంచన పళ్ళు తీసుకుంది. ఆమె చెప్పినట్లే పళ్లు నాణ్యంగా ఉన్నాయి. లోపలికి వెళ్లి పళ్లు డైనింగ్ టేబుల్ మీద పెట్టి పర్సు తీసుకుని బయటికి వచ్చి వందరూపాయలు తీసి ఆమెకి ఇచ్చి,

"ఉంచుకో పర్వాలేదు! చిల్లర ఇవ్వక్కర లేదు" అంది.

ఆ లంబాడా యువతి ఎంతో కృతజ్ఞతగా చూస్తూ "నిండు నూరేళ్లు బతుకు తల్లీ!" అంది.

కాంచన వచ్చేస్తుంటే "అమ్మా! కొంచెం మంచినీళ్లిస్తావా..?" అనడిగింది.

"ఉండు తీసుకొస్తాను" అని లోపలికెళ్లి లోటాతో తెచ్చి ఆమెకివ్వబోయింది.

" మీరే పోయండమ్మా!" అని కుడి చేత్తో మూతి దగ్గరగా దోసిలి పట్టింది. కాంచన నీళ్ళు పోస్తే ఆబగా తాగింది.

కాంచన గేటు వేసి వచ్చేస్తుంటే, గోడమీద నుంచి పడ్తున్న వేపచెట్టు నీడ చూపిస్తూ "బాగా అలసిపోయానమ్మా! జ్వరపడి లేచి ఈరోజే పళ్ళమ్ముకోడానికి వచ్చాను. ఈ చెట్టు నీడలో కాసేపు పడుకుంటాను" అంది.

"అలాగే! అలాగే! నీ కిష్టమైనంత సేపు పడుకో" అని లోపలికి వచ్చేసింది. మళ్లీ నవల చదవడంలో నిమగ్నమయింది. నవల ఉత్కంఠ భరితంగా ఉండి ఆమెకి టైము తెలియలేదు. భర్త చంద్రశేఖర్ వచ్చినట్లు కారు శబ్దం అవడంతో ఈ లోకం లోకి వచ్చి, టైము చూసింది. ఏడున్నర దాటింది.

చంద్రశేఖర్ కారు షెడ్డులో పెట్టి తాళాలు ఊపుకుంటూ లోపలికి వచ్చి, "బయట ఆ లంబాడీ యువతి ఎవరు? ఈ టైమ్ లో నిద్రపోతుందెందుకు?" అని అడిగాడు.

కాంచనం ఆశ్చర్యపడింది. "ఆమె ఇంకా వెళ్లలేదా? ఉండండి నేను వెళ్లి చూస్తాను" అని గేటు దగ్గరికి వెళ్లి చూసింది. ఆ లంబాడా యువతి ఎంతో అలసిపోయినట్లు గాఢంగా నిద్రపోతుంది.

"ఎవమ్మా! లే! లే! ఇంకా నిద్రపోతున్నావేంటి? " అని లేపింది. ఆమె లేవలేదు. మరి రెండుసార్లు గట్టిగా పిలిచింది. మూడో పిలుపుకి ఉలిక్కిపడి లేచింది. లేచి గాబరాగా చూసింది. నాలుగు వైపులా కమ్ముకున్న చీకట్లు చూసి మరింత గాబరాపడింది. నెమ్మదిగా ఏడవడం మొదలుపెట్టింది.

ఈసారి గాబరా పడటం కాంచన వంతయింది. "ఏమయింది ? ఎందుకేడుస్తున్నావు?"

"అమ్మ! ఇప్పుడు టైమెంతయింది?" ఏడుస్తూనే

అడిగింది.

"ఎనిమిదవ్వస్తోంది."

"అయ్యో! అయ్యయ్యో! నారైలు ఆరున్నరకి. ఇక నేనిప్పుడు ఇంటికెలా వెళ్ళేది?" అని మరింత గట్టిగా ఏడ్వటం మొదలెట్టింది.

"ఊరుకో! ఊరుకో! జ్వరపడి నీరసంగా ఉడడం వల్ల నీకు మెలుకువ రాలేదు. నీకు విశ్రాంతి అవసరం. లోపలికి వచ్చి మా రేకుల షెడ్డులో పడుకో, రేపొద్దున వెలుతురు రాగానే ఇంటికి వెడుదువు గాని" అంది.

ఆ యువతి అలాగే కూర్చుని కాంచన వంక అయోమయంగా చూసింది. కాంచన నెమ్మదిగా ఆమెని సమాధాన పరిచి, లోపలికి తీసుకొచ్చి కూర్చోపెట్టింది.

ఆ తర్వాత వంటింట్లోకి పోయి డిన్నర్ ఏర్పాట్లు చేసింది. తమతోపాటు ఆమెకి కూడా గోధుమ రొట్టెలు చేసింది. ఈ లోపల కూతురు మల్లిక కూడా ఆఫీసు నుంచి వచ్చింది.

అందరూ భోంచేస్తుండగా చంద్రశేఖర్ "ఆమెని లోపలికి రానిచ్చావు ఎలాంటి మనిషో తెలియకుండా. ఏదన్నా దొంగతనంగా ఎత్తుకుపోతే?" అన్నాడు.

"అవును. అమ్మ అందరినీ తొందరగా నమ్మేస్తుంది. నైట్ వాచ్ మెన్ శివయ్య వచ్చాడు కదా...? ఆమె మీద ఒక కన్నేసి ఉంచమని చెప్పు" అంది కూతురు.

కాంచనకి ఆమె అలాంటిది కాదని ఎందుకో నమ్మకం. అమాయకత్వం, నిజాయితీ నిండిన ఆమె ముఖం కళ్ల ముందు మెదిలింది.

" అలాగేలే! ఆమె విషయం నేను చూసుకుంటాను" అని వాళ్లని సమాధాన పరచింది. వంటింట్లో అన్నీ సర్దేసి, రొట్టెలు, కూర, లోటాతో నీళ్లు తీసుకుని ఆమె దగ్గరికి వెళ్లింది.

"ఇదుగో ఈ రొట్టెలు, కూరా తిని, హాయిగా పడుకో ! తెల్లవారంగానే వెళ్లిపోదువుగాని" అంది.

ఆమె ఆకలి మీదుందేమో చూస్తూనే ఆత్రంగా అందుకుంటూ

"జొరేర్ బాటి?" అని అడిగింది.

"అంటే?"

"జొన్న రొట్టెలా?"

"కాదు గోధుమ రొట్టెలు"

"అలాగా?" అని తీసుకుని నాలుగు రొట్టెలు ఆబగా తినేసింది. కాంచనకి జాలేసింది.

"ఇంకా రెండు మూడు రొట్టెలు ఎక్కువ ఇవ్వాల్సింది" అనుకుంది.

నీళ్లు కాంచన పోస్తే దోసిటితో తాగి, చున్నీతో మూతి తడుచుకుంది. కాంచన రేకులషెడ్ వైపు చూపించి, "అందులో మంచం ఉంది. వెళ్లి పడుకో" అని లోపలికి వెళ్లి మెయిన్ డోర్ లాక్ చేసింది. మళ్లీ నవల చదవడం మొదలెట్టింది. అది పూరయ్యే వరకూ చదివి, టైమ్ చూసింది. పదిన్నర అయింది. లైటు తీసి, బెడ్రూమ్ లోకి వెళ్లబోతూ కిటికీలోంచి బయటికి చూసింది. బయట వెన్నెల కాస్తుంది. ఆ వెన్నెల్లో ఆ లంబాడా యువతి రాయిలాగా కదలకుండా కూర్చుని ఉండటం చూసింది.

"అరె! ఈమింకా నిద్ర పోలేదా?" అనుకుని బయటికి వచ్చి, ఆమె దగ్గరికెళ్లి,

"ఇంకా నిద్రపోలేదెందుకని?" అని అడిగింది.

" నా ఛిచ్చార్ అంటే నా పిల్లలు, మా యాడి అంటే మా అమ్మ గుర్తుకొస్తున్నారమ్మా! మా ఇంటి మట్టి గోడల వాసన, మా పొయ్యిలో బూడిద వాసన, మా ఇంటి చుట్టూ తిరిగే మోర్ అంటే నెమళ్ళు, హిరణ్ అంటే జింకలు, బేస్సి అంటే గేదెలు గుర్తుకొస్తున్నాయి. నిద్ర పట్టడం లేదు" అంది కన్నీళ్లాపుకుంటూ.

అది విన్న కాంచనకి ఆమె జీవితం గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి కలిగింది.

కుర్చీ తెచ్చుకుని ఆమె దగ్గరగా కూర్చుని "నీ గురించి చెప్పు. చెప్పుకుంటూ పోతే నీ బాధ తగ్గుతుంది. ఇలా పళ్ళమ్ముకుని ఎందుకు బతుకుతున్నావు? మీ ఆయన లేడా?" అనడిగింది.

"మా ఊరు మేడ్చల్. నాకు పదిహేనేళ్ళకే పెళ్లయింది. పదహారేళ్ళకే పెద్ద కొడుకు పుట్టాడు. ఆ తర్వాత ఇంకో కొడుకు, ఇద్దరు కూతుళ్ళుపుట్టారు. మా ఆయన దుబాయ్ వెళ్లి డబ్బులు సంపాదించుకుని వచ్చి భూమి కొనుక్కున్నాడు. వ్యవసాయం చేసుకుంటూ బాగానే బతుకుతున్నాం. మూడు సంవత్సరాల క్రితం ఒకరోజు మా గల్లీలో వాళ్లు మా ఆయన్ని బాగా తాగించి ఊరు బయటికి తీసుకెళ్లి చంపేశారు. ఆ తర్వాత నెమ్మదిగా మా భూమిని కూడా మమ్మల్ని బెదిరించి లాక్కున్నారు. నాకు బాపా అంటే నాన్న చిన్నప్పుడే పొయ్యాడు. మా యాడి, నేను ఏమి చెయ్యలేక వాళ్ల బెదిరింపులకు భయపడి భూమి మీద ఆశ వదులుకున్నాం!" అని కళ్లు తుడుచుకుంటూ మౌనం వహించింది. కొంచెంసేపటి తర్వాత మళ్లీ మాట్లాడుతూ...

"అప్పటినుంచి గేదెలు, జింకలు, నెమళ్ళు పెంచుకుంటూ, పళ్ళమ్ముకుంటూ బతుకు సాగదీస్తున్నా! మేడ్చల్ తోటల దగ్గర పళ్ళు గుత్తకు తీసుకుని, ఇరవై మైళ్ళు

రైల్లో ప్రయాణం చేసి, సికింద్రాబాద్ స్టేషన్లో దిగుతాను. అక్కడ నుంచి మారేడుపల్లి వచ్చి పళ్ళమ్ముకుంటాను. నా దగ్గర పళ్ళు ఎప్పుడూ కొనేవాళ్ళు ఇక్కడే ఎక్కువమందున్నారు. అందుకే ఇక్కడే ఎక్కువ తిరుగుతుంటాను. సాధారణంగా మారేడు పల్లిలో పెద్ద పెద్ద మేడలుండే ఇటు వైపుకు రాను. ఈరోజెందుకో అనుకోకుండా ఇటువైపొచ్చాను. సపోటాలే కాదు, కాకడి అంటే దోసకాయలు, నారేంగి అంటే జామకాయలు, అంబా అంటే మామిడి పళ్ళు, ద్రాక్షా, పల్లీలు కూడా అమ్ముతుంటాను. సాయంత్రం రైల్లో ఇంటికెళ్ళిపోతాను. నా పిల్లలని, ఇంటిని నా యాడి కనిపెట్టుకుని ఉంటుంది."

"పిల్లలు చదువుకుంటున్నారా ?"

"అవునమ్మా! వాళ్ల చదువుల గురించే నా ఈ బాధంతా! పెద్దవాడు ఇంటర్ మొదటి సంవత్సరం, రెండోవాడు పదవ తరగతి, పెద్దమ్మాయి ఏడు, చిన్నది ఐదు చదువుతున్నారు. నా పిల్లల్ని ముఖ్యంగా నా ఇద్దరి ఆడపిల్లలని బాగా చదివించి వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడేలా చెయ్యాలన్నదే నా తపన" అంది.

"నీకు తెలుగు మాట్లాడటం ఇంత బాగా ఎలా వచ్చింది?"

"నా పళ్ళ బేరం బాగా సాగాలంటే తెలుగు తప్పని సరిగా వచ్చి ఉండాలి కదమ్మా! అందుకే నేర్చుకున్నా. అదీగాక నా పిల్లల స్కూళ్ళలో చదువు చెప్పేది తెలుగులోనే. వాళ్ళ వలన కూడా నాకు తెలుగు బాగా వచ్చింది".

"నీకు ముప్పయి, ముప్పైయి అయిదేళ్ళుంటాయి కదా? మళ్లీ పెళ్ళెందుకు చేసుకోలేదు?"

"మా తండ ఆచారం ప్రకారం మొగుడు చచ్చిపోతే, మరిదిని పెళ్ళి చేసుకోవాలి. నా మరిది తిరుగుబోతు, త్రాగుబోతు. వాన్ని పెళ్ళి చేసుకోవడం నాకిష్టం లేదనీ మా తండ వాళ్ళకి తెగేసి చెప్పాను. వాళ్లకి కోపం వచ్చి నన్ను వెలి వేసినంత పనిచేశారు. అప్పటినుంచి నన్ను ఒకటే సతాయిస్తున్నారు. అయినా నేను బెదరటంలేదు. అత్తామామా కూడా మరిదిని పెళ్లి చేసుకోమని నా మీద ఒత్తిడి చేస్తుంటే నేను నా పిల్లలతో వచ్చేసి నా యాడి దగ్గర ఉంటున్నా! మరిదిని చేసుకుని నా పిల్లలకి అన్యాయం చెయ్యదల్చుకోలేదు. వాళ్ళ మీదే నా ఆశలన్ని పెట్టుకుని బతుకుతున్నాను!" అంది.

ఆమె ముఖంలో కనపడ్డ దృఢ నిశ్చయానికి కాంచన ఆశ్చర్యపోయింది. ఏమి చదువుకోని ఈ లంబాడా యువతికి తన పిల్లల పట్ల ఉన్న ప్రేమ, వారిని విద్యావంతులను చేసి, స్వతంత్రంగా బతికేలా చెయ్యలన్న సంకల్పం మెచ్చుకోకుండా ఉండలేకపోయింది. ముఖ్యంగా తన ఆడపిల్లల్ని కూడా చదివించి పైకి తీసుకు రావాలన్న పట్టుదల కాంచనని కదిలించింది.

"చూడూ! నీ పేరేంటన్నావు?"

"తిత్రీ బాయి!"

"తిత్రీ! నీ పిల్లలను బాగా చదివించి ఉద్యోగస్థులను చెయ్యాలన్న నీ సంకల్పం ఎంతో మెచ్చుకో దగ్గది. దానికి నీకే సహాయం కావాలన్నా చెయ్యడానికి నేను సిద్ధం. పుస్తకాలు కావాలన్నా, కంప్యూటర్లు కావాలన్నా, కాలేజ్, స్కూళ్ల ఫీజులకి నీ కెప్పుడు డబ్బు అవసరం అయినా నన్నడగడానికి సంకోచించ వద్దు. నేను ఆడపిల్లల కాలేజీలో ప్రొఫెసర్నీ, మావారు ఒక స్కూలు, కాలేజీ నడుపుతున్నారు. నీ పిల్లలు బాగా చదువుకుని వాటిలో చేరాలంటే దానికి నేను సహాయం చేస్తాను. సరేనా? "

"ఎంత మంచిదానవమ్మా! నీ లాంటి అమ్మను ఈ రోజు కలవడం నా అదృష్టం" అని కాంచన వంక దేవతను చూస్తున్నట్లు తన్మయత్వంతో చూడసాగింది.

"ఒకసారి నీ పిల్లలను తీసుకురా! వాళ్లతో చదువుల గురించి మాట్లాడుతాను."

" అలాగేనమ్మా!"

"సరే! ఇక లోపలికి వెళ్లి హాయిగా నిద్రపో!" అంది.

తిత్రీ లేచి షెడ్ లోకి వెళ్లి పడుకునే దాకా నిలబడి లోపలికి వెళ్లింది కాంచన.

మరునాడు ప్రొద్దున లేచి షెడ్ కెళ్లి చూస్తే తిత్రీ ఇంకా గాఢంగా నిద్రపోతూ కనిపించింది. పాపం బాగా అలసిపోయింది అనుకుంది.

ఆమె లేచింతర్వాత టీ, ఇడ్లీలు తెచ్చిచ్చి, తిన్న తర్వాత వెయ్యి రూపాయలు చేతిలో పెడుతూ "చూడు తిత్రీ! మా అమ్మ కూడా ఎన్నో కష్టాలు పడి నన్ను పెంచి పెద్దచేసి, నా కిష్టమైనంత వరకూ చదువు చెప్పించింది. ఈరోజు నేనీ స్థితిలో ఉన్నానంటే మా అమ్మే కారణం. అందుకే నీ మనస్సుని నేను బాగా అర్థం చేసుకోగలుగుతున్నాను. నీకు సాహాయపడాలనికి నాకెంతో అనిపిస్తోంది. అందుకే ఇక నుంచి నీకు ఏ సహాయం కావాలన్నా అడగడానికి సందేహించకు. ఇదిగో! ఈ డబ్బు తీసుకుని, నీ పిల్లలకేమన్నా కొనిపెట్టు. ఇక త్వరగా బయలుదేరు. నీ కోసం ఇంటి దగ్గర మీ వాళ్లు గాబరా పడుతుండ వచ్చు" అని తిత్రీని సాగనంపింది కాంచన.

కొండంత అండ దొరికినందుకు సంతోషంతో కులుకుతూ సికింద్రాబాద్ స్టేషన్ వైపు వడివడిగా అడుగులేసింది తిత్రీ.

వ్యాసం

# మారాల్సింది ఇక మహిళలే..!



- సుజాత నాంపల్లి

ఆదిమయుగాల్లో మనిషి సంచారజీవి. ఆహారాన్వేషణలో భాగంగా స్త్రీ పురుషులిరువురూ కలిసే శ్రమపడ్డారు కలిసే జీవించారు. ఇరువురూ సమాన స్థాయినే కలిగిఉన్నట్లు సామాజిక శాస్త్రవేత్తల పరిశీలనవల్ల తెలుస్తుంది.

స్త్రీలు ఆహారాన్వేషణ, పిల్లల సంరక్షణా ఇంటిపనులూ చూస్తే,పురుషులు వేట, సమూహ రక్షణా మొదలగు పనులు చూసేవారు. శ్రమ విభజన అప్పటినుంచే ఉన్నప్పటికీ స్త్రీలపట్ల చిన్నచూపు, వివక్షా కానరావు. పైగా అప్పుడు మాతృస్వామ్య సమాజాలు ఉన్నట్లు ఆనాటి కొన్ని గాథలను బట్టీ గ్రహించవచ్చు.

క్రమానుగతంగా ఆస్తి, సంపద పురుషుల సొత్తై, స్త్రీలు వంటింటికీ, పిల్లల రక్షణకూ పరిమితమవ్వడం వలన పురుషులకంటే స్త్రీలు తక్కువ అనే భావన వేళ్లూనుకోవడం మొదలయ్యింది. ఆర్యుల దండయాత్ర తర్వాత మన సమాజం లో పెను మార్పులు చోటు చేసికున్నట్లు తెలుస్తున్నది.

అంతకు ముందటి మాతృస్వామ్య వ్యవస్థలు కాస్త, పురుషాధిక్య పితృస్వామ్య సమాజాలుగా రూపాంతరం చెంది మహిళలను రెండవ జాతి పౌరులుగా, పరాదీనులుగా, దాస్యులుగా ఇంటిపనులకు మాత్రమే పరిమితమయ్యేలాగా పరిగణించి అణచివేయ్యడం మొదలయ్యినట్టు పరిశీలనలు తెలియ చేస్తున్నాయి

చదువూ, సంపద స్త్రీలకి సంబంధించిన విషయాలు కానే కావన్నంతగా ఆనాటి కథల్లో, గాథల్లో గుప్పించి సమాజంలోకి ఇంకిపోయేలా ఒంపారు ముందుచూపున్న ఆనాటి కుసంస్కార మేధావులు. స్త్రీలని వాళ్లకు వాళ్లే తక్కువ అనే భావన నరనరానా నాటుకుపోయేంతలా పతివ్రతల పాత్రలను సృష్టించి వారిని ఒక చట్రంలో ఇరికించి దాంట్లోనే జీవింప చేశారు అంతకు మించి వారికి ఏ కోశానా అందరమూ సరిసమానంగా పుట్టిన జీవులమే అనే ఆలోచన అణువంత కూడా రాకుండా ఆ కట్టుకథల వల్ల జీర్ణించుకుపోయాయి ఆచారాలు కట్టుబాట్లు స్త్రీ కేంద్రంగానే విధించబడ్డాయి ఇంకేముందీ పిల్లల సంరక్షణ, ఇంటిపనులూ, వంటపనుల్లో తలమునకలైన స్త్రీ క్రమంగా బలహీనపడి అణచివేతకు గురైంది.

కాలాలూ మారుతున్నాయి,యుగాలూ మారిపోయాయి మనుష్యులమైన మనమూ మారిపోవలసిందే..!

పెను మార్పులూ,పలు ఆవిష్కరణల కలబోతే ఈ ఆధునిక యుగం. ప్రజాస్వామ్య భావనలు, స్వేచ్ఛా,సమానత్వం, మానవహక్కుల పరిజ్ఞానమూ ఇప్పుడు అందరికీ అవగాహనలోకి వచ్చాయి.

విద్య, విజ్ఞానము, ఉద్యోగాలూ ఏ ఒక్కరి సొత్తోకాదు. నేడు నూరుపగ్రహాలను ఒక్కసారే నింగికి పంపే సాంకేతికత మన చేతుల్లోకి వచ్చింది. జనాభాలో సగభాగమైన మహిళల కృషిలేకుండా అంతటి అభ్యున్నతి సాధించడం సాధ్యం కానిపని.

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలని ఇప్పటికీ తక్కువ దృష్టితో చూడ్డం మామూలు విషయంగా మారింది.

ఏనాటి నుంచోవేళ్ళూనిన లింగవివక్ష చాపకింద నీరులా ఇంకా కొనసాగుతూనే ఉంది. దాని ఫలితంగానే స్త్రీలపై గృహహింస భ్రూణహత్యలూ, హత్యాచారాలు మరెన్నో వేధింపులు నిరాఘాటంగా కొనసాగుతున్నాయి. సరిగ్గా అమలుకు నోచుకోని కొన్ని చట్టాలూ చచ్చుబండల్లా ఉంటాయి. అయినా మానసిక శారీరక హింస అసమానతలనూ

చూస్తున్నాం.

బాధిత సగం ఆకాశం తనంత తాను మేలుకోనంత వరకూ ఎగుడుదిగుడుని ప్రశ్నించనంతవరకూ, దాడులను ప్రతిఘటించనంత వరకూఏ మార్పు దానంతట అదే రాదు.

ఎవరో వస్తారనీ, ఏదో చేస్తారని ఇంకేదో మరిపోతుందనీ ఎదిరిచూడక ఎవరికి వారుగా ఆలోచించడం, ఎవరి కాళ్లపై వాళ్ళే నిలబడడం నేర్చుకోవాలి  అందుకే అనిపిస్తూంటుంది "ఎప్పటి నుంచైతే.. నీ మనుగడకు ఇంకొకరి గొడుగుని ఆశ్రయిస్తావో అప్పుడు తప్పక వాళ్ళ నియంత్రణలో  కాలం వెళ్లదీయాల్సిందే .!

ఎప్పుడైతే.. నీది కానీ  ఇంకొకరి లోకాన్ని అనుసరిస్తావో అప్పుడు తప్పక వాళ్లాడించినట్టల్లా ఆడే తోలుబొమ్మవే..!

ఎప్పుడైతే.. నీ మనసు పరాదీనమై కదలడమే ఆగిపోయిందో.. ఇంకేముందీ.. నువ్ వేరొకరిని అనుసరించి నడిచిపోయే నీడవు మాత్రమే...!

ఎప్పుడైతే నీ అస్థిత్వాన్ని పాతరేసుకుంటవో అప్పటినుంచీ నువ్ ప్రాణం లేని దేహమై ఇతరుల అదేశానుమతులతో గడపాల్సిందే..!

అందుకే.. చీకటైనా.. వెన్నెలైనా పువ్వులైనా.. పున్నమైనా నీ వెలుగేదో నువ్వే వెలగాలి నీ నొప్పేదో నువ్వే భరించాలి నీ ఊపిరీ నువ్వే తీయాలి

ఔను.. నిన్ను కాల్చే నిప్పునీ నువ్వే విసిరేసుకోవాలి తప్పా పరాన్నబొక్కులా ప్రదక్షిణలు చేసే ఉపగ్రహానివి ఎన్నటికీ కాబోకు నువ్వే స్వయం ప్రకాశిలా వెలుగొందే ఆ సూరీడివి ఎందుకు కావూ కాకూడదు.!?" అని.

సృష్టి లోని జీవరాసులన్నింటిలో ఏ ఒక్కటీ ఇంకోదాన్ని ఉద్ధరించదు, సరికదా ఆధిపత్యమూ వహించదు. వేటి మనుగడకు అవే బాధ్యత వహిస్తాయి. ప్రకృతిని చూసి మనిషి గుణ పాఠాలని నేర్చుకోవచ్చు. స్త్రీలు ముఖ్యన్గా మూఢనమ్మకాలనీ, చాదస్థలనీ విడనాడి హేతువాదనా దృక్పథాన్ని అలవరచుకోవాలి. విద్య తద్వారా ఉపాది అవకాశాలనూ మెరుగుపరచుకొని,పిల్లలని ఉత్తములుగా తీర్చి దిద్దితే ఇంకేం కావాలి.

సమాజం సమూలంగా మారుతుంది.

మోసగించ బడకుండా ఉండడానికి తెలివి తేటల్ని పెంచు కోవాలి.  పుట్టడం మన చేతుల్లో లేకున్నా జీవించడం మన చేతుల్లోనే,మన చేతల్లోనే ఉంటుందని నమ్మితే అన్నీ సుసాధ్యమే..!



కథ

# బంధాలను మింగిన మనిషి



- యడవల్లి శైలజ ప్రేమ్

శీతాకాలంలో పొద్దున్నే మచిలీపట్నం రైలు ప్రయాణం . ఎన్నోసార్లు ప్రయాణం చేసినా ఈ ప్రయాణం మాత్రం

మనసుకు ఉత్సాహాన్ని , ఉల్లాసాన్ని ఇస్తుంది. ప్రపంచాన్ని వణికిస్తున్న వైరస్ కాస్త ఇప్పుడిప్పుడే తగ్గుముఖం

పడుతుందని జనాలు ఊపిరి పీల్చుకుని ఏడాదిన్నర తర్వాత కొంచెం దూరపు బంధువుల ఇంటికి స్నేహితులను

కలవడానికి మాలాగే వెళుతున్నారని అనిపించింది. రైలు ప్రాంగణం లో అడుగు పెట్టగానే మానస, ప్రణయ్ సెల్ఫీలు

తీసుకుంటున్నారు.

అమ్మా!

నువ్వు కూడా సెల్ఫీ దిగు నా వాట్సాప్ స్టేటస్ పెట్టుకుంటాను. నా సమాధానం వినకుండానే సెల్ ఫోన్ ముఖం

ముందు పెట్టింది. దాని సంతోషం కాదనలేక బట్టల దుకాణంలో ఉంచిన ప్లాస్టిక్ బొమ్మ లాగా నిల్చున్నాను.

దానికి కారణం ....

ఇలా ఆటోలో రైల్వే స్టేషన్లో దిగి భుజానికి ఉన్న లగేజీ బ్యాగులను దింపి కూర్చున్నామో లేదో ఇరవై నాలుగు

ఇరవై ఏడు మధ్య వయసు ఉన్న యువకుడు గబగబా పరిగెత్తుకుంటూ వచ్చి చేతికున్న లగేజీ బ్యాగ్

పడేసి అప్పుడే ఫ్లాట్ ఫామ్ లోకి వస్తున్న రైలు కింద పడడానికి పోతున్నాడు. అతన్ని ఆపడానికి ఆడ మనిషి

వెనుక నుంచి వచ్చి ఆమె కూడా అతని వెనుక నుంచి రైలు కింద దూరడానికి ప్రయత్నం చేస్తుంది జనాలు

గుంపులు గుంపులుగా చూడడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు.

రైలు ఆగింది అదృష్టం కొద్దీ వాళ్ళ ఇద్దరికీ ఏం కాలేదు.

రైలు జంక్షన్ కావడం వల్ల పైగా ఆ యువకుడు రైలు పట్టాల మధ్యన పడుకోవడం వల్ల చావకుండా బతికి పోయాడు.

మాలాగే ప్రయాణం చేయడానికి వచ్చిన వారిలో కొందరు ఇంత పెద్ద రైల్వే స్టేషన్లో భద్రత లేకపోవడం సెక్యూరిటీ సిబ్బంది కూడా లేకపోవడంతో పోలీసు కంప్లైంట్ చేయాలని అరుస్తున్నారు. అంతసేపూ భయపడిన జనానికి వాళ్ళిద్దరూ క్షేమంగానే ఉండటంతో కాస్త ఊరట లభించింది.

ఎవరి గోల వారిదే అన్నట్లు మునిగిపోయారు మళ్లీ.

ఆ యువకుడు బాగా తాగి ఉన్నాడేమో గుప్పు గుప్పున మద్యం వాసన వస్తుంది.

చావు కబురు చల్లగా అందినట్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని తీసుకుని పోయారు.

“మద్యపాన నిషేధ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్ని ధర్నాలు రాస్తారోకోలు నిర్వహించారు.

ఇప్పుడవన్నీ ఏమైనట్లు ? సారాయి తాగేవాళ్ళదితప్పా? కొనుగోలు చేసేవారిదితప్పా? మద్యం అమ్మకాలకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వాన్ని తప్పు పట్టాలా? బేతాళ ప్రశ్నలు ఎన్నో బుర్రలోకి దూరి నసపెడుతున్నయి. బంధాలను నాశనం చేసే కుటుంబానికి దూరం చేసే ఈ అలవాటు ఎప్పుడు పోతుందో.”

మా ఆయన స్నేహితులు, బంధువులు అందరం కలిసి పోతున్న ప్రయాణమిది వాళ్ళు కూడా రావడంతో వేడి వేడి చాయ్ తాగుదామని పోయినాం అందరం.

చలికాలం అల్లం టీ అయితే బాగుంటుందని అందరికీ అవే పెట్టమని మేం చెప్పాం.

చాయ్ వాలా కళ్ళు నిద్ర మరిచి చాలా రోజులైంది అనడానికి గుర్తుగా నల్లగా ఉన్నాయి.

చిన్న గది ఆ గది లోపల ఎప్పటివో రెండు పాత బారు బల్లలు . గోడల మీద పాన్ మరకలు , మూలన గుట్కా ప్యాకెట్లు ఉన్నాయి. చాయ్ మరుగుతున్న వాసన పాన్ వాసన కలగలిసి అదో రకమైన వాసన వస్తుంది.

చాయ్ గొంతులోకి దిగుతుందా !?

చాయ్ తాగకపోతే చలికి తట్టుకోలేని పరిస్థితి మరి.

తెల్లటి కప్పులో అల్లం టీ పోసి సాసర్ లో పెట్టి ఇవ్వగానే ఒక్క గుటక వేయంగానే అక్కడ వాతావరణం ఎలా ఉందో పట్టించుకోవడం మానేసింది మనసు. ఎంతైనా జిహ్వ చాపల్యం కదా!

“కష్ట సుఖాలను దాటుకుంటూ ముందుకు పోతున్న వయసు కూడానూ అందరినీ ప్రేమిస్తుంది .”

(2)

జీవితంలో కొన్నింటిని మనం కొలతలు, హద్దులు పెట్టుకుని జాగ్రత్తలు తీసుకుంటే కాలం మాత్రం కొన్ని పాఠాలు చెప్పే ప్రయత్నం చేస్తుంది.

ముందుగా ఎంత ప్లాన్ చేసుకుని టికెట్ రిజర్వేషన్ చేయించుకున్న తర్వాత కూడా కొంత ఇబ్బంది పడకతప్పలేదు.

చాలా రోజుల తర్వాత ప్రయాణం అటుఇటు పరిగెత్తి తలొక బోగీ లోకి ఎక్కడానికి ట్రై చేస్తున్నాం.

పరిగెత్తుకుంటూ ఎక్కలేకపోతే ఇంటికి పోదాం ఏమవుతుంది అనుకున్నాను.రిజర్వేషన్ చేయించుకున్న డబ్బులు వృథా అయిపోతాయేమో అంతే.

“డబ్బులను మించినది కదా ప్రశాంతత.”

చివరికి అవకాశం ఉన్న బోగీల్లో ఎక్కి నిల్చుని మూడు గంటలు తిప్పలు పడ్డాం. చల్లటిగాలి కిటికీ లో నుండి విసిరి విసిరి కొడుతుంది.

కొంచెం ఇష్టం కొంచెం కష్టం మీద మచిలీపట్నం లో రైలు దిగాం.

మాకు కేటాయించిన గదుల్లో మా లగేజీ బ్యాగులను పెట్టుకుని స్నానం చేసి టిఫిన్ తిని మచిలీపట్నం సముద్రం వైపు వెళ్ళాం.

అక్కడ అడుగు పెట్టగానే అందరి వయసు చిన్న పిల్లల మనసులా కేరింతలు కొట్టింది.

వావ్!

ఇంత అందమైన ఉదయాన్ని చూసి ఎన్ని రోజులు అయ్యింది. ప్యూపా లో ఒదిగి ఉన్న పట్టు పురుగులా దానిలోనే ఒదిగి ఒదిగి బయటికి రావాలన్నా భయపడి వాయిదా వేసిన ప్రయాణాలు, అనుభూతులు, ఆశలు, ఆశయాలు ఎన్నో కదా!

సముద్రం కాసేపు ప్రశాంతంగా ఉంటుంది. ఆ తర్వాత కూడా అలాగే ఉంటుందా?

కార్తీకమాసం లో ఇంతదూరం వచ్చి సముద్ర స్నానం చేయకపోతే ఎలా ఉంటుంది. బట్టలు ఇంకొక జత తెచ్చుకోలేదు

కూడా అయినా సరే నేను, పిల్లలు, స్నేహితులు బంధువులు అందరం కలిసి ఆ సముద్రంలో నీళ్ళలో ఆడిపాడిన తర్వాత ఆ జ్ఞాపకాలు హృదయంలో శాశ్వతంగా ఉండిపోయేలా మూటగట్టి పెట్టుకుని భద్రపరుచుకున్నాం.

ఆ సముద్రపు ఒడ్డున ఉన్న గవ్వలు ఏరుకుని ఫోటో దిగి ఇష్టమైన వారి కోసం కొన్ని గవ్వల కీ చైన్స్ కొనుక్కుని తడిసిన బట్టలు గాలికి ఆరబెట్టుకుంటూ బయలుదేరాం.

కష్టాలను మరిచిపోయిన మనసులు చిన్ననాటి జ్ఞాపకాలు దారిపొడవునా వెతుక్కుంటూ దొరికినవి దొరికినప్పుడల్లా నలుగురితో కలిసి పంచుకుంటూ సంబరపడిపోతున్నారు.

వేరు శెనగ కాయలు, తేగలు, తాటిపండ్లు, రేగి,జామ,పరిగ,కంది, పెసర, సొరకాయ, కాకరకాయ, చేపలు, ఇసుక గూళ్ళు ఇది అది అని లేకుండా రెక్కలు విప్పిన పక్షిలా తప్పు ఒప్పు అని కూడా ఆలోచించకుండా చిలిపి చేష్టలు, చిలిపి దొంగతనాలు నెమరువేసుకుంటూ ఆకలి కూడా మరిచిపోయారు.

“కొందరిని తొలి వలపు జ్ఞాపకాలు అందంగా పలకరించాయేమో కొంచెం కొంటె నవ్వు కనిపించింది. కొందరికి విషాదం మిగిల్చిందేమో యవ్వనం ఇప్పుడు కూడా కనుల కొలనులో నీళ్ళు కనిపించాయి.”

సర్దుకుని పోవడమే జీవితం. గుంపులో నుండి ఎవరో అన్నారు.

అవును నిజమే ..... అవును నిజమే..... మనసులో

అనుకున్నాం అనుకుంటున్నారేమో ఆ మాటలు పైకే వినిపిస్తున్నాయని గ్రహించలేని పరిస్థితి అందరికీ.

తిరుగు ప్రయాణంలో వెంట తెచ్చుకున్న కారప్పూస , అరిసెలు, బూరెలు అందరికీ ఇచ్చి కవర్లను చెత్త కుండీలో వేసి సగం లగేజీ తగ్గిపోయిందని ఊపిరి పీల్చుకున్నాం.

రైలు దిగగానే ఆ సంఘటన కనులముందు తిరుగుతూ ఉంది.

కొంచెం కలతపడిన మనసుతోనే ఇంటికి వెళ్ళాం.

(3)

పొద్దున్నే లేవడం వాకిలి ఊడ్చి ముగ్గులు పెట్టడం, బట్టలుతికి ఆరేయడం, అంట్లు తోమడం, వండి వడ్డించడం షరా మామూలుగానే ఉంటుంది. అవి ఆడవారి జన్మ హక్కు అన్నట్టు మాట్లాడతారు.

ఆరోజు కూడా అంతే ఎవరి పని వాళ్లు చేసుకుంటూ ఉండగానే పక్కింటి వాళ్లింట్లో నుంచి ఒక్కసారిగా పెద్ద పెద్దగా ఏడుపులు వినిపిస్తున్నాయి. ఏం జరిగిందో చూద్దాం అని వెళ్ళేసరికి రాకేష్ శవాన్ని అంబులెన్స్ లో నుంచి దించుతున్నారు.

రాకేష్ బజార్లో నేను ఎప్పుడన్నా కనబడితే ఆంటీ అంకుల్ ఉన్నారా ? అని పలకరించేవాడు.

ఈ మధ్యనే కొత్తగా కొంతమంది యువకులు గంజాయి తాగడానికి, అమ్మడానికి అలవాటు పడ్డారు. దీనికి కారణం కుటుంబంలో తల్లిదండ్రులు గొడవలు పడుతూనో, ఉన్న పిల్లలను పట్టించుకోకుండా ఉండడమో, ఏ కారణం చేతనైనా విడివిడిగా ఉండటం వల్ల పిల్లలు తమ బాల్యాన్ని ఆనందంగా గడపకుండా చెడు అలవాట్లకు అలవాటు పడి వాటికి బానిసలా మారి ఇంట్లో వస్తువులు తాకట్టుపెట్టి, అమ్మి, దొంగతనాలు చేసి మత్తు పదార్థాలు వాడుతున్నారు.

గోడల మీద కూర్చుని అమ్మాయిలను ఏడిపించడం. పోలీసులకు ఫిర్యాదు చేశారు కొన్ని రోజులు జైల్లో పెట్టారు. ఆ తర్వాత కూడా మారకుండా చివరికి ఇలా శవంలా అంటూ వాళ్ళ నాయనమ్మ ఏడుస్తున్నది.

తల్లి లేదు తండ్రి పట్టించుకోకుండా ఎక్కడో ఒకచోట చేరి తిరగడం.

ఇప్పుడేం చేయాలి దేవుడో అని గొల్లున ఏడుస్తూ వాళ్ళ అమ్మ, కబురు అందుకున్న చుట్టాలు, స్నేహితులు, చుట్టుపక్కల వారు శోక సముద్రంలో మునిగిపోయారు.

కిటికి తలుపులు తెరిచి చూడాలన్నా భయం వేసింది. ఏ పని చేస్తున్నా మనసు దిగులుగానే ఉంది.

మనిషికెందుకో ఈ వ్యామోహం శరీరంలోని చీము, నెత్తురు, మాంసం తగ్గి చర్మం ముడతలు పడి ఒక్కొక్క అవయవం కరిగిపోతూ, అరిగిపోతూ, అందం వెలిగిపోయే వరకు తపన పడుతూనే ఉంటాడు.

ఒక పక్క ఆ అబ్బాయిని చూడటానికి వచ్చిన వాళ్ళు మొగుడు తో ఉండి ఉంటే ఎట్లుండునో ఇప్పుడు ఏడుస్తుంది చూడు ఆమెను శాపనార్థాలు పెడుతున్నారు. నిస్సహాయంగా చూస్తుందామె.

మెడలో పుస్తెలు కట్టిన వాడు మంచిగా ఉంటే అసలు నేను ఎందుకు వదిలి పోతాను. కడుపు నిండా అన్నం మెతుకులు తిన్నది లేదు. కంటి నిండా నిద్ర పోయింది లేదు. వంటికి బట్ట తెచ్చింది లేదు. కూలీ పనులు చేస్తూ వచ్చిన డబ్బులతో ఇంత తిందామన్నా తిననిచ్చింది లేదు. అనుమానమనే జబ్బుతో వళ్ళంతా పచ్చిపుండు అయ్యేటట్లు కొట్టి నోటికి వచ్చిన కూతలు కూస్తూ బజార్లో పడుకోబెట్టినప్పుడు, అర్థరాత్రి పక్కింటోళ్ళ ఇళ్ళల్లో దూరినప్పుడు ఏ ఒక్కరి నోరు పెగల్లేదు. కడుపు కోత మిగిలిన నాడు తలొక మాట అంటున్నారు. ఆడదానిగా పుట్టడమే శాపమేమో, పాపమేమో నిండు నూరేళ్లు కలిసిమెలిసి జీవించడానికి తలొంచుకుని తాడు కట్టించుకుని, తలంబ్రాలు పోయించుకుని, చిటికెన వేలు పట్టుకుని ఏడడుగులు నడిచి వచ్చిన నాకు ఏం మిగిలింది? నాలా ఇంకెంత మంది ఉన్నారో ! తొమ్మిది నెలలు మోసి కని పెంచిన కొడుకు దూరమైతే ఆ కడుపు కోత నేనెట్లా భరించను?

ఆమె ప్రశ్నలకు సమాధానాలు ఎవరు చెబుతారు?

రాకేష్ శవాన్ని తీసుకొని పోతున్నారు.

బంధాలను మింగిన రాహువులా కాలం సాగిపోతుంది.

వ్యాసం

# పనికి అంకితమైన బాల్యం - పసివాడిన అందమైన బాల్యం!!

- మణినాథ్ కోపల్లె



"ఒరేయ్ సత్తిగా ఆ రెంచ్ ఇటియ్యి.."

"ఏయ్ చాయ్ తే!"

"సత్తు పని సరిగా నేర్చుకోరా!"

"ఏరా డబ్బులు తెచ్చావా? "

"సత్తెం! ఆ కొట్టుకెళ్ళి సామాను తే!"

.. అబ్బా! పని పని ...... ! అందరూ పని చెప్పేవాళ్ళే! ఒక్కరైనా నన్ను పూర్తి పేరుతో పిలిచారా? 'నువ్వు తిన్నావా?' 'నువ్వు చదువుకోవా ?' 'బడికి వెళ్ళవా?' ' ఇదిగో ఈ డబ్బులతో స్వీట్ కొనుక్కో!' ఇలా ఎవరైనా నాతో అన్నారా? నా వయసు వాళ్ళందరూ బడికి వెళ్తుంటే నేను ఈ మురికి బట్టలతో పని చేస్తూ వుండాలా?' .... ..

సత్యం అనే పదేళ్ళ పసి వయసులో ఆలోచనలు ,,,,,, సాగుతూ .. ఏ కోరికా తీరాకుండానే సాగిపోయే కాలంతో పాటు పెరిగి పెద్దవాడయ్యాడు.

★★★

అది ఒక చిన్న మెకానిక్ వర్క్ షాపు. అయినా ఆ వూర్లో దానికి ఎంతో పేరుంది. ఆ ఊరే కాదు వేరే వూళ్ళ నుంచి వచ్చి తమ వాహనాలని రిపేరు చేయించే వారు. ఆ వర్క్ షాప్ లో పని వాళ్ళు వున్నారు.

ఆ వర్క్ షాప్ లో పని చేసే వాళ్ళల్లో పది సంవత్సరాల సత్తి కూడా ఒకడు. పొద్దున్నే ఎనిమిది గంటల కల్లా పన్లోకి రావటం. వాడి పని రోజూ ఆ వర్క్ షాప్ ఊడవటం. అన్ని సామాన్లు నీట్ గా షెల్ఫ్ లో సర్దటం. ఆ తరువాత నీళ్ళు చల్లటం లేదా కడగటం చేసేవాడు. ఆ తరువాత మేస్త్రీ వస్తే అతను చెప్పిన పని చేయటం చేసేవాడు. వాడు చిన్న వాడు అయితేనేం మోటు పన్లు బాగా చేస్తాడు.

అంత చిన్న వయసులోనే పనిలో చేరటానికి కారణం వాడి కుటుంబ పరిస్థితులు. వాడికి ఇద్దరు అక్కలు, ఇద్దరు చెల్లెళ్ళు, ఒక తమ్ముడు. తండ్రి ఎప్పుడూ తాగుడే! తల్లి పిల్లలని చూసుకోవడం తోనే సరిపోయేది. ఆ చిన్న వయసులోనే కుటుంబ భారం వాడు కూడా పంచు కోవాల్సి వచ్చింది. సత్తికి వచ్చే జీతం కూడా చాలా తక్కువ! చాలా సార్లు ఇంట్లో ఒకపూటే తినేవాళ్ళు.

తన తోటి వారు బడికి వెళ్లి చదువు కుంటుంటే తను మాత్రం ఒక మెకానిక్ దగ్గర పని చేయటం వాడి చిన్న మనసు ఎప్పుడూ ఆలోచిస్తుండేది. అందరిలా చదువు కోవాలని వుండేది. అందరూ పొద్దున్నే బడికి వెళ్తుం టే తను మాత్రం అదే సమయానికి పనికి వస్తున్నాడు. వాడు పనిచేసే వర్క్ షాపు అంతా గ్రీజు, కార్బను, నల్లటి మురికి బట్టలు ... ఒక చెక్క స్టాండులో రెంచీలు, పటకార్లు, స్క్రూడ్రైవర్లు, ఇంకా ఎన్నో పనిముట్లు. ఆయిల్ డబ్బాలు.... ఒక పక్క లేత్ మిషన్.... ఇంకో పక్క వాల్వ్ పాలిషింగ్ మెషిన్ ... తుప్పు పట్టిన పార్ట్స్



క్లీనింగ్

కోసం వాడే బొచ్చెలు, అందులో కిరోసిన్ , వాటిల్లో ఇంజన్ పార్ట్స్ ... గోడలన్నీ

నల్లగా మసి..... ఇదీ ఆ వర్క్ షాప్ వుండే తీరు.

లారీ ఇంజన్లు రిపేర్ కి వచ్చినప్పుడు వాటి పార్ట్స్ విప్పటానికై సుత్తితో దెబ్బలు వినబడుతూ వుంటాయి. దడ్ దడ్ మంటూ చప్పుడుతో తిరిగే మిషీన్లు.

చూడటానికి అసహ్యంగా వుండేది వాతావరణం. అయినా లారీలు బాగు చేసే కొట్టు అంటేనే అందరికీ తెలుసు ఎలా వుంటుందో .... వాళ్లకి తమ పని కావటం ముఖ్యం.

ఎప్పుడూ పని కుర్రాళ్ళు ఇంజన్ లో వుండే పార్ట్స్ షాఫ్ట్ క్లీనింగ్, హెడ్ విప్పతీసి, గుంటలో పిడకలతో నిప్పు పెట్టి ఆ నిప్పుల మీద పెట్టి ఆ హెడ్ ని కాల్చే వారు. బాగా హీటెక్కి ఆ హెడ్ కి వున్న కార్బన్ క్లీన్ అయ్యేది. సత్తిగాడు శాండ్ పేపర్ తో బాగా రుద్ది, ఎక్కడా తుప్పు లేకుండా పేపర్ కొట్టేవాడు.

తరువాత దానికి వున్న డజను వాల్వ్ లు విప్పతీసి వాటి పేస్ లు పోలిష్ మిషన్ పై పాలిష్ చేసేవాడు. మేస్త్రీ లారీ కింద పని చేస్తుంటే రెంచీలు, స్క్రూ డ్రైవర్ లు, ఇతర పనిముట్లు అందించే వాడు. ఎప్పుడూ పనే! అన్నిటికీ 'సత్తీ', 'సత్తీ' అంటూ పిలిచేవారు.

ఒక ఇంజన్ బాగు చెయ్యాలి అంటే వారం పట్టచ్చు, నెల పట్టచ్చు. ఎందుకంటే వాటిల్లో వుపయోగించే బేరింగులు ఇంకా కొన్ని భాగాలు దొరకకపోతే మద్రాస్ నుంచి ఆర్డర్ ఇచ్చి తెప్పించేవారు. మెయిన్ ఇంజన్ పార్ట్ ఎత్తటం ఒక్కరూ ఎత్తటం అసాధ్యం. అందుకే దాన్ని తాళ్ళు ఒక బొంగుకి కట్టి ఐదారుగురు

ఎత్తి లారీలోంచి కిందకి దింపటం చేసేవారు. ఆ తరువాతే వాటిని విప్పదీసి విడి విడిగా రిపేర్ చేసేవాళ్ళు. అలా ఒక ఇంజన్ రిపేర్ చేయటం ఎంతో కష్టంతో కూడుకుని వుండేది. సత్తిగాడు ఎవరు ఏ పని చెప్పినా చేసేవాడు.

షాపులో చేసే పనికి తోడూ అదనంగా ఎవరైనా వస్తే టీ ఇవ్వటం.... బయటికి వెళ్లి టిఫిన్ లు తీసుకు రావటం చెస్తుండేవాడు. చిన్నవాడు అని అన్ని పనులూ తనకే చెప్పేవారు. యజమాని ఇంట్లో వార పత్రికలూ, సినిమా పుస్తకాలూ తెప్పించే వారు. మధ్యాహ్నం పూట ఖాళీ దొరికితే అప్పుడప్పుడూ ఆ పుస్తకాలలోని సినిమా బొమ్మలు తిరగేసేవాడు. పక్కన వున్న వాళ్ళని అడిగి తెలుసుకునే వాడు అందులో ఏమి రాసుందో అని .... సత్తిగాడు తెలివైన వాడు. పని సులువు యిట్టె గ్రహించే వాడు.

ఆ వయసుకు మించిన పని చేస్తుంటాడు. తన పనిలో రాటు తేలాడు కాని వాడికి ఇష్టమైన కోరిక చదువుకోవటం. అందరిలా బడికి వెళ్లాలని వుండేది. కాని ఇంటిలో పరిస్థితి ... ప్రతి దానికీ వెతుక్కోవటమే! ఆదాయం తక్కువ. ఖర్చులు

ఎక్కువ. తను చిన్నతనంలోనే పనికి వెళ్లి చదువు కోలేక పోవటానికి కారణం తనతల్లి తండ్రులే అని అనిపిస్తుంది. బాధ్యతగా తన తల్లి తండ్రి వుండి వుంటే తనూ అందరిలా చదువుకోడానికి బడికి వెళ్ళేవాడు. తన జీవితమే మారిపోయేది అని అనుకునేవాడు. తను తన గురువు దగ్గర పని చేస్తున్నప్పుడే బెల్లంపల్లి

నుంచి ఒక కష్టమర్ వచ్చేవాడు. లారీ సర్వీస్ చేయమని అంటూ.... ఆయన చాలా మంచి వాడు. ఐదో క్లాసులోనే తన చదువు మానేసిన తనతో చదువు

గురించి ఎప్పుడూ అడుగుతుండేవాడు. 'చదువుకోరా' అంటూ..... అప్పుడని పించేది ఈ పనిమానేసి చదువు కోవాలని. అయన వచ్చినప్పుడల్లా బేటా(టిప్పు) అని తనకి డబ్బులు ఇచ్చేవాడు.. వాటితో తన ఇంట్లోకి మిఠాయి

తీసుకెళ్ళేవాడు. అంతే తప్ప తన కోసం అంటూ ఏమీ కొనుక్కునేవాడు కాదు.

ఒక్కోసారి అనిపించేది వాడికి ఏమి కోల్పోయాడో అని...

తను చిన్న వయసులోనే పనికి రావటంతో. కుటుంబానికి అనుబంధాలకి దూరమయ్యాడు..

తన తోటి వాళ్ళు అందరూ సంతోషంగా అమ్మా నాన్నలతో గడుపుతూ వుంటే తను ఇక్కడ మసిలో, లారీల మధ్య మోటు పనులు చేస్తూ రోజు గడుపుతున్నాడు.

అందరిలా తానూ స్నేహితులతో ఆడుకోవాలని, గెంతుతూ, ఆడుతూ పాడుతూ గడపాలని వుండేది. .

అందరిలా తళ తళ లాడే బట్టలేసుకోవాలని వుంటుంది. కాని రోజూ ఈ మాసిపోయిన బట్టలే గతి.

అందరిలా బడికి వెళ్లాలని వుంటుంది. కానీ తనకి అక్షరం రాదు.

అందరిలా ఎంజాయ్ చేయటం లేదు. స్కూల్ జీవితం

లేదు.

ఎప్పుడూ పని... పని.... దీనికి కారణం ఎవరు? తను నిరుపేద కుటుంబంలో పుట్టడమేనా తను చేసిన తప్పు..... ఇలా సాగేవి సత్య ఆలోచనలు. తప్పించుకో లేని జీవితం వాడిది.

రోజులు మారాయి.

సత్తి గాడు కాస్తా పెద్దవాడై సత్యం గా పిలవబడుతున్నాడు. మాటలోనూ, వేషంలోనూ నాగరికత వచ్చింది. ఒక లారీని ఎలా రిపేర్ చేయాలో తెలిసింది. వాడి యజమాని పెద్ద వాడయ్యాడు. సత్యం యజమానికి కుడి భుజంలా తయారయ్యాడు. వర్క్ షాప్ ఎప్పుడూ నీట్ గా వుండటం, పనిమంతులు పని చేస్తుండటం తో ఆ వర్క్ షాప్ కు పేరు కూడా వచ్చింది.

అయినా సత్యానికి తన బాల్యం గుర్తుకు వస్తే చాలు మనసంతా ఏదోలా అయిపోతుంది.

ఇప్పుడు వచ్చిన చైల్డ్ లేబర్ చట్టాలు అప్పుడు వచ్చి వుండి వుంటే....

తన తల్లితండ్రులు బాధ్యతగా మెలిగి వుండి వుంటే....

ఇప్పుడు ఉన్న సదుపాయాలు అప్పుడు ఉండి ఉంటే....

తనూ మామూలు బడిలో చదివి, నాలుగు అక్షరాలూ నేర్చుకుని వుండి వుంటే,

తన ఇంట్లో ఇంత మంది కాకుండా చిన్న కుటుంబం అయి వుంటే....

తన జీవితమే మారి పోయేది. .....

ఎవరు దీనికి బాధ్యులు. తమ ఆర్థిక వ్యవస్థా.... ?.


తక్కువ జీతాల కి చిన్న పిల్లలు పని లోకి వస్తారనా....?

కుటుంబ భారం తనపై పడటమా....?

బాధ్యత లేని వ్యసన పరుడైన తండ్రా .....? ఎవరు కారణం?

తన తప్పులేని తను జీవితంలో ఎన్నో కోల్పోయాడు....

సత్యం తనకి ఏ మాత్రం వీలు చిక్కినా మళ్ళీ చదువు కోవాలను కుంటున్నాడు. పనిలో నిపుణత సాధించ గలిగాడు. ఇన్నేళ్ళ కాలం లో తన అక్కల పెళ్లి జరిగింది. తండ్రి చనిపోయాడు. తన చెల్లెళ్ళని తమ్ముడిని బడికి పంప గలుగు తున్నాడు. ఎవరైనా చిన్న పిల్లలు పని చేస్తున్నారు అంటే వాళ్ళని



పనిలో నుంచి తప్పించి, వారికి చదువుకోటానికి సాయం చేస్తున్నాడు.

చిన్నప్పటి నుంచీ పని చేయటం వల్ల పనిలో నిపుణత సాధించాడు. కానీ అందమైన బాల్యం కోల్పోయాడు. గడిచిన కాలం తిరిగి రాదు. ఆ లోటు ఎప్పుడూ తన జీవితంలో మిగిలి పోతోంది. నిరంతరం మర్చి పోని గతం వెంటాడుతూనే వుంటుంది... సత్యానికి సొంతంగా వర్క్ షాపు నడిపే సామర్థ్యం వచ్చింది.

సత్యం ఎప్పటికైనా తానూ చదువుకుని ఇంకా పైకి ఎదగాలి అని అనుకున్నాడు. చదువు వుంటే తన వ్యాపారంలో ఇంకా మెలుకువలు సాధించ గలుగుతాడు. మంచి ఇంజన్ కి అవసరమైన భాగాలు విదేశాల నుంచి కూడా దిగుమతి చేసుకోవచ్చు. తన వ్యాపారం ఇంకా వృద్ధి లోకి తీసుకోవచ్చు అని ఆలోచిస్తున్నాడు. ...

చదువు విలువ తెలుసుకోవాలి . మనిషి ఎంత మారినా చదువు నేర్పే జ్ఞానం కోసం వెతుకు తున్నాడు. చాప కింద నీరులా విస్తరిస్తున్న బాల కార్మిక వ్యవస్థ రూపు మాపాలి. తను పొందిన అనుభవాలు మరి ఏ చిన్నారి కూడా అనుభవించ కూడదు అని కూడా ధృడ నిశ్చయంతో ముందుకు కదిలాడు సత్యం..... తన అందమైన బాల్యం అందరిలా కాకుండా సమస్యలతో ఎలా గడిచిందో అని ప్రతి నిముషం ఆలోచిస్తూ బాధ పడుతుందేవాడు.. .. ..

బాల్యం అంతా పని చేసి కుటుంబాన్ని పోషించటంతోనే గడిచి పోయింది. అలా సత్యం బాల్యం ఒక అందమైన కలగానే మిగిలి పోయింది.

# ఎర్ర రేగళ్లు



- తంగెళ్ళ శ్రీదేవిరెడ్డి

సాయంకాలం....

నాలుగంటల సమయం....

నింగికి నేలకి ధార కడుతూ సన్నగా జల్లు కురుస్తున్నది....

భూమండలాన్ని దివిటీ పట్టి శోధించినట్టుగా ఉండుండి ఆకాశం మెరుస్తున్నది ....

మెరుపులకు తోడుగా మేఘ ఘర్జనలు కర్ణభేరుల్ని పగులగొడుతున్నాయి....

ఆ వాతావరణ పరిస్థితుల్లో...ఊరి చివరగా.... నాలుగు గదుల ఓ పాత ఇంటి తాలూకు కవేలా వరండా మొదట్లో నిలబడి ఉన్నది యాభై ఏళ్ల ప్రభావతమ్మ .ఆమె కళ్ళల్లో ఆందోళన కొట్టొచ్చినట్టుగా కనిపిస్తున్నది.

సగం నెరిసిన పలుచని జుట్టును సిగలా మూడేసుకుని, నుదుటన సింగారు కుంకుమ ధరించి, రంగు వెలసిన నారాయణపేట కాటన్ చీరలో మధ్యతరగతి జీవితం ఆమె నిలువెత్తునా స్పష్టంగా కనిపిస్తున్నది.

"కాలం గాని కాలంలో ఇదేం మాయదారి వాన !? అమ్మా ముత్యాలమ్మ తల్లీ నీవే దిక్కు... పంట కోతకొచ్చింది. ఈ వాన మా కొంప ముంచేటట్టు ఉంది. ఇప్పటికే మా బతుకులు పచ్చిపుండై ఉన్నయి. నీవే కళ్ళు తెరిచి కాపాడుతల్లీ. పంట చేతికి రాగానే బెల్లం గారెలతో నీ దగ్గరకి వస్తా.... అమ్మా మాయమ్మా..... ముత్యాలమ్మా " గుండె జారిపోతున్న బాధతో ఆర్ద్రంగా నమ్మిన తల్లిని వేడుకుంటున్నది ఆమె.

"తుంపర వానేగా... తగ్గిపోతుంది. నువ్వేం టెన్షను పడొద్దు " లోపల నుండి ఆమెను ఉద్దేశిస్తూ ఒక గంభీరమైన మగగొంతు వినిపించింది. అతడు ఆమె భర్త మన్యంకొండ. వయసు అరవైకి దగ్గరగా ఉంటుంది.

ఆమె అతడి మాటలు విన్నది. కానీ పట్టించుకోలేదు. ఆకాశం వైపు చూస్తూ చేతులు జోడించి – "వాన దేవుడా వెళ్ళిపో! మా దీనుల పొట్ట కొట్టకుండా వెళ్ళిపో" వేడుకోవడం మొదలెట్టింది.

"ప్రభావతీ...! చెప్తుంటే వినబడలేదా !?" లోపలనుండి మళ్ళీ వినిపించింది గొంతు.

అంతలో ....

ఉన్నట్టుండి ఒక్కసారిగా పెరిగింది వాన. అందుకు తోడుగా ఉరుములు మెరుపులు గాలి కూడా విజృంభించాయి.

" అయ్యో వానదేవా ! కనికరం లేదా తండ్రీ. ముత్యాలమ్మ తల్లీ నువ్వు కూడా నా మొర వినలేదా!?" వాపోయింది ప్రభావతమ్మ.

"వాన నువ్వు వద్దంటే ఆగేది కాదు, రమ్మంటే వచ్చేది కాదు. ముందు నువ్వు లోపలికి రా ! బయటనిలబడొద్దు" లోపలనుండి మళ్ళీ వినిపించింది.

ఈ మారు ప్రభావతి లోపలికి తిరిగి చూసింది. అప్పటికి ఆమె కళ్ళ నిండా దుఃఖం తాలూకు ఎర్రని జీరలు కమ్ముకుని ఉన్నాయి.

"నాలో ధైర్యం కోసం ఏదో ఒకటి చెప్తున్నావు. ఒట్టి తుంపర అంటావు. ఆగేది కాదు వచ్చేది కాదు అంటావు. నువ్వు ఇట్లా ఏదో ఒకటి చెప్పినంత మాత్రానా బాధ తగ్గుతుందా? పోనీ నిజంగా నీవు ధైర్యంగా ఉన్నావా? " బయటినుండే గట్టిగా

అడిగింది.

లోపలి నుండి బదులు లేదు.

ప్రభావతమ్మ కూడా ఇంకేం మాట్లాడలేదు. పొంగుకొస్తున్న దుఃఖాన్ని గొంతులో అప్పుకుంటూ తానే లోపలికి నడిచింది.

లోపల గదిలో...

కిటికీ పక్కగా వేసివున్న మంచం మీద కూర్చుని బయటకు చూస్తూ ఉన్నాడు మన్యంకొండ. మంచం పక్కనే చక్రాల కుర్చీ ఉన్నది. అతడిని గమనిస్తే.... పూర్తిగా నెరసిన జుట్టుతో ఎముకల గూడును తలపిస్తున్న బక్క పలుచని బలహీన శరీరంతో డెబ్బై ఏండ్లలో కనిపిస్తున్నాడు. కాళ్ళల్లో, చేతులల్లో సత్తువలేదనే సంగతి స్పష్టంగా అర్థం అవుతున్నది.

ప్రభావతమ్మ వెళ్లి మంచం మీద అతడి పాదాల వద్ద కూర్చుంది. దుఃఖం....దిగాలు....రెండూ కలగలసిన ఆమె ముఖంలో ఇప్పుడు పూర్తిగా శూన్యం ఆవహించి ఉన్నది.

అతడి పరిస్థితి కూడా అంతే ! అయినప్పటికీ భార్యను ధైర్యపరిచేందుకు ప్రయత్నం చేస్తున్నాడు.

"బాధ పడొద్దు ప్రభావతీ ! ఇదంతా కర్మ . అనుభవించాల్సిందే. తప్పదు.. ఏది కూడా మన చేతిలో లేదు. ఎట్లా జరిగేది ఉంటే అట్లనే జరుగుతుంది. దేని గురించి గూడా ఎక్కువ ఆలోచన చేయొద్దు... ఆరోగ్యం పాడుచేసుకోవద్దు..నా బతుకా ఉన్నా లేనట్టే. పిల్లలకు వున్న ఒక్క ఆదెరువు నీవే.. నీవు గూడా ఇట్లా బాధ పడి నీకేమైనా జరిగితే పిల్లల బతుకు బుడం తెగిన చెట్టే..."

చెప్పుకుపోతున్నాడు మన్యంకొండ.

ప్రభావతమ్మ మధ్యలోనే అందుకుంటూ –

"ఎన్నాళ్ళు అనుభవించాలి ? దీనికి అంతం లేదా? ఇంత పాపమా? లోకంలో మనమే పాపం చేసుకున్నామా? ఒకవైపు పక్షవాతం వచ్చి నీవు మంచం పాలైతివి. మనిషివి ఆగమైపోతివి. ఇది చాలదాన్నట్టు మునుపు కరువు... ఇప్పుడు కాలంగాని కాలంలో వర్షం. ఇన్ని జూసుకుంటూ ఎట్లా బతకాలే? తిన్నది కూడా ఒంటబడ్తలేదు" విలవిలలాడిపోయింది.

అందుకు మన్యంకొండ ఏం మాట్లాడలేదు కిటికీలోంచి బయటకు చూస్తూ తనలో తనే నిశ్శబ్దంగా కుమిలిపోతున్నాడు.

"వంద కిలోల మనిషివి.... నలభై కిల్లోల పిట్టపిసక అయిపోతివి. చూస్తుంటే గుండె తరుక్కుపోతుంది. నువ్వు ఎప్పట్లా బయికాడికి పోవాలని, పనిచేసుకోవాలని, నీకోసం నేను సద్ది తీసుకురావాలని కండ్లల్ల ఒత్తులు పెట్టుకుని ఎదురుచూస్తున్న. దేవుడేమో కక్ష గట్టిండు. ఎన్ని మొక్కులు... ఎన్ని ముడుపులు....." ప్రభావతమ్మనే తిరిగి కల్పించుకుంది. కానీ పూర్తిగా మాట్లాడలేకపోయింది. దుఃఖంతో గొంతు పూడుకుపోతుంటే మాటల్ని అర్ధాంతరంగా ఆపేసింది.

అంతలో... గూట్లో ఛార్జింగ్ పెట్టివున్న సెల్ ఫోన్ మోగింది. వెంటనే వెళ్లి ఎవ్వరా అన్నట్టుగా పరిశీలనగా చూసింది ప్రభావతమ్మ. పాత మ్యానువల్ సెల్ ఫోన్, పైగా స్క్రీన్ పగిలి మసకబారి ఉంది. పేర్లు స్పష్టంగా కనిపించడం లేదు. అయినప్పటికీ

ఎక్కడి నుండి ఫోన్ వచ్చిందో సులువుగా గుర్తించింది.

"రాజూ" వెంటనే ఆదుర్దాగా ఫోన్ లిఫ్ట్ చేసింది.

"అమ్మా. ఇంటర్వ్యూ అయిపోయింది. వాళ్ళు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం జెప్పిన. ఈసారి ఉద్యోగం కొట్టుకున్నట్టే...." అవుతలి నుండి రాజు ఉత్సాహంగా మాట్లాడుతున్నాడు.

"సంతోషం బిడ్డా....నీ ఫోన్ కోసమే ఎదురుచూస్తుండా..." ప్రభావతమ్మలో ఉద్వేగం ఒక్కసారిగా పొంగిపొరలింది.

కొడుకు వద్ద నుండి వచ్చిన ఫోన్ రాగానే తండ్రి మన్యంకొండలోనూ ఆదుర్దా ఎగిసిపడింది. మాటలు వింటూ భార్యనే ఆత్రంగా చూస్తున్నాడు.

"నాయిన బాగున్నడా? నాయిన చెవి వద్ద ఫోన్ పెట్టు" ఆ వెంటనే అవతలనుండి అదే ఉత్సాహంతో చెప్పాడు ఇరవై ఆరేళ్ళ రాజు.

ప్రభావతమ్మ ఆలస్యం చేయలేదు. వెంటనే వెనక్కి కదిలి ఫోన్ ను భర్త చెవి వద్ద పెట్టింది.

"నాయినా రాజూ" గుండెల నిండా పిలిచాడు.

"నాయినా ఉద్యోగం వచ్చినట్టే. సాయంత్రం బస్సుకు ఊరొస్తా..." చెప్పాడు రాజు.

"ఇక్కడ పెద్ద వాన కురుస్తుంది బిడ్డా. ఊరు వాగు పొంగితే రాకపోకలు ఆగిపోతాయి. చూసుకుని బయలుదేరు "

చెప్పాడు మన్యంకొండ.

ఆ మాట వినగానే అవుతలి నుండి రాజు కొన్ని క్షణాలు ఆగిపోయాడు. ఆ తర్వాత నెమ్మదిగా

"అమ్మకు ఫోన్ ఇవ్వు నాయినా" అన్నాడు. ఆ సమయంలో రాజు గొంతులో ఆందోళన ఒలికింది.

ఆ విషయం మన్యంకొండ గమనించాడు. ఆ ఆందోళన ఎందుకో మన్యంకొండకు తెలియంది కాదు. అందుకే తానే మాట్లాడుతూ.....

"వరి సేను గురించి నువ్వేం దిగులు పడొద్దురా. ఏం కాలేదు అంతా బాగుంది..." చెప్పాడు.

"సరే నాయినా" అంటూ రాజు ఫోన్ పెట్టేసాడు. కొడుకు బాధను అర్థం చేసుకుంటూ

"హు.." మన్యంకొండ ఒక్కసారిగా నిట్టూర్చాడు. తర్వాత చెవి వద్దనుండి ఫోన్ తీసేయమన్నట్టుగా తలను కదిలించాడు.

ప్రభావతమ్మకు కూడా అవుతల తన బిడ్డ అర్థం అయ్యింది.

"అలో రాజూ" ఇంకా లైన్లో ఉన్నాడేమో అనుకుంటూ ఫోన్ తన చెవి వద్ద పెట్టుకుంది. కొడుకు ఫోన్ పెట్టేసాడని అర్థం అయ్యింది.

"తిరిగి ఫోన్ చేద్దామంటే బిల్లు లేదు. ప్చ్.... వాన ఎలిసాక మడిగే సాయిబు వద్ద వొంద రూపాయలు వేయించుకొస్తా" అంటూ వెళ్లి ఫోన్ తిరిగి ఛార్జింగ్ పెట్టింది.

అప్పటికి వాన జాడివాన్నై ఉన్నది. ఇంట్లో మూలల్లో చిట చిట పోటుకు ప్రారంభం అయ్యింది. ప్రభావతమ్మ పోటుకు పెడుతున్న చోట్లల్లో గిన్నెలు డబ్బాలు ఉంచింది. తర్వాత తిరిగి వరండాలోకి వెళ్లి వర్షాన్నే చూస్తూ దీనంగా నిలబడి పోయింది.

కాసేపటి తర్వాత.....

తిరిగి ఫోన్ మోగింది.

పరుగున లోపలికి వెళ్లి, ఎవ్వరా అన్నట్టుగా చూసి, తన కూతురుగా గుర్తించి...... " అమ్మడు... ఎట్లున్నవు బిడ్డా?" ప్రేమగా అడిగింది.

"నాయిన ఆరోగ్యం ఎట్లా ఉంది? " అవుతలి నుండి అడిగింది అమ్మడు.

"నాయిన మంచిగున్నడు. నీవు మంచిగ ఉంటే నాయిన మంచిగ ఉన్నట్టే" చెప్పింది ప్రభావతమ్మ.

"ఏం మంచిగ అమ్మా. పెండ్లప్పుడు ఒప్పుకున్న లక్షరూపాయలు కోసం ఒకటే సతాయింపు...." బరువుగా చెప్పింది ఇరవై ఏండ్ల అమ్మడు.

ఆ మాట ప్రభావతమ్మ గుండెల్లోకి బలంగా దిగింది.

తన బిడ్డ అత్త గారింట్లో ఎట్లా ఉందో అనే అందోళన ఆమెను నిలువునా పీడించింది.

"నువ్వేం భయపడొద్దు అమ్మడు. మాట తప్పేది ఏం లేదు. కాపోతే సర్దుబాటు జరగాలే..." కూతురికి ధైర్యం చెప్పింది ప్రభావతమ్మ.

అందుకు అవుతల నుండి అమ్మడు ఏదో మాట్లాడబోయింది. అంతలో..... ఫోన్ అమ్మడు నుండి అల్లుడు లాక్కున్నాడు.

"కథలు చెప్పొద్దు. మాట దాటేయ్యొద్దు. పైసలు ఇచ్చేవరకు మీ బిడ్డ మీ ఇంటికి రాదు. మీరు ఫోన్లు గూడా చేయొద్దు.." కటువుగా మాట్లాడాడు.

"అల్లుడూ..." అంటూ ప్రభావతమ్మ అల్లుడికి సర్ది చెప్పబోయింది.

"ఏం మాట్లాడొద్దు. పెండ్లయి రెండేండ్ల పొద్దాయే. ఎప్పటికప్పుడు మాట దాట వేస్తున్నారు గానీ మాట నిలబెట్టుకుంటున్నది లేదు. సిగ్గు ఉండాలే " విచక్షణ లేకుండా మాట్లాడి ఫోన్ పెట్టేసాడు అల్లుడు.

ప్రభావతమ్మ మనసు ఆల్లకల్లోలమై పోయింది. అంతా విన్న మన్యంకొండ కూతురు కోసం తనలో తను దుఃఖించసాగాడు.

★ ★ ★

రాత్రి సమయం....

తన గదిలో గోడకు ఆనుకుని నేలమీద దిగాలుగా కూర్చుని ఉన్నాడు రాజు.

స్నేహితుడు బాలు వంటకట్ట ముందు నిలబడి వంట చేస్తున్నాడు.

"ఈసారి గూడా పంట వాన పాలయ్యిందిరా . బాధ అనిపిస్తుంది.ఈ పరిస్థితిలో అమ్మను డబ్బులు ఎట్లా ఆడగాలో అర్థం కావడం లేదు. పోయినేడు ఇదే ఉద్యోగం కోసం మన

రవిగాడు రెండున్నరలక్షలు కట్టిండు. ఇప్పుడు నెలకు ముప్పై వేల జీతం ఎత్తుతూ దర్జాగా బతుకుతున్నడు. నాకు మార్కులు ఎక్కువున్నాయి కాబట్టి రెండులక్షలు అడిగినా, ఇచ్చుకోలేని పరిస్థితి. గవర్నమెంట్ జాబులు పడట్లేదు. వాటికోసం ఎదురు చూసుకుంటూ టైం వేస్టు చేసుకోలేము. ఇది ప్రయివేటు అయినా మంచి జాబు. పోగొట్టుకోవడం ఇష్టం లేదు.... " రాజు అదేపనిగా కుమిలిపోయాడు.

" బాధ పడొద్దురా ! .రవిగాడినే అప్పు అడిగిజూడు... " సలహా ఇచ్చాడు బాలు.

" వాడితో దొరకవురా. వాళ్ళ నాయిన జేసిన అప్పులకే వాడి జీతం సరిపోతలేదు " అన్నాడు రాజు.

" సర్లే ! మరో ప్రయత్నం ఏదైనా చేద్దాం గానీ " అన్నాడు బాలు.

" ఇంకేం జేస్తావురా? "" బాలు వైపు చూసాడు రాజు.

" మీవి ఎర్రరేగళ్ళు. మంచి పొలాలు. మా ఊర్లో షావుకారి పొలాల కాగితాలు పెట్టుకుని అప్పు ఇస్తాడు. అప్పు తెగేవరకు తానే సేద్యం చేయిస్తాడు. మన పొలం మీద బ్యాంకులో అప్పు ఉన్నా షావుకారికి

సంబంధం లేదు. తన అప్పు, వడ్డీ, పెట్టుబడి, అన్నీ తీరేవరకు యాడాది రెండేండ్ల వరకు సేద్యం చేయిస్తాడు. ఇది బెస్ట్ ఆప్షన్ రా...." చెప్పుకొచ్చాడు బాలు.

రాజు ఇంకేం మాట్లాడలేదు. ఆలోచనలో పడిపోయాడు.

★ ★ ★

నగరం.....

డాక్టర్స్ కాలనీ.....

డూప్లెక్స్ బంగ్లాలో హోం థియేటర్ ముందు సోఫాలో కూర్చొని బీబీసీ న్యూస్ చూస్తున్నాడు సీనియర్ డాక్టర్ మహిపాల్.

" డ్యాడ్... నా బర్త్డే కు గిఫ్ట్ ఇస్తా అన్నావు. గుర్తుకు ఉంది కదా. నా బర్త్డే ఇంకా వన్ మంత్ ఉంది " గుర్తుకు చేస్తూ వచ్చి తండ్రి పక్కలో కూర్చుంది

ఇరవై నాలుగేళ్ల అఖిల.

" ఇంకొన్ని నెలల్లో డాక్టర్ అయిపోతున్నావు. డాక్టర్ అఖిల డాటరాఫ్ డాక్టర్ మహిపాల్....నాకు ఎంత గర్వకారణం...!? ఆఫ్టరాల్ నువ్వు అడిగిన గిఫ్ట్ ఇప్పించలేనా బేటా ! నువ్వు గుర్తుకు చేయాల్సిన అవసరం లేదు "

గుండెల నిండుగా పలికాడు డాక్టర్ మహిపాల్.

" థాంక్యూ డ్యాడ్ "అఖిల గొంతులో సంతోషం ఎగిసింది.

" ఒక బెస్ట్ హాస్పిటల్ నడుపుతున్న ఒక మంచి డాక్టర్ గా నాకు పేరు ఉన్నది. ఆ పేరు నువ్వు నిలబెట్టాలి. అందరూ నన్ను దేవుడు అంటారు. నిన్ను దేవత అనాలి... గుర్తుపెట్టుకో " కూతురు భుజాల చుట్టూ చేయి వేస్తూ చెప్పాడు అతడు.

" ష్యూర్ " అంది అఖిల.

అంతలో ముందున్న టీపాయ్ మీద సెల్ ఫోన్ మోగింది.

" యెస్... " ఫోన్ లిఫ్ట్ చేసాడు అతడు.

" సర్ ఎమర్జెన్సీ కేసు. స్టార్ట్ ఇమ్మిడియట్లీ " అవుతలి నుండి జూనియర్ డాక్టర్ అరవింద్ గొంతు వినబడింది.

" ఓహ్.. గాడ్ " అంటూ సోఫాలోంచి ఒక్క ఉదుటన లేచి హడావుడిగా లోపలికి నడిచాడు .నిముషాల్లో దుస్తులు మార్చుకుని బయటకు నడిచాడు.

ఏదో సీరియస్ కేసుగా అఖిలకు అర్థం అయ్యింది.

" టేక్ కేర్ డ్యాడ్" వెళ్తున్న తండ్రి వెనకాలే నడుస్తూ చెప్పింది.

" ఒకే ఒకే... " చెప్తూ కారిడార్ లోకి నడిచాడు అతడు గమనించిన డ్రైవర్ ఆలస్యం చేయకుండా కారు సిద్ధం చేసాడు. అతడు కార్ ఎక్కి వెనక సీట్లో కూర్చున్నాడు. మరుక్షణం కారు ముందుకు కదిలింది. గేటు వద్ద వాచ్ మెన్ అదివరకే అప్రమత్తం అయి గేటు తీసి వున్నాడు. కారు వేగంగా గేటు దాటి కిలో మీటర్ దూరంలో ఉన్న సొంత ఆసుపత్రి " అఖిల ప్రజా వైద్యశాల " వైపు వేగంగా కదిలింది.

★ ★ ★

కారు ఐదు నిముషాల్లో ఆసుపత్రి చేరుకుంది.ఆసుపత్రి ముందు అంబులెన్సు నిలబడి ఉంది. ఆసుపత్రి సిబ్బంది హడావుడి చేస్తున్నారు. కారు దిగిన డాక్టర్ మహిపాల్ ఆలస్యం చేయకుండా అంబులెన్సు వైపు నడిచాడు. పేషేంట్ ను గమనించాడు.

అంబులెన్సు పడక మీద అపస్మారక పరిస్థితిలో పడుకుని ఆయాస పాడుతున్నాడు మ..న్యం...కొం...డ....! అతడికి ఆక్సిజన్ పెట్టి ఉన్నారు. పక్కనే శోకదేవతలా ప్రభావతమ్మ కూర్చుని ఉన్నది.

డాక్టర్ ను చూడగానే " సారూ... మీరే దిక్కు..." అంటూ ఒక్కసారిగా గొల్లుమంది.

"అమ్మా ఏడవొద్దు. పేషంట్ ఎదురుగా ఏమి ఇది? ఇందాకటి నుండి చెప్తున్న అర్థం కావడం లేదా? " అక్కడే ఉన్న నర్సు శాంతి ప్రభావతమ్మను గట్టిగా వారించింది.

" ఇందాక అరవింద్ సారు వచ్చి చూసినప్పుడు కూడా ఇట్లాగే ఏడుస్తుంది. పెషేంట్ కు మంచిది కాదమ్మా... ధైర్యం కోల్పోతాడు అంటే వినడం లేదు...." మరో నర్సు రాధ కల్పించుకుంది.

డాక్టర్ ఎవ్వరి మాటలు పట్టించుకోలేదు. చూపులతోనే మన్యంకొండను కొంతసేపు గమనించాడు.

తర్వాత నర్సు శాంతి వైపు వైపు చూస్తూ...." స్టార్ట్ ట్రీట్మెంట్.... టేక్ కేర్..." చెప్పి వడివడిగా ఆసుపత్రి లోపలికి నడిచాడు.

ఆ వెంటనే డాక్టర్ అరవింద్ అక్కడికి వచ్చాడు.

" సరైన సమయానికి తీసుకు వచ్చారు. అర్జంటుగా ట్రీట్మెంట్ స్టార్ట్ చేయాలి " ప్రభావతమ్మకు చెప్పి, ఆ వెంటనే శాంతి వైపు చూస్తూ.... " క్విక్ " అన్నాడు.

" ఒకే సార్ " అంటూ వెంటనే తోటి నర్సు రాధ వద్ద నుండి సిరంజీ – మందు తీసుకొని , మన్యంకొండ వైపు కదిలింది.

ఇంకేం మాట్లాడకుండా అక్కడి నుండి వెళ్ళిపోయాడు డాక్టర్ అరవింద్ .

శాంతి నెమ్మదిగా మన్యంకొండకు సిరంజి గుచ్చింది. తర్వాత కాటన్ వత్తుతూ....

" వెంటనే లక్ష రూపాయలు సిద్ధం చేసుకోండమ్మా " చెప్పింది .

ఆమాటకు ప్రభావతమ్మ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అయినప్పటికీ ధైర్యం కోల్పోలేదు.

" పైసలకు వెనకాడేది ఏం లేదు సిస్టర్ . ఇప్పటికి ఇరవై వేలు ఉన్నవి తీసుకోండి. ఇప్పుడు మా కొడుకు వస్తాడు అన్నీ చూసుకుంటాడు " అంటూనే పక్కనే ఉన్న చేయి సంచి పర్సు బయటకు తీసింది.

" మీ కొడుకు ఎంత సేపట్లో వస్తాడు? " అడిగింది శాంతి.

" ఈపాటికి వొచ్చేయాలే.... " ప్రభావతమ్మ అంటూంటేనే అక్కడికి వేగంగా మోటార్ సైకిల్ వచ్చి ఆగింది. బాలు,రాజు, ఇద్దరూ అక్కడికి చేరుకున్నారు.

వెనక సీట్లో కూర్చుని ఉన్న రాజు ఒక్క ఉదుటన బండి దిగాడు.

" రాజూ " కొడుకుని చూడగానే ప్రభావతమ్మకు దుఃఖం ముంచుకొచ్చింది.

" అమ్మా " అంబులెన్సు వద్దకు రాజు ఆదుర్దాగా వచ్చి , తండ్రి పరిస్థితి చూసి కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

" మీ కొడుకు ఇతడేనా? " రాజును చూయిస్తూ ప్రభావతమ్మ వైపు చూసింది నర్సు శాంతి.

" ఆవును సిస్టర్ " అంది ప్రభావతమ్మ.

" మీతో మాట్లాడాలి. రండి " అంటూ ఆసుపత్రి లోపలికి నడిచింది శాంతి.

వెనకాలే నడిచాడు రాజు. బాలు అక్కడే ప్రభావతమ్మకు తోడుగా నిలబడి పోయాడు.

" ఏ ఊరు మీది? " లోపల హాల్లో రెసెప్షన్ సీట్లో కూర్చుంటూ అడిగింది శాంతి.

" అడ్డాకల్ మేడం " చెప్పాడు రాజు.

" నువ్వేం చేస్తుంటావు? "అడిగింది.

"ఎంకామ్ చదివాను.ప్రస్తుతం ప్రయివేటు కాలేజీ లో చేస్తున్న..."

" సాలరీ? "

" పదివేలు "

" మీ ఫాదర్ పరిస్థితి చూస్తుంటే బెడ్ రీడర్ లా ఉన్నాడు. మీ ఫ్యామిలీ ఇన్కమ్ సోర్స్ ఏంది? "

" వ్యవసాయం మేడం "

" ఒకే. మరి ఫాదర్ హాస్పిటల్ ఖర్చులు మీరు భరించుకోగలరా? ఎందుకు అడుగుతున్నాను అంటే ఇప్పుడు

ఒక లక్ష కట్టి బెడ్ రిజర్వ్ చేసుకుంటే, మేము మిగతా ట్రీట్మెంట్ స్టార్ట్ చేస్తాము. మిగతా ఖర్చులు పేషంట్ కండిషన్ బట్టి ఏ రోజు ఖర్చులు ఆ రోజు సపరేటు ఉంటాయి " చెప్పుకొచ్చింది శాంతి.

" ఎన్ని రోజులు హాస్పిటల్ లో ఉండాల్సి వస్తుంది. ఎంత ఖర్చు అవుతుంది మేడం? " ఆదుర్దాగా అడిగాడు రాజు.

" అది ఖచ్చితంగా నేను చెప్పగలను ? అదంతా పేషంట్ పరిస్థితిని బట్టి ఉంటుంది " అంది శాంతి.

" సరే మేడం. ఖర్చు ఎంతయినా ఫరవాలేదు. మా నాయనకు మాకు దక్కాలి " అన్నాడు రాజు. అప్పటికి రాజు ముఖంలో భయం ఆందోళనలు నిండి ఉన్నాయి.

" మహిపాల్ సర్ గురించి మీకు తెలిసే ఉంటుంది. అమెరికాలో చదివి వచ్చాడు. ఈ సిటీలో ఉన్న టెన్ బెస్ట్ హాస్పిటల్స్ లో ఇది ఒకటి. ఇక్కడ ప్రాణాలకు గ్యారంటీ ఉంటుంది. ఫారిన్ ట్రీట్మెంట్ రీజనబుల్ ఫీజులు ఉంటాయి. మాములుగా చూడ్డానికి ఎక్కువ ఫీజు అనిపిస్తుంది. కానీ ఫారిన్ ట్రీట్మెంట్. బయట ఐదు లక్షలు అయ్యేది సర్ రెండు లక్షలకి చేస్తాడు.మీ ఫాదర్ చాలా వీక్ గా ఉన్నాడు. సర్ దగ్గర ట్రీట్మెంట్ తీసుకోండి. ఎట్లాంటి ప్రమాదం ఉండదు. లేదంటే మీ ఇష్టం " వివరంగా చెప్పింది శాంతి.

" డబ్బు పోయినా ఫర్వాలేదు మేడం. వెనకాడేది లేదు. లక్ష రూపాయలు సాయంత్రం వరకు తీసుకొస్తా. ట్రీట్మెంట్ మొదలెట్టండి మేడం " క్షణక్షణానికి ఆందోళన అధికం అవుతుంటే రాజు తట్టుకోలేక పోతున్నాడు.

" అట్లా ఉండదు. ఫీజు చెల్లించాకే ట్రీట్మెంట్ ఉంటుంది. ఇది హాస్పిటల్ రూలు... "

" ప్లీజ్ మేడం "

" నోనో.. నేనేం చేయలేను. నేను ఇక్కడ ఒక ఉద్యోగిని మాత్రమే "

" ప్లీజ్ మేడం " రాజు దుఃఖాన్ని ఆపుకున్నాడు.

" సార్ వాడే మెడిసన్స్ దగ్గరనుండి ఎక్విప్ మెంట్స్ వరకు అన్నీ ఇంపార్టెడ్. సార్ ఫ్రీగా వైద్యం చేయగలడు గానీ , ఫ్రీగా మందులు ఇవ్వలేడు కదా !? ఇప్పుడు మీరు కట్టే లక్ష రూపాయలు మందులకే సరిపోతాయి. పేరుకే బెడ్ రిజర్వేషన్ అంటాం అంతే... " నిక్కచ్చిగా చెప్పింది శాంతి.

అందుకు రాజు ఏదో అనబోయాడు.

"చెప్పాల్సింది చెప్పాను. ఇంక మీరు ఆలోచించుకోండి... పెద్దాయన ఆయాసపడ్తున్నాడు. టైం వేస్ట్ చేసుకోవద్దు. మహబూబ్ నగర్ శుభం హాస్పిటల్ నుండి డాక్టర్ సిద్దార్థ రికమెండ్ ఉంది కాబట్టి లక్షన్నర కట్టాల్సింది లక్ష అడుగుతున్నాం " అంటూనే అక్కడి నుండి ఏదో ఫైల్ తీసుకుని సమీపంలో ఉన్న డాక్టర్ క్యాబిన్ లోకి నడిచింది నర్సు శాంతి.

అక్కడే తన పని చేసుకుంటా అంతా వింటున్నా ఆయమ్మలు తనలో తాను బాధ పడిపోతూ స్వరం తగ్గించి మాట్లాడుకుంటున్నారు.

"ఆసుపత్రుల్లో పని లేకుంటే పోయింది. ప్రతి రోజూ గోసలు చూడాల్సి వొస్తుంది..."

" పైసలు ఉంటేనే బతుకు. పైసనే పరమాత్మ... "

" పేసెంటు ఎదురుగా ఏడిస్తే పేసెంటు ధైర్నం కోల్పోతాడు అని తిడుతుండరు. మరి పేసెంటు ఎదురుగా పైసలు అడుగుతుండరు. పైసలు అడిగితే ధైర్నం కోల్పోడా!? "

మరోవైపు – రాజు మెల్లగా బయటకు నడిచాడు.

" అమ్మా ఆ దండ ఇవ్వు " తల్లి పుస్తెలతాడు వైపు చూపించాడు. ప్రభావతమ్మ మారు మాట్లాడలేదు. పుస్తెలతాడును ఒకమారు కండ్లకు అద్దుకుని మెడలోంచి తీసి కొడుకు చేతుల్లో పెట్టింది. చెప్పకనే పరిస్థితి అర్థం చేసుకున్న బాలు అప్పటికి బండి స్టార్ట్ చేసాడు.

" అమ్మా జాగ్రత్త " ఏడుపు గొంతుకతో చెప్పి వేగంగా వెళ్లి బాలు వెనకాల ఎక్కి కూర్చున్నాడు రాజు.

మరుక్షణం బండి ముందుకు కదిలింది.

★ ★ ★

రాజు పాన్ బ్రోకర్ షాపులో కూర్చుని ఉన్నాడు.

బాలు బయట ఫోన్ మాట్లాడు తున్నాడు.

" అరే మచ్చా రాజు గాడు ఎక్కడున్నాడు? వాళ్ళ నాయినకు ఎట్లుంది? అస్సలు ఏమయ్యింది?" అవుతలి నుండి మరో స్నేహితుడు రవి ఆదుర్దాగా అడుగుతున్నాడు.

" ఏమోరా పరిస్థితి సీరియస్ అనిపిస్తుంది. పొద్దున నాష్ట తినిపించిన తర్వాత సడన్ గా వాంటింగు అయ్యిందంట. ఆ తర్వాత ఊపిరి ఇబ్బంది అయ్యిందంట. ఆంటీ వెంటనే కారు మాట్లాడుకుని పాలమూరు దవఖానాకు తోలుకుపోతే అక్కడ పట్టలేదు. ఇక్కడ సిటీలో అఖిల ప్రజా వైద్యశాలకు రికమెండ్ చేసింగ్రు.... "

" మరి పొద్దుట నుండి నాకు ఫోన్ చేయలేదు ఏంద్రా? నాకు ఇప్పుడే తెలుస్తుంది "

" తెలిస్తే రాజుగాడు బండి మీద పరుగెత్తుకు వస్తాడని, సిటీలోకి వొచ్చాక విషయం చెప్పింది ఆంటీ...." చెప్పుకొచ్చాడు బాలు.

" అయ్యో.... " అంటూ నొచ్చుకుని – " అంకుల్ ముందే వీక్ ఉంటాడు. ఇప్పుడు బాగానే ఉన్నాడు కదా " అడిగాడు రవి.

" ఆ బాగానే ఉన్నాడు. ట్రీట్మెంట్ కోసం లక్ష అవసరమై ఇక్కడికి వొచ్చినం. ఇంకెన్ని అవసరం అవుతాయో ఏమో... మనోడు వద్ద బ్యాంకు బ్యాలెన్సు తిప్పి కొడితే యాభైవేలు గూడా లేవు. అయినా వాడికొచ్చే జీతం ఎంత ? వెనకేసుకునేది ఎంత? " వాపోయాడు బాలు.

"పాపం వాడు బ్యాంకులో జాబు కోసం రెండు లక్షలు కావాలని ప్రయత్నం చేస్తున్నడు. అనుకోకుండా ఈ పరిస్థితి...." రవి కూడా వాపోయాడు.

అంతలో రాజు చేతిలో డబ్బుతో బయటకు వచ్చాడు.

" అరవై వేలు వచ్చాయిరా! నా వద్ద నలభై వేలు ఉన్నాయి " రాగానే చెప్పాడు.

★ ★ ★

వారం రోజులు గడిచాయి. మన్యంకొండ ఆసుపత్రిలోనే ఉన్నాడు. అప్పటికి పదిలక్షలు వరకు ఖర్చు అయ్యింది. ఇంకా ఎంత ఖర్చు అవుతుందో తెలియదు. ఎప్పుడు డిశ్చార్జ్ అవుతుందో తెలియదు.

అప్పటికి బాలు సూచించిన శావుకారు వద్ద పొలం తాకట్టు పెట్టాడు రాజు. ఆ విషయమై షావుకారితో

ఒప్పంద పత్రం రాసుకున్నాడు.

" మా తండ్రి మన్యంకొండ ఆరోగ్యపరిస్థితి దృష్ట్యా షావుకారు ఈరయ్యశెట్టి వద్ద షరతుల ప్రకారం యాభై లక్షలు విలువజేసే మా రెండెకరాల పొలాన్ని తాకట్టు పెట్టడం జరిగింది. ఆసుపత్రి ఖర్చులు లక్షల్లో పెరుగుతున్న నేపథ్యంలో పదహైదు లక్షలవరకు ముట్టజెప్పవలసిందిగా ఒప్పందం కుదరడం జరిగింది. అంతకు మించినచో పొలాన్ని అమ్మకం కిందికి ముట్టజెబుతాము " అనేది ఒప్పంద పత్రం సారాంశం.

రాజు, ప్రభావతమ్మ, అమ్మడు, ముగ్గురూ తట్టుకోలేకపోతున్నారు. ఒకవైపు పూర్తిగా చేయిదాటిన పరిస్థితులు, మరోవైపు నీళ్లలా ఖర్చు అవుతున్న లక్షల రూపాయలు , రెండింటిని శాసిస్తున్న పేదరికం..... అసహాయత...! ఈ పరిస్థితుల్లో తాతల కాలం నాటి పొలాన్ని వదులుకోవాల్సి వస్తుందేమో అనే ఆలోచనను భరించలేకపోతున్నారు. ఈ పరిస్థితిలో రాజు తల్లికి చెల్లికి తెలియకుండా డాక్టర్ మహిపాల్ ను కలిసాడు. తన పరిస్థితి మొత్తం వివరించాడు.

అంతావిన్న డాక్టర్ మహిపాల్ కాసేపు దీర్ఘంగా అలోచించి తర్వాత నెమ్మదిగా పెదవి విప్పాడు.

" మీ తండ్రి గారి కోసం యాభైలక్షల విలువ జేసే పొలాన్ని వదులు కోవాల్సి వస్తుందేమో అనేదే మీ బాధ కదా !? అంతకు మించిన ధర వస్తే ఏమంటారు? " అడిగాడు.

" ఊరికి కొంచం దూరంగా ఉన్నాయి కాబట్టి ఇరవైఐదు లక్షలు ఎకరా పలుకుతున్నాయి సార్. అదే దగ్గరైతే కోటి ఇస్తారు. నేషనల్ హైవే కదా సార్. "అన్నాడు రాజు.

" మీ తండ్రి గారి బాధలో నా మాట నువ్వు అర్థం చేసుకోలేదు. ఇరవై ఐదు లక్షలు ఎకరా అంటున్నావు కదా.... భూమి కోల్పోవడం ఇష్టం లేదు అంటున్నావు కదా.....ధర ఇరవై ఐదు లక్షలకు మించితే ఓకేనా? ఎందుకంటే మా స్నేహితుడు ఒకరు రియల్ ఎస్టేట్ చేస్తాడు. పోలాలు అమ్ముతాడు... కొంటాడు...! షావుకారుతో మీరు నష్ట పోవద్దని ఈ మాట చెప్తున్నాను.. " చెప్పాడు.

" అమ్మతో ఆలోచన చేస్తా సార్. అట్లాగే ఫీజులు కొంచం తగ్గించుకోండి సార్ " రాజు అభ్యర్థించాడు.

" ష్యూర్ " అంటూ రాజు భుజం తట్టాడు డాక్టర్

మహిపాల్.

రాజు అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

★ ★ ★

మరో వారం రోజుల తర్వాత –

తన తోటి డాక్టర్స్ అరవింద్, సిద్దార్థలతో కలిసి తన ఇంటి డాబా మీద , విశాలమైన గొడుగు కింద, మందు పార్టీ ఏర్పాటు చేసుకున్నాడు డాక్టర్ మహిపాల్. ముగ్గురూ ఫారిన్ విస్కీ ఒక్కో సిప్ చేస్తున్నారు. మహిపాల్ ఉత్సాహంగా ఉన్నాడు. ఆ ఉత్సాహంతో తన సంతోషాన్ని మిగతా ఇద్దరితో పంచుకుంటున్నాడు.

" ఈ మంత్ లో పేషంట్ నంబరు 26 . పేరు మన్యంకొండ ..! వీడు ఉంటాడో పోతాడో కాదు, ఖచ్చితంగా ఉంటాడు . కానీ నేను ట్రీట్మెంట్ ఇవ్వకపోతే మాత్రం పోతాడు అనే భయం వాళ్లలో కలిగించాను. నేను వాడిని బతికిస్తాను అనే నమ్మకం వాళ్ళ గుండెల నిండుగా హండ్రేడ్ పర్సెంట్ నిండిపోయింది. వాస్తవానికి మనకు తెలిసి ఆ ముసలాడికి ఏమి కాలేదు. పెరాలాసిస్ పేషంట్ కాబట్టి లంగ్ ఇన్ఫెక్షన్ తట్టుకోలేక పోయాడు. మనకు తెలిసి ఓ రెండు లక్షల్లో తగ్గిపోతుంది. కానీ పద్దెనిమిది లక్షలు చేసాను. అంటే పదహారు లక్షలు బెన్ ఫిట్. నేను అనుకున్న ప్రకారం ఆ పిల్లోడు అరవై లక్షలకు రెండు ఎకరాలు అమ్మాడు. అంటే నలభై నాలుగు లక్షలకే రెండు ఎకరాలు అమ్మినట్టు. వాడెవ్వడో షావుకారికి యాభైలక్షలకు అమ్ముతాను అన్నాడు.... ఆ ప్రకారం చూసినా మనకు ఆరు లక్షలు బెన్ ఫిట్ " గుండెల నిండుగా సంతోషంతో అంటూ తన ముందున్న ప్లేట్లో తందూరి చికెన్ ముక్కను అందుకున్నాడు డాక్టర్ మహిపాల్.

" మన వ్యాపారం ఎప్పటికీ ఇట్లాగే సాగాలి. లక్షలు.... కోట్లు.... మన జేబులు నింపాలి " విస్కీ గుటక గుటక సిప్ చేస్తూ అన్నాడు డాక్టర్ సిద్దార్థ.

" యా...యా....! " చికెన్ లాలీపాప్ నంజుకుంటూ అన్నాడు డాక్టర్ అరవింద్.

" నా బేబీ లక్కీఫెలో. నేషనల్ హైవేకు దగ్గరగా ల్యాండ్ దొరికింది. డాక్టర్ అవుతున్న సందర్భంగా ఈ పుట్టినరోజుకి గిఫ్ట్ గా ల్యాండ్ కొని ఇవ్వాలి అనుకున్నాను. పెషేంట్ల నుండి వచ్చిన డబ్బులతో ఎక్కడో ఒకచోట కొనాలి అనుకున్నాను. కానీ ఇట్లా పెషేంట్ వద్ద నుండే రాబడుతాను అనుకోలేదు. ఏది ఏమైనా నా బేబికి మంచి ఎర్రరేగడి పొలం దొరికింది. ఫ్యూచర్లో ఫామ్ హౌస్ కట్టి

డెవలప్ చేసుకోవచ్చు. నాకు సహకరించినందుకు మీక్కూడా మంచి పర్సంటేజ్ ఇచ్చాను కదా వృధా చేయకుండా ప్రాపర్టీ కొనండి.... " మళ్ళీ తన సంతోషం

వ్యక్తం చేసుకున్నాడు డాక్టర్ మహిపాల్.

★ ★ ★

అదే రోజు రాత్రి.....

తమ స్వంత గ్రామం అడ్డాకులలో.....

మన్యంకొండ బతికి ఇంటికి వచ్చిన సందర్భంగా.... ఆ కుటుంబం బంధుమిత్రులను పిలిచి విందు భోజనాలు ఏర్పాటు చేసి ఉన్నది. బంధువుల మధ్య కూర్చుని ప్రభావతమ్మ ఇట్లా మాట్లాడు తున్నది....

" అంతా మా అదృష్టం ! నా దేవుడు బతికి బట్ట కట్టడం కంటే పెద్ద అదృష్టం నాకు ఏముంది? భూమి పొతే పోయింది. మల్లా కొనుక్కోగలం. కానీ ప్రాణాలను తెచ్చుకోగలమా? ఆ డాక్టర్ నిజంగా దేవుడు! మా బాధ చూడలేక పదిలక్షలు ఎక్కువ బెట్టి కొన్నడు. లేదంటే ఆ షావుకారికి పది లక్షలు తక్కువ అమ్మి నష్టపోయేటోళ్ళం. వచ్చిన పైసలతో

నా కొడుక్కి ఉద్యోగం వస్తున్నది. నా బిడ్డ అమ్మడు కష్టం తీరింది.... ఆ డాక్టర్ ఎక్కడ ఉన్నా పిల్లాపాపలతో సల్లగా ఉండని.... "

ఆ మాటలు వింటూ ప్రకృతి బాధగా మూలిగింది. అందుకు ప్రతీకగా ఆకాశం నుండి ఓ చినుకు కన్నీరై రాలిపడింది.

(అయిపోయింది. ఈ కథ వ్యక్తిగతంగా ఏ వైద్యుడిని ఉద్దేశించింది కాదు. వైద్యో నారాయణో హరి ! కేవలం సమాజంలో అక్కడక్కడా జరుగుతున్న కొన్ని సంఘటనలు ఆధారంగా ఊహను జోడించి రాసిన కథ )

కథ

# ఆగమైతడు



- సిస్టర్ అనసూయ

తెల్లవారుజామున నాలుగు గంటలకు అలారం మోగుతుంది. "ఒరేయ్ చింటూ అలారం బంజేయరా" అని పడుకుంది శోభ.

చింటూ లేవలేదు అలారం బంజేయలేదు.

మరల శోభ "ఏందిరా! మేము పొద్దంతా పనిచేసి అలిసిపోయి నిద్రపోదామంటే అది ఒకటే మోగుతుంది. రాత్రంతా కాళ్లు చేతులు ఒకటే గుంజుతుండే. పోయి పోయి ఇప్పుడే నిద్ర పడుతుండగానే సెల్ ఏమో చెవిలో శంఖం ఊది నట్టే మోగుతుంది" అనుకుంటూ లేచింది శోభ.

నిద్ర కళ్లను తుడుచుకుంటూ ముందు రూం లోకి వచ్చింది. సెల్లును పట్టుకుని అలారం బంద్ చేయాలని చూసింది. కానీ దాన్ని బంద్ చేయడం తెలువక సెల్లు అటు ఇటు తిప్పి, ఏదో ఒకటి ఒత్తి, "ఇది బంద్ కాల్లేదు రా" అని కొడుకు దగ్గరికి వెళ్ళింది శోభ. కొడుకుని చూడగానే గుండె ఆగిపోయినంత పని అయింది.

"ఓ కొడుకో" అంటూ పెద్ద కేక వేసి కుప్పకూలిపోయింది శోభ.

ఆ శబ్దాన్ని విన్న ఆనంద్ "ఏమైందిరా!!" అంటూ నిద్ర కళ్ళను నలుచుకుంటూ వచ్చిండు శోభ భర్త ఆనంద్. ఆమె మొఖం మీద నీళ్లు సల్లి లేపి, "ఏమైందే! అంతేగానం అరిసినవ్".

"అయ్యో! మన చింటు గాని చూడలేదా?"

" చూడలే, ఎందుకు ఏమైంది?"

"వాడు భయంకరంగా నాలుకెళ్ల పెట్టిండు చూడు". అని ఏడ్చింది శోభ. వెంటనే ఆనంద్ "అతనికి ఏం కాదు ఏడవకు" అని చెప్పి, అతని ఛాతి మీద చెవి పెట్టి చూసి, ప్రాణానికి అపాయం ఏమీ లేదని మనసు కుదుట పరుచుకుని, జండుబాం తెచ్చి కాళ్లకు చేతులకు రుదిండు.

అయినా అతనిలో కదలికలు ఏమాత్రము లేవు.

చేతికి ఎదిగిన కొడుకు కు ఏమైంది! ఎవరన్నా ఏదన్నా చేసిరా! రాత్రి మంచిగానే ఉండే. పరీక్షలు ఉన్నవని మంచిగా చదువుతుండే. రాత్రి రాత్రికే ఏమైంది కొడుక నీకు.. అని శోకం పెట్టి ఏడుస్తుంది శోభ.

ఆమె ఏడుపు విని చుట్టుపక్కల వాళ్లు అక్కడికి వచ్చినరు.

అక్కడికి వచ్చిన వారంతా తలా ఒక ఆలోచన చెబుతున్నరు.

"బాస్మియా కాడికి తీసుకొని పోండి. ఆయన మంత్రిస్తే తొందరగా తగ్గుతుంది" అని అంటే మరొకరు "ఎరుకలి ఎట్టేయ్య కాడికి తీసుకొని పోతే మంచిగ చూస్తడు. మొన్న మా అక్క కొడుకు ఇట్లనే చేస్తే అతని దగ్గర చూపించినరు. ఇప్పుడు ఆ పిల్లగాడు మంచిగా ఉండు" అని పక్కింటి సుజాత చెప్పింది. వీరి మాటలు ఏవి వినపడుత లేవు శోభకు. రాత్రి అమవాస కదా నా కొడుకుకు ఎవడో పాటి చూసుకోండు అందుకే రాత్రి రాత్రికి క్రింది గుడ్డు మీదకి మీది గుడ్డు కిందికి చేసిండు. నిన్న మా ఇంటికి పొద్దు పొద్దుగాల శివయ్య వచ్చిండు. వాడు ఇప్పుడు ఇప్పుడే మంత్రాలు నేర్చుకుంటండని అందరూ అంటున్నరు.

వాని పని అయి ఉంటది అని మనసులో అనుకుంటుంది శోభ. అంతలో ఆశా వర్కర్ వచ్చి ఈ అబ్బాయిని తొందరగా దావఖాన కు తీసుకపోండి. ఇప్పటికే ఆలస్యం అయింది. శోభ, ఎవరి మాటలు నమ్మకు నా మాట విని తొందరగా పోండి అని చెప్పింది. వెంటనే పక్కింటి మల్లేశం ఆటో తెచ్చిండు. ఆనంద్, శోభ, బాబును తనమీద పడుకో పెట్టుకున్నరు. వారితో పాటు ఇంచుమించు ఇరవై మంది ఆటో లో కూర్చున్నరు. శోభ, కొడుకు దిక్కు చూస్తూ, ఎప్పుడు లేస్తావ్ కొడుకా అంటూ లోలోపల కుమిలిపోతుంది. కొడుకు మాత్రం మూసిన కన్ను తెరవటం లేదు. ఆటో కదిలింది. ఊరంతా వచ్చి చూస్తున్నరు.

శోభ కంటి నీరు కట్ట తెగిన చెరువులే ఆగకుండా కారుతూనే ఉన్నవి. అందరూ ఆమెతో పాటు కన్నీరు పెట్టుకున్నరు.

అక్కడికి వచ్చిన కొంతమంది “ఏమి కాదు శోభ నీ కొడుకుకు మంచిగయితది” అని ధైర్యం చెప్పి పంపినరు.

ఆటో స్పీడ్ గ పోతుంది ఆటో లో ఉన్న ఓ పెద్దమనిషి తన దగ్గర ఉన్న తాళంచెవి తీసి ఆ బాలుని చేతిలో పెట్టిండు ఫిట్స్ ఏమన్నా వస్తే తక్కువ అయితదని తాళంచెవి పెట్టిండు. అయినా కూడా ఆ బాబు లో ఏ చలనం లేదు. మండలం లోని ఆర్ఎంపీ శ్రీను డాక్టర్ మంచిగా చూస్తడని అతని దగ్గరకు తీసుకు పోయినారు.

డాక్టర్ ఆలు ఏసి చూసి “ఈ బాబు ని హైదరాబాద్ కు తీసుక పోండి” అని చెప్పిండు.

“ఎందుకు సార్ ఏమైంది? అని ఆనంద్” అడిగిండు.

భయపడేది ఏమీ లేదు కానీ ఎందుకైనా మంచిది పెద్ద డాక్టర్ కు వెంటనే చూపించాలి అని అన్నడు డాక్టర్ వెంటనే వారు ఒక కారు మాట్లాడుకుని హైదరాబాద్ చేరుకున్నారు. ఓ ప్రైవేట్ ఆస్పటల్ అడ్మిట్ చేసింర్రు. డాక్టరు అన్ని పరీక్షలు చేసిండు. ముందుగా అతనికి ఇంజక్షన్ చేసీ, గ్లూకోస్ పెట్టిండు. ఒక్క రోజుకు ఏభై వేలు ఖర్చవుతుంది. ఆపతి అనగానే బంధువులు, తెలిసినవారు అందరూ తలా కొంత సహాయం చేసినారు. కొడుకుకు ఎప్పుడు మంచిగ అయితదో అని బెంగ పెట్టుకొంది శోభ. అన్నం తినటం మానేసింది.

మూడు రోజుల తర్వాత అతడు కళ్ళు తెరిచి “అమ్మ! ఎందుకు ఇక్కడ ఉన్నాం ఎప్పుడు వచ్చినం” అని ప్రశ్నల వర్షం కురిపించిండు.

శోభ “ఏమి లేదు కొడకా రాత్రి నీకు కొంచెం జ్వరం వస్తే తీసుకువచ్చినం అని చెప్పింది.

అంతలోనే చింటూ అని పేరు పెట్టి పిలిచింది నర్స్.

వెంటనే శోభ. “నా కొడుకే మేడం” అనగానే

“డాక్టర్ పిలుస్తున్నడు నీ కొడుకుని తీసుకుని పో” అని చెప్పింది.

అయ్యో మా ఆయన ఇప్పుడే అన్నం తినటానికి కిందికి పోయిండు అని మనసులో అనుకుంటూ కొడుకుని తీసుకుని డాక్టర్ దగ్గరికి వెళ్ళింది. రెండు చేతులు జోడించి “నమస్తే సార్” అంటూ తన చేతిలో ఉన్న రిపోర్ట్స్ డాక్టర్ కి ఇచ్చింది శోభ.

డాక్టర్ చూసి “ఏం పేరు బాబు” అని అడిగిండు డాక్టర్.

“నా పేరు చింటు” అని చెప్పిండి.

“ఏ క్లాసు చదువుతున్నవు?

“ఇంటర్ సెకండియర్ సార్”.

“ఏ గ్రూపు? ఏ కాలేజీ?”

“బైపీసీ, గౌట్ కాలేజీ సార్”.

“సెల్లు ఎన్ని గంటల దాకా చూస్తున్నవ్?

మౌనంగా తలదించుకుండు చింటూ.

“పబ్జి, ఫ్రీ ఫైర్ ఆడుతున్నవా?”

నేను ఆడేది ఇతనికి ఎట్లా తెలిసింది అని మనసులో అనుకొని మౌనంగా ఉన్నడు చింటూ.

“ఏంది చింటూ డాక్టర్ అడుగుతుంటే చప్పుడు చేయకుండా ఉంటవు చెప్పురా డాక్టర్ అడుగుతుండు”.

“అవునమ్మా నీ కొడుకు సెల్లులో ఏమి చూస్తుండో అని ఒక్కసారైనా గమనించినవ అని అడిగిండు డాక్టర్”. “చూడలేదు

సార్ మేము పొద్దున లేస్తే పనికి వెళ్తాను సార్. ఎప్పుడన్నా మా అమ్మకు ఫోన్ చేయరా అంటే నాకు క్లాసు నడుస్తుందని అంటడు. నా కొడుకు బాగా చదువుకోవాలని అనుకుని వాడి దగ్గరే సెల్లు ఉంచినం సారు" అని అమాయకంగా చెప్పింది శోభ

"ఇకనుండి నీ కొడుకుకు సెల్లు ఇవ్వవద్దు.

"ఎందుకు సార్" అని అడిగింది శోభ. "ఏమీ లేదమ్మా నీ కొడుకు బాగా పబ్జి ఫ్రీ ఫైర్ అనే ఆటలు ఆడుతుంది. అవి మంచివి కావు.ఆ ఆటల కోసం ఎప్పుడు సెల్లు చూస్తుండు. దానివల్ల నీ కొడుకు బ్రెయిన్ లో ఉన్న నరాలు దెబ్బ తింటున్నవి. బ్రెయిన్ లో కొంచెం మచ్చ వచ్చింది" అని చెప్పి, మందులు వాడితే తగ్గిపోతుందని చెప్పండు డాక్టర్.

బ్రెయిన్ లో మచ్చ అనే మాట వినగానే శోభకు చక్కెరొచ్చినట్లయింది.

వెంటనే డాక్టర్ ఆమెను గమనించి "ఏం కాదమ్మా భయపడేది ఏమీ లేదు. మీరు సాధ్యమైనంత వరకు నీ కొడుకు సెల్లు ఇవ్వకూడదు".

"వాడు చదివేది ఫోన్ చూసే కదా సార్. సెల్లు చూడకపోతే వాడి చదువు ఆగమై పోదు"?

"సెల్లు చూస్తే నీ కొడుకు ఆగమైతడు" అని చెప్పి,

చూడు బాబు సెల్లు చూడకు. సెల్లు చూస్తే కళ్ళకు మంచిది కాదు. నీ బ్రెయిన్ కు మంచిది కాదు. చిన్న వయసులోనే చాలా ఇబ్బందుల్లో ఉన్నావ్ అంటూ ఎన్నో ఆరోగ్య సూత్రాలు, వివిధ ఎక్సర్సైజులు చేయాలని చెప్పిండు. శోభ అనుమానాలు తీరిపోయినవి. తన భర్త రాగానే డాక్టర్ చెప్పిన విషయాలన్నీ చెప్పింది శోభ. ఆనాటినుండి శోభ తన కొడుకు ను గమనిస్తూ వుంది. తనకు తెలిసిన వారికి బంధువులకు తన కొడుకు స్నేహితులకు అందరికీ సెల్లు చూడొద్దని, సెల్లు చూస్తే ఏం జరుగుతుందో అని డాక్టర్ చెప్పిన విషయాలన్నీ చెబుతుంది.

**సిస్టర్ అనసూయ**
నల్గొండ
8074573716.

కవిత

# డెజావు...(భ్రమ)



**- రోహిణి వంజారి**

మానభంగం జరిగిందా..
అబ్బే..మీ అనుమానం అంతే
జరిగినట్లు ఒక్క ఆనవాలు కనపడితేనా
మేము మానం మీద మసిపూసి
మారేడుకాయ చేసేస్తాంగా..
నాలుక తెగ కోశారా..
ఊరుకోండి చాలుగాని .. అంతా మీ భ్రమ
మేము తమ్మినైనా బొమ్మిని చేసేస్తాంగా..
మీకు డబ్బు, అధికారం ఉందా చెప్పండి
ఉన్నది లేనట్లు..లేనిది ఉన్నట్లు
మేము తారుమారు చేసేస్తాంగా..
సాక్ష్యాలా.. మీ పిచ్చిగాని
బూడిద కూడా ఆనవాలుకు
దొరకకుండా చేయడం మాకు
వెన్నతో పెట్టిన విద్య..
ప్రజలా.. పిచ్చి మొహాలు
రకరకాల భ్రమల్లో పరిభ్రమిస్తుంటారు
మరో కేసు వచ్చే వరకే ఈ భ్రమ..
అన్యాయం జరిగిన బిడ్డ మనీషాకు
కన్నీటితో...

# నేనూ... నా ఆర్ట్



- సంధ్య తిరునగరి







**నా స్వీయ పరిచయం**

| | | |
|---|---|---|
| పూర్తి పేరు | : | తిరునగరి సంధ్య |
| కలం పేరు | : | స్యాండీ |
| తల్లి (పుట్టింటి) పూర్తి పేరు | : | యడవల్లి శైలజ |
| తండ్రి పేరు | : | తిరునగరి శ్రీనివాసరావు |
| ప్రస్తుత నివాస స్థలం | : | పాండురంగాపురం గ్రామం, ఇంటి నెంబర్ 6-36, బల్లేపల్లి పోస్ట్ ఖమ్మం జిల్లా, తెలంగాణ రాష్టం, 507002 |
| ఇష్టమైన కవులు/రచయితలు | : | మీరా బాయి, శ్రీశ్రీ |
| ఇష్టమైన పుస్తకాలు & అభిరుచులు | : | డ్రాయింగ్, పుస్తకాలు చదవడం |
| వృత్తి & ప్రవృత్తి | : | కవితలు రాయడం,డ్రాయింగ్ వేయడం |
| విద్యార్హతలు | : | డిగ్రీ, పీజీ |





| | |
|---|---|
| చదువు నేర్పిన గురువు పేరు(ssc) | : రమణా గారు |
| ఆధ్యాత్మిక గురువు | : శైలజ గారు |
| సాహిత్య గురువు | : శైలజ గారు, సాధనాల వేంకట స్వామి నాయుడు గారు, లెనిన్ శ్రీనివాస గారు |
| సాహిత్య రచనలకు ప్రేరణ | : మీరా బాయి |
| స్థాపించిన వాట్సప్ సాహిత్య గుంపుల లింకు | : తపస్వి, మానస చిత్రకారులు |
| గీచిన చిత్రాలు | : మారాకుల సవ్వడి, అక్షర సైనికులు, ప్రేమ పుష్పాలు, అమ్మకు పోస్ట్ చేయని ఉత్తరం |
| నిర్వహించిన సదస్సులు | : వికాస వేదిక సాంస్కృతిక సేవ సమాఖ్య బాలల కన్వీనర్ కథలు, చిత్రలేఖనం కోఆర్డినేటర్ |
| పొందిన పురస్కారాలు | : సాహిత్య రత్న , ప్రపంచ మహా సభలు 2017, కాళ్లా గారి జయంతి సందర్భంగా ఎస్ ఆర్ అండ్  బీజీ ఎన్ ఆర్ కాలేజీలో నిర్వహించిన చిత్రలేఖనంలో రెండవ బహుమతి పొందాను. |
| పూర్తి తపాల చిరునామా | : పాండురంగాపురంగ్రామం, ఇంటి నెంబర్ 6-36, బల్లేపలి పోస్ట్, ఖమ్మం జిల్లా, తెలంగాణ రాష్టం 507002 |
| మెయిల్ | : saandytirunagari@gmail.com |
| దూరవాణీ సంఖ్య | : 9121546695 |
| మీ అభిప్రాయము | : ఇలా పరిచయం చేయడం చాలా బాగుంది అండీ |
| చిత్రాలు | : మారాకుల సవ్వడి, అక్షర సైనికులు, ప్రేమ పుష్పాలు, అమ్మకు పోస్ట్ చేయని ఉత్తరం, పుస్తకాలకు ముఖ చిత్రాలు వేసాను, సాహిత్య రత్న, ప్రపంచ మహా సభలు 2017 |
| రచనలు | : ప్రజాశక్తి మరియు అనేక సంకలనంలో ప్రచురితం |
| హామీ పత్రము | : ఈ  స్వీయ పరిచయం అంత నిజమే అబద్దం కాదు |

# స్వేచ్ఛ



- సరోజన బోయిని

ఒక స్త్రీ మనసు మౌనంగా తన తానే చెప్పుకునే. మెదడులోని ఆలోచన సుడి గుండాల వ్యధ, అంత రంగ ఆవేదన. నేను ఇప్పుడు దాన్ని ఎలా ఆవిష్కృతం చేయాలో కూడ తెలియని ఒక తిక మక.

మరి ప్రతి మహిళ ఈ ఆలోచన సుడి గుండాల మధ్య నలిగిపోతుందా అంటే. ఏమో...! ఈ ప్రశ్నకు సమాధానం మౌనమే అయినప్పుడు. అందులో ఆవేదన అంత కూడ ఆ మనసుకు మాత్రమే తెలుస్తుంది గా.

స్త్రీ తనకు అర్థం కాని విషయాన్ని మాత్రమే ఎదుటి వాళ్ల దగ్గర తెలుసుకోవడానికి ప్రయత్నిస్తుంది.

కానీ నీకు చెప్పడం దేనికి...? నువ్వు తెలుసుకొని ఎమ్ చేస్తావ్ ..? నీకు చెప్పాల్సిన అవసరం ఎమ్ ఉంది..?

ఈ ఆహంకారపు ప్రశ్నలు. సామరస్యంగా సమాధానం చెప్పక పోను. తిరిగి ఇవ్వన్నీ ఒక సమస్యగా.. తను చేసిన ప్రయత్నమే ఒక ప్రశ్న లా తన ముందు నిలబడటం.

నాకు ఉన్న స్వేచ్ఛ నీకు సమాధానం సంజాయిషి చెప్పుకోలేనంత. నా జీవితం నా ఇష్టం అని నీకు బదులు ఎందుకు చెప్తాను అని ఒక లింగ వివక్ష తో కూడిన ఓ!సమాజమా. ఇద్దరికి మనసు ఉంటుంది. ఆ మనసుకు తెలుసుకోవాలన్న ఆరాటం ఉంటుంది. అది మరిచిపోయిన కుళ్ళిన సమాజపు మానసిక రుగ్మత. దీనికి మందు లేక పోను.

నీ స్వేచ్ఛ ఇంత వరకే నువ్వు ఉన్న పరిధిలోనే నీ ఆలోచన బందీ కావాలి అని ఆంక్షల తో తెలుసుకోవాలన్న ప్రశ్నకు ఎంత తపన ఉన్న సమాధానం మౌనం మే అయినప్పుడు. ఇక తను అక్కడే ఆగిపోతుంది. తన ప్రశ్నలన్నింటికి మౌనమే ఒక ముగింపు గా.

స్త్రీ కి ప్రశ్నించే స్వేచ్ఛ ఉన్న కూడ తనకు తానే కళ్లెం వేసుకొని. తన మనసు లో ఎంత వ్యధ ఉన్న అది తన మనసులోనే దాచుకుంటుంది.

ఓ! సమాజమా ఒక్క సారి ఆలోచించు.

మగువ తనను నన్ను అడిగే స్వేచ్ఛ నీకు మాత్రం ఎక్కడిది అని ఎదురు ప్రశ్నించకుండ. నమ్మకానికి నిలువెత్తు రూపం ల వుండే ఆ స్త్రీ మూర్తికి.

అడిగే అవకాశం, తెలుసుకునే స్వేచ్ఛను ఇవ్వు.

ముఖ్యంగా ఎదిగే ఆడపిల్లలకు ఈ స్వేచ్ఛ కావాలి. సమాజ ధోరణి గురించి, నైతిక విలువల గురించి తెలుసుకునే స్వేచ్ఛ ఇవ్వాలి.

తన సందేహాలకు, ఒక విషయం గురించి తెలుసు కోవాలన్న కుతూహలనికి అర్థం చేసుకొని ఆ విషయం గురించి పూర్తిగా తెలుసుకునే స్వేచ్ఛ ఇవ్వాలి.

కానీ మన సమాజం ఇప్పడికి ఆడపిల్లల విషయం లో వివక్షనే చూపుతుంది. సమాజ స్థితి, గతులు గురించి తెలుసుకునే స్వేచ్ఛ ఎంత మంది ఇస్తున్నారు..?

ఏదైనా సంఘటన గురించి అడిగినప్పుడు. నీకు అది అనవసరమా? నీ పరిధి ఇంత వరకే అని ప్రశ్నించే తన గొంతును మూగబోయేలా చేస్తుంది.

కానీ సమాజం లో ఆడ, మొగ ఇక్కడ లింగ భేదం లేకుండ మంచి, చెడు ల గురించి అవగాహన కలిగించడం ముఖ్యం. చెడు గురించి తెలుసుకునప్పుడే గా.. మంచిని గుర్తించేది.

కానీ మంచి ని మాత్రమే తెలుసుకో చెడు గురించి నీకు ఎందుకు అని వాళ్లకు ఆడిగే స్వేచ్ఛ లేకుండా చేస్తున్నారు.

కానీ తన మనసులో కలిగిన ప్రశ్నకు సమాధానం నిర్భయంగా తెలుసుకునే స్వేచ్ఛ ఇవ్వాలి. లేదంటే సమాధానం దొరకని ఆ ప్రశ్నలు ఆ చిన్ని బుర్రలను మనో వేదనకు గురిచేస్తాయ్.

నీకెందుకు, నీకేం తెలుసు? అనకుండా ఇది నువ్వు తెలుసుకోవాలి అని తన సమస్య గురించి, తను వెతికే సమాధానం గురించి పరిణితిని పెంచుకునే స్వేచ్ఛ ఇవ్వాలి.

కానీ ఎదిగే ఆడపిల్లల విషయంలో తను ఏ విషయం అయిన సరే స్వేచ్ఛగా చర్చించే అవకాశం ఇవ్వలేక పోతున్నారు. ఆడపిల్ల అంటే అనుకువ, చెప్పింది మౌనంగ వినడం అంతే! ఎదురు ప్రశ్నించడంలో, తనకు నచ్చిన బట్టలు వేసుకోవడంలో ,నచ్చిన స్నేహం చెయ్యడం లో వారికి ఎంత మంది స్వేచ్ఛను ఇస్తున్నారు..

తన జీవితంలో జరిగే ప్రతీ సంఘటన గురించి తల్లి,తండ్రి కి నిర్భయంగా చెప్పుకునే స్వేచ్ఛ ఉండాలి. అప్పుడే పిల్లల మానసిక పరిపక్వత గురించి తల్లి,తండ్రి కి కూడ తెలుస్తాయి. వాళ్లు అడిగే ప్రశ్నలకు మౌనం సమాధానం కాకుండ అన్ని విషయాల గురించి క్షున్నంగ తెలుసుకునే స్వేచ్ఛ ఇవ్వాలి.

– సరోజన బోయిని.



పరిచయం


# నా సుదీర్ఘ హత్య గురించి నేనే

"చాలా మంది లాగే నాకూ కవిత్వం రాయడం రాదు... కవిత్వం అంటే ఏమిటో కూడా నాకు తెలియదు. లాక్షణికులు చెప్పిన రసాత్మకత, ఇతివృత్తం, ఆత్మ ధ్వని, పరిమళం ఇవేవి నాకు తెలియవు. శిల్పం, అభివ్యక్తి వంటివి ఇందులో వుండవు. ఇందులో ఉన్నదంతా నా గోల నా సొంత గొడవ.. ఇందులో నేను మాత్రమే.. నేను చూచింది. విన్నది, చదివింది మాత్రమే కాదు.. అనుభవిస్తున్నది కూడా అది అవమానమా.. అనుమానమా., సందేహమా.... సంఘర్షణా., అస్థిత్వపోరటమా... ఏమో ఏదైనా కావచ్చు...

ఏ వాదము తెలియదు నాకు. నా గురించి మాత్రమే మాట్లాడుతాను నేను. చెట్టు నుండి రాలుతున్న ఆకునై, పిందె నుండి రాలుతున్న పువ్వునై, నా నుండి నేను విడివడే క్రమంలో నేను నా బాల్యాన్ని అనుభవిస్తున్నా.. నన్ను చుట్టుకున్న వాటిని వదులుకుంటూ, నన్ను నేనే తొలుచుకుంటూ వలుచుకుంటూ ATTACHMENT WITH DITTACHMENT పెంచుకుంటున్న మహాభోగిని.

గత పుస్తకం (కాలాన్ని జయిస్తూ నేను)లో చెప్పినట్టు నేను ఒక నత్తను. నా కవచాన్ని నా జీవితాన్ని నా ప్రపంచాన్ని నేనే మోసుకుంటూ తిరుగుతున్న నత్తగుల్లను. గుల్లలోకి నత్త ఎలా చేరిందో తెలియదు కాని గుల్ల ఉంది. గుల్ల(గంప) నిండా ఎతలు కతలున్నాయి, గుల్లయిన (ఖాళీ అయిన) ప్రపంచం వుంది. ఈ నా ప్రపంచం లో హత్యలు, ఆత్మహత్యలు, దోపిడీలు, తేనెల మాటలు తీసిన గోతులు, 'మాయి' గుంటలో పాతేసిన సత్యాల వంటి జీవితాలు, స్నేహాల మోహాల ద్రోహాలు, బొడ్డు పేగు కోసేందుకు తెగిన పీకలు, నిజాయితీ ముసుగులో నగ్న నటనలు, సానుభూతుల సహచర్యాలు, ఎర వేసి ఎరలవుతున్న వేలం వెర్రులు, వేటగాళ్ళను వేటాడ వలసిన అవసరాలు, అప్రకటిత నిర్ణయాత్మక యుద్ధాలు, నిర్మాణాత్మక ఉద్యమాల అమ్మకాలు, మార్కెట్టు మయమైన సంబంధాలు... సకల సర్వాలు కలిసిన ఏకైక ఏకాకిని నేను. ఏక సైన్య సమూహాన్ని నేను.

ఈ నేను చేసిన ఒక ప్రయత్నం చెప్పే ముందు ఒక చిన్న




కథ మన తాతల కథ కోతుల కథ. ఏదైనా ఒక కోతి చెట్టు మీద నుండి జారిపడి చచ్చిపోతే చుట్టూ మూగిన కోతులు ముందు దాని గుప్పిటి చూస్తాయట, గుప్పిట్లో ఆకలు కనిపిస్తే సంతాపం కొనసాగిస్తాయట, ఖాళీగా వుంటే ఒక్కొక్కటి ముఖం తిప్పుకొని పోతాయట... అర్థమయ్యింది కదా కోతుల ఫిలాసఫీ. ఆపదొచ్చినప్పుడు ప్రయత్నించకుండా చస్తే కోతులు సానుభూతి కూడా చూపవన్నమాట. చచ్చినకోతి చేతిలో సాక్ష్యం పుస్తకం ఈ ప్రయత్నం.

నేను చదువుకుంటూ ప్రపంచాన్ని చదివే ప్రయత్నంలో నా ప్రమేయం లేకుండా నపై రాలే దుమ్ము, ధూళీ, బూడిద, దోమలు....... నిరంతర వర్తమానమౌతున్న హాస్యాలు, అపహాస్యాలు, అశ్రువులు, ఆప్తులు, ఆర్తులు ఇందులో ఈ నా

ప్రపంచంలో చూడొచ్చు.

అయితే మరో చిన్న కథ ఒక అడవి కాలిపోతుంటే.. అందులో వున్న పెద్దా చిన్నా జంతువులు, పక్షులు అన్నీ అడవి వదిలి వెళ్ళాయట. ఒక చిన్నపక్షి కాలుతున్న అడవికి దగ్గరలో వున్న చెరువుకూ మధ్య ఆగకుండా తిరుగుతుందట. ఇదంతా అటుగా వెళుతున్న గంధర్వులు గమనించి ఏమి చేస్తున్నావని పక్షినడిగారట, 'అయ్యో అడివి కాలిపోతుంది ఆర్పేందుకు ముక్కుతో నీళ్ళు తెచ్చి చల్లుతున్నా' అని సమాధానమిచ్చిందట. గంధర్వులు నవ్వి "ఎంత చిన్న పక్షివి ఎంత తెలివి తక్కువ ప్రయత్నం నీది" అని అపహాస్యం చేసారట. "నా ఈ ప్రయత్నమే ఆ అగ్ని పై నా ధిక్కార ప్రకటన, ఈ ప్రయత్నమే లేకపోతే నేను జీవించి కూడా మరణించినట్టే" అని సమాధానమిచ్చిందట. ఆ మాటలు విన్న వాళ్ళు కాలుతున్న అడవిని చల్లార్చినారట.

పారిపోయిన పక్షులు తిరిగొస్తాయా.. కొత్త పక్షులు వస్తాయా అన్నది. అప్రస్తుతం అడవి దక్కింది ఆనందం.

ఆ పక్షి ప్రయత్నమే ఈ 'సుదీర్ఘ హత్య'..

ఇది నా ధిక్కారం.. నా ప్రయత్నం..


మీ చేతిలో నా సుదీర్ఘ హత్య..

మీరు చెప్పాలి కొనసాగేదేంటి..?

కొడిగట్టక మిగిలి నిలబడేదేంటి..?

–జ్వలిత–

ఖమ్మం, నవంబర్ 2009



# బాల బహుళ






SANVI. K
G2E






T. SRESHTA SAI
Vth Class
Visakhapatnam






S. ISHIKA

Printed at JD Publications, Hyderabad

Price : 60/-